www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 28-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 29 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్ల పక్షం; తిథి: పాడ్యమి రా.9.11 తదుపరి విదియ; నక్షత్రం: భరణి రా.9.38 తదుపరి కృత్తిక; వర్జ్యం: ఉ.9.02-10.26; దుర్ముహూర్తం: మ.12.37-1.28, మ.3.09-3.59; అమృతఘడియలు: సా.5.26-6.50; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.54; సూర్యాస్తమయం: 6.31 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బినామీల గుట్టు విప్పని హరిరామ్!

ఆస్తుల లెక్క రూ.200 కోట్ల పైమాటే

కాళేశ్వరం ఈఎన్‌సీకి 14 రోజుల రిమాండ్

చంచల్‌గూడ జైలుకు తరలింపు

కస్టడీ పిటిషన్ దాఖలు చేయనున్న ఏసీబీ

3

22 గంటలు ట్రెక్కింగ్ చేసొచ్చి

ఘాతుకం!

2

కొండలు, గుట్టల్లో నడిచివచ్చి, పర్యాటకులను చంపిన ఉగ్రవాదులు.. రెండు సెల్‌ఫోన్లు చోరీ

ఏకే47, ఎం4 అసాల్ట్ రైఫిల్‌తో మారణకాండ

దాడిని చెట్టుపై నుంచి చిత్రీకరించిన స్థానిక ఫొటోగ్రాఫర్.. దర్యాప్తులో ఆ వీడియో కీలకం

"కాంగ్రెస్సోళ్లు మా అంత సిపాయిలు లేరని చెబితే జనం నమ్మిండ్లు, బోల్తా పడ్డరు. గల్లంతైండ్లు. ఆరు చందమామలు పెడతం. ఏడు సూర్యుల్లు పెడ్తం అని నమ్మబలికి, ప్రజలను దగాచేసి, మంచిగున్న తెలంగాణను ఆగం చేసిండ్లు. ఇప్పుడేమో మమ్మల్నెవరూ నమ్ముతలేరు. అప్పు పుడతలేదు. ఏడినుంచి తెచ్చియ్యాలే? అని మాట్లాడుతున్నారు. ఇంత దగా ఉంటదా? ఓట్లు వేసుకొని ఇలా చేస్తారా? కాంగ్రెస్ పరిపాలన చూస్తుంటే.. రాష్ట్రం ఆగమైతుంటే.. నా మనసుకు బాధ కలుగుతోంది"

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా హాజరైన జనం; (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న కేసీఆర్



మనసు కాలుతోంది

కాంగ్రెస్ పాలన చూస్తుంటే బాధేస్తోంది.. మంచిగున్న రాష్ట్రాన్ని ఆగం చేస్తున్నారు

నంబర్‌వన్ నుంచి 14వ స్థానానికి దిగజార్చారు

ఎక్కడ చూసినా కరెంటు కోతలు.. సాగునీరు లేదు

తెలంగాణ రైతాంగం మళ్లీ దోపిడీకి గురవుతోంది

అప్పుడూ.. ఇప్పుడూ తెలంగాణకు నం.1 విలన్ కాంగ్రెస్సే

భూముల అమ్మకం తప్పుకాదు.. అవసరమైతేనే అమ్మాలి

11 ఏళ్లలో రాష్ట్రానికి బీజేపీ 11రూపాయలైనా ఇచ్చిందా?

కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్'ను వెంటనే ఆపాలి

సర్కార్‌ను మేమెందుకు పడగొడ్తం.. ప్రజలే చూసుకుంటరు

మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెచ్చుకుందాం

ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్

వరంగల్/హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం పాలిస్తున్న తీరును చూస్తుంటే.. తనకు బాధ కలుగుతోందని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అన్నారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఆగం చేస్తుంటే తన మనసు కాలుతోందని, దుఃఖం వస్తోందని తెలిపారు. తమ హయాంలో తెలంగాణలో భూముల ధరలు పెంచితే ఇప్పుడు దారుణంగా పడిపోయాయన్నారు. ఎక్కడ చూసినా కరెంటు కోతలే ఉన్నాయని, ప్రజలకు తాగునీరు, పంటలకు సాగునీరు అందడం లేదని, తెలంగాణ రైతాంగం మళ్లీ దోపిడీకి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూలగొడుతోందని మండిపడ్డారు. ఏడాదికి రూ.10 నుంచి రూ.15 వేల కోట్ల ఆదాయాన్ని తాము పెంచితే.. రాష్ట్రాన్ని దివాలా తీయిస్తున్నారని, అవివేకంతో నాశనం చేశారని ఆరోపించారు. పదేళ్లలో రాష్ట్రాన్ని తాము అద్భుతంగా తీర్చిదిద్దితే.. ఒక్క ఏడాదిలోనే పరిస్థితి అంతా తలకిందులైందని

మిగతా 13వ పేజీలో...

తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలనా?

సోనియాకు సాష్టాంగ నమస్కారం మరిచారా?

కాంట్రాక్టర్లకు బకాయిలు, సర్పంచ్‌లకు బాకీలు కేసీఆర్ హయాంలో పెట్టినవే..

మేం ఇబ్బంది పెట్టాలనుకుంటే సభ జరిగేదేనా?

కేసీఆర్‌ను నిలదీసిన మంత్రి పొంగులేటి

నియంతలా కేసీఆర్ మాటలు: సీతక్క

సోనియా చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

14

కేసీఆర్‌లో ఇంకా గర్వం పోలేదు: మంత్రి జూపల్లి

పహల్గాం ఉగ్ర దాడితో దేశ ప్రజల

రక్తం మరుగుతోంది

బాధిత కుటుంబాలకు న్యాయం చేసే పూచీ నాది

ఉగ్రవాదులకు, కుట్రదారులకు అత్యంత కఠిన శిక్ష

కశ్మీర్‌లో శాంతియుత వాతావరణాన్ని చూసి శత్రువులు తట్టుకోలేకపోతున్నారు.. అందుకే ఇంత కుట్ర: మోదీ

యుద్ధానికి సిద్ధంగా ఉన్నామంటూ 'ఎక్స్'లో నేవీ పోస్ట్

అరేబియా సంద్రంలో నౌకా విధ్వంసక క్షిపణి పరీక్షలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి చిత్రాలు చూసి దేశంలోని ప్రతి పౌరుడి రక్తం మరుగుతోందన్న విషయం తనకు అర్థమవుతోందని.. బాధిత కుటుంబాలకు తగిన న్యాయం జరుగుతుందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. వారికి న్యాయం చేసే పూచీ తనదని.. పర్యాటకులపై దాడికి పాల్పడ్డవారికి, దాడి వెనుక సూత్రధారులకు అత్యంత కఠిన శిక్ష విధిస్తామని మరోసారి హామీ ఇచ్చారు. 'మన్ కీ బాత్' 121వ ఎపిసోడ్‌లో ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించి విచారాన్ని వ్యక్తం చేసిన ప్రధాని.. దేశ ప్రజలందరి హృదయాలనూ ఉగ్రదాడి తీవ్రంగా బాధించిందని చెప్పారు. ఈ దాడిలో తమవారిని కోల్పోయిన బాధితుల ఆవేదనను.. రాష్ట్రాలకు, భాషలకు అతీతంగా దేశంలోని ప్రతి ఒక్కరూ అనుభవిస్తున్నారని, ఈ క్రూర దాడిని ముక్తకంఠంతో నిరసిస్తున్నారని

మిగతా 2వ పేజీలో...

48 గంటల్లోగా కోతలు పూర్తిచేయండి

పొలాలను ఖాళీ చేయండి

పంజాబ్‌లో సరిహద్దు వెంబడి రైతులకు బీఎస్ఎఫ్ ఆదేశాలు!

2

మా 130 అణ్వస్త్రాలు.. మీకే గురిపెట్టాం

మా ఆయుధాలు ప్రదర్శనకు కాదు

సింధు నీళ్లను భారత్ ఆపేస్తే పూర్తిగా యుద్ధానికి సిద్ధమైనట్టే..

పాక్ మంత్రి అబ్బాసీ వ్యాఖ్యలు

పాక్‌కు అండగా ఉంటాం: చైనా

స్మితా సభర్వాల్‌పై వేటు

అప్రాధాన్య పోస్టుకు బదిలీ.. భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

సీఎ‌స్‌గా రామకృష్ణారావు

ఈ ఏడాది ఆగస్టు వరకు పదవీ కాలం

జయేశ్‌రంజన్‌కు కీలక బాధ్యతలు

పరిశ్రమల పెట్టుబడుల సెల్‌కు సీఈవో

మిస్ వరల్డ్ పోటీల బాధ్యత కూడా..

జీహెచ్ఎంసీ కమిషనర్‌గా కర్ణన్

హెచ్ఎండీఏ కమిషనర్‌గా ఇలంబర్తి

కుటుంబ సంక్షేమ కమిషనర్‌గా సంగీత సత్యనారాయణ

దానకిశోర్‌కు కార్మికశాఖ



రామకృష్ణారావు



స్మితా సభర్వాల్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్‌పై వేటు పడింది. పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శిగా.. మిస్ వరల్డ్ పోటీలకు సన్నాహాలు చేస్తున్న ఆమెను ప్రభుత్వం పాత స్థానానికి బదిలీ చేసింది. ఆర్థిక సంఘం(ఫైనాన్స్ కమిషన్) సభ్య కార్యదర్శిగా నియమించింది. ఆదివారం ప్రభుత్వం భారీగా ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై ఆమె సర్కారుకు వ్యతిరేకంగా పోస్టు చేయడం ఇటీవల చర్చనీయాంశమైన విషయం తెలిసిందే.! దీనిపై వివరణ ఇవ్వాలంటూ గచ్చిబౌలి పోలీసులు ఆమెకు నోటీసులు జారీ చేశారు. అప్పటి నుంచే స్మిత బదిలీ తప్పనిసరి అనే ప్రచారం జరిగింది. తాజా నిర్ణయంతో సర్కారు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ప్రపంచ సుందరి పోటీల బాధ్యత నుంచి ఆమెను తప్పించినట్లయింది. కాగా.. సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్‌రంజన్‌కు తాజా బదిలీల్లో పరిశ్రమల శాఖలో మరింత కీలకమైన బాధ్యతలను అప్పగించారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో

మిగతా 12వ పేజీలో...

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

పలు జిల్లాల్లో వాన, ఈదురుగాలుల బీభత్సం

నారాయణపేట జిల్లాలో పిడుగులు పడి ఇద్దరి మృతి

ధాన్యం కాపాడుకునే ప్రయత్నంలో ఒకరు..

పొలం పనుల్లో ఉండగా మరొకరు మృత్యువాత

పలుచోట్ల పిడుగులకు బలైన మూగజీవాలు

13



సీఎం రేవంత్‌కు వినతిపత్రం ఇస్తున్న శాంతి చర్చల కమిటీ నేతలు

నక్సలిజాన్ని సామాజిక కోణంలోనే చూస్తాం

శాంతిభద్రతల అంశంగా పరిగణించం

శాంతి చర్చల కమిటీతో భేటీలో సీఎం రేవంత్ వ్యాఖ్య

ప్రాణం విలువ గొప్పది: కమిటీ చైర్మన్ చంద్రకుమార్

14

కర్రెగుట్టల్లో భారీ గుహ

సేఫ్‌జోన్‌గా వాడిన నక్సల్స్

అర కి.మీ. పొడవు.. అందులో వెయ్యి మంది ఉండొచ్చు

గుహలో బియ్యం, నిత్యావసర వస్తువుల గుర్తింపు

కూంబింగ్‌తో.. గుహను వీడిన మావోయిస్టులు

తెలుగును పరిరక్షించుకోవాల్సిందే

డిగ్రీ వరకూ ప్రథమ భాషగా బోధించాలి

దేవనాగరిలోనే సంస్కృతం పరీక్ష రాసేలా ఉత్తర్వులివ్వాలి

కార్పొరేట్ రంగం చేతుల్లో బందీగా ఇంటర్ విద్య

తెలుగులోనే ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేయాలి

'మన భాష-మన హక్కు'పై చర్చాగోష్ఠిలో వక్తలు

14

పాకిస్థాన్‌కు అండగా ఉంటాం

» భారత్ చర్యలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం: చైనా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: పహల్గాం ఉగ్రదాడి, భారత్ చేపడుతున్న చర్యలను తాము క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని.. ఈ అంశంలో పాకిస్థాన్‌కు అండగా ఉంటామని చైనా పేర్కొంది. పాక్ ఉప ప్రధాని మహమ్మద్ ఇషాక్‌తో ఫోన్‌లో మాట్లాడిన సందర్భంగా చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి ఈ మేరకు భరోసా ఇచ్చారు. "చైనా మిత్రదేశం, వ్యూహాత్మక భాగస్వామి అయిన పాకిస్థాన్ భద్రత గురించిన ఆందోళనను మేం అర్థం చేసుకోగలం. పాక్ తన సార్వభౌమత్వాన్ని నిలుపుకోవడంలో అండగా ఉంటాం. పహల్గాం దాడిపై నిష్పక్షపాత దర్యాప్తు జరపాలన్న పాక్ డిమాండ్‌కు మద్దతు ఇస్తాం" అని పేర్కొన్నారు. మరోవైపు, పహల్గాం ఉగ్రదాడి, పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందంటూ భారత్ కఠిన చర్యలు చేపట్టడంతో.. ఈ అంశాన్ని వివాదాస్పదం చేసేందుకు పాకిస్థాన్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. పహల్గాం ఉగ్రదాడి అంశంలో రష్యా, చైనా జోక్యం చేసుకోవాలని, భారత్ చెబుతున్నది నిజమా, అబద్ధమా తేల్చాలని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ పేర్కొన్నారు. రష్యా అధికారిక వార్తా సంస్థ 'ఆర్ఐఏ నొవొస్తి'తో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "కశ్మీర్‌లో జరిగిన ఘటన కుట్రదారులు ఎవరో తేలుద్దాం. రష్యాగానీ, చైనాగానీ, యూరోపియన్ దేశాలుగానీ ఈ విషయంలో చాలా కీలక పాత్ర పోషించగలవని అనుకుంటున్నాను. ఆ దేశాలు ఒక విచారణ బృందాన్ని నియమించి.. భారత్, మోదీ నిజం చెప్తున్నారా, అబద్ధం చెబుతున్నారా అన్నదానిపై దర్యాప్తు చేయాలి. అసలు విషయం ఏమిటో అంతర్జాతీయ బృందంతో తేల్చాలి.." అని పేర్కొన్నారు.

భారత్‌ను వీడకుంటే మూడేళ్ల జైలు.. 3లక్షల ఫైన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: విధించిన గడువులోగా భారత్‌ను విడిచి తిరిగి వెళ్లకుంటే కఠిన చర్యలు ఉంటాయని పాకిస్థానీలను కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఈ ఆదేశాలు పాటించకుంటే మూడేళ్ల జైలు శిక్షగానీ రూ.3 లక్షల జరిమానాగానీ విధిస్తామని తెలిపింది. లేదంటే రెండు శిక్షలూ విధించే అవకాశం ఉందని తెలిపింది. మెడికల్ వీసాలు ఉన్నవారు మంగళవారంలోగా వెళ్లిపోవాలని ఆదేశించింది. వీసా ఆన్ అరైవల్, బిజినెస్, జర్నలిస్టు వంటి 12 రకాల వీసాలపై వచ్చినవారు ఆదివారం నాటికి, సార్క్ వీసాలు ఉన్నవారు శనివారం నాటికే దేశాన్ని విడిచిపెట్టి వెళ్లాలని ఇంతకుముందే సూచించింది. 'లీవ్ ఇండియా' పేరుతో నోటీసులు పంపించింది.

ఉగ్రవాదులు మతం అడగలేదు!

» కర్ణాటక మంత్రి తిమ్మాపూర్ వివాదాస్పద వ్యాఖ్యలు

బెంగళూరు, ఏప్రిల్ 27: పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి కర్ణాటక ఎక్సైజ్ శాఖ మంత్రి ఆర్‌బీ తిమ్మాపూర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులు మతం అడిగి కాల్చారని తాను భావించడం లేదని వ్యాఖ్యానించారు. శనివారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'తుపాకీతో పేల్చే ఉగ్రవాది కులం, మతం అడుగుతాడా? కాల్చుకుంటూ వెళ్లిపోతాడంతే! ప్రాక్టికల్‌గా ఆలోచించండి' అని వ్యాఖ్యానించారు. ఉగ్రదాడిని మతపరమైన అంశంగా మార్చేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. బీఆర్ తిమ్మాపూర్ వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇది బాధిత కుటుంబాలను అవమానించడమేనని బీజేపీ మండిపడింది.

భారత వ్యతిరేక వ్యాఖ్యలతో అసోం ఎమ్మెల్యే అరెస్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: పహల్గాం ఉగ్రదాడి వేళ పాకిస్థాన్‌కు మద్దతుగా, భారతదేశానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 19 మంది వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో అసోం ప్రతిపక్ష పార్టీ ఏఐయూడీఎఫ్ ఎమ్మెల్యే అనిముల్ ఇస్లాం, పలువురు విద్యార్థులు ఉన్నారు. 2019లో జరిగిన పుల్వామా దాడి ప్రస్తుతం జరిగిన పహల్గాం ఉగ్రదాడి భారత ప్రభుత్వం పన్నిన కుట్రలంటూ ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే అనిముల్ ఇస్లాంను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, కోర్టు ఆయనకు నాలుగు రోజుల రిమాండ్ విధించింది.

వైఫల్యం లేని నిఘా ఏ దేశానికైనా అసాధ్యం: థరూర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: వైఫల్యం లేని నిఘా ఏ దేశానికైనా అసాధ్యమని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ చెప్పారు. పహల్గాం ఉగ్రదాడి ఘటనను ఆయన ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబరు 7న హమాస్ జరిపిన దాడితో పోల్చారు. ప్రపంచంలోనే అత్యంత ఉత్తమ నిఘా వ్యవస్థలు ఉన్న ఇజ్రాయెల్‌పై కూడా హమాస్ దాడి జరిపిందని శశిథరూర్ గుర్తు చేశారు. నిఘా వైఫల్యం అనే అంశంపై చర్చించేకన్నా ప్రస్తుత సంక్షోభ నివారణపై అందరూ దృష్టి సారించాలని సూచించారు.

ఆర్మీ ఆధునీకరణకు విరాళాల సేకరణ అబద్ధం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: ఆర్మీ ఆధునీకరణకు, సైనిక సహాయనిధి కోసం విరాళాలు సేకరిస్తున్నారంటూ, మీకు తోచిన సాయాన్ని చేయాలంటూ వాట్సా‌ప్‌లో చక్కర్లు కొడుతున్న సందేశాన్ని నమ్మవద్దని కేంద్ర రక్షణ శాఖ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. పహల్గాం ఘటన నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు ప్రజల దేశభక్తిని అనుకూలంగా మార్చుకొని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపింది. బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ప్రతిపాదన మేరకు ప్రధాని మోదీ సైనిక సహాయనిధిని ఏర్పాటు చేశారంటూ వాట్సాప్‌లో సందేశం వైరల్ అవుతోంది.

యుద్ధం వద్దనలేదు: సిద్దరామయ్య

బెంగళూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో యుద్ధం వద్దని తాను చెప్పలేదని, యుద్ధం పరిష్కారం కాదని మాత్రమే అన్నానని, అనివార్యమైతేనే యుద్ధం చేయాలన్నానని కర్ణాటక సీఎం సిద్దరామయ్య వివరణ ఇచ్చారు. యుద్ధం విషయంలో శనివారం ఆయన చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నుంచి విమర్శలు వెల్లువెత్తడంతోపాటు పాకిస్థాన్ టీవీ చానళ్లలోనూ యుద్ధంపై భారత్‌లో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయంటూ సిద్దరామయ్య వ్యాఖ్యలను ప్రసారం చేశాయి. దీంతో సిద్దరామయ్య ఆదివారం వివరణ ఇచ్చారు. కాగా, సిద్దరామయ్య వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు మండిపడ్డారు. పాకిస్థాన్‌పై యుద్ధం అవసరం లేదనే వ్యాఖ్యలతో సిద్దరామయ్య పాకిస్థాన్ రత్న అయ్యారని కర్ణాటక ప్రతిపక్షనేత అశోక్ విమర్శించారు. ఇలాంటి వ్యక్తులు నాయకులుగా ఉండటమే మన దేశానికి అతి పెద్ద విషాదమన్నారు. ప్రజలకు సిద్దరామయ్య క్షమాపణ చెప్పాలని మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప డిమాండ్ చేశారు.

కంచె కింద పాక్కుంటూ వెళ్లి.. చిన్న గోతిలో గంటసేపు నక్కి..!

» పహల్గాం ఉగ్రదాడి నుంచి తప్పించుకున్న మైసూర్ టెకీ


ప్రసన్న కుమార్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: పహల్గాంలోని ఉగ్రదాడి నుంచి మైసూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రసన్న కుమార్ భట్ త్రుటిలో తప్పించుకున్నారు. ఆనాటి భయానక పరిస్థితులను, తాము అనుభవించిన ఉద్విగ్న క్షణాలను ఆయన సోషల్ మీడియా వేదికగా వివరించారు. ప్రసన్న తన భార్య, సోదరుడు, వదినతో కలసి 22న బైసారన్ వెళ్లారు. మధ్యాహ్నం. 2.25 గంటల సమయంలో రెండుసార్లు తుపాకీ పేలిన శబ్దం వినిపించింది. తర్వాత కాసేపటికే కాల్పుల మోతలతో పాటు పర్యాటకుల ఆర్తనాదాలు వినిపించాయి. భారత సైన్యంలో సీనియర్ అధికారిగా పనిచేస్తున్న ప్రసన్న సోదరుడికి అది ఉగ్రదాడి అని అర్థమైంది. పరిస్థితిని అంచనా వేసిన ఆయన వెంటనే వీరిద్దరి కుటుంబాలతో పాటు అక్కడే ఉన్న మరో 35- 40మందిని అప్రమత్తం చేశారు. ఉగ్రవాదులు వేచి ఉన్న ప్రధాన ద్వారానికి దూరంగా వారిని తీసుకెళ్లారు. అదృష్టవశాత్తూ అక్కడి కంచె కింద ఒక ఇరుకైన మార్గం కనిపించడంతో అందరూ దాని కిందుగా పాకుతూ అవతలకు వెళ్లి, కొండ కిందకు పరిగెత్తడం ప్రారంభించారు. బురదగా ఉన్న వాలు ప్రాంతం ప్రమాదకరంగా ఉండటంతో కొంతమంది జారి పడిపోయారు. అయినా ఎవరూ పరుగు మాత్రం ఆపలేదు. ఈ క్రమంలో దాడి జరుగుతున్న ప్రాంతానికి కొంతదూరంలో ఒక చిన్న గొయ్యి కనిపించడంతో ప్రసన్న దంపతులు అందులో తలదాచుకున్నారు. మధ్యాహ్నం 3గంటల సమయానికి కాల్పుల శబ్దాలు తగ్గుముఖం పట్టడంతో ప్రసన్న సోదరుడు తన పై అధికారులకు సమాచారం ఇచ్చారు.

పహల్గాం ఉగ్ర దాడితో దేశ ప్రజల

రక్తం మరుగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. "జమ్మూకశ్మీర్‌లో మళ్లీ శాంతియుత వాతావరణం నెలకొంటోంది. పాఠశాలలు, కళాశాలలు తెరుచుకుంటున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా నిర్మాణ పనులు ఊపందుకుంటున్నాయి. ప్రజాస్వామ్యం బలోపేతమై, పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరుగుతోంది. ప్రజల ఆదాయం పెరుగుతోంది. యువతకు కొత్త అవకాశాలు లభిస్తున్నాయి. దేశ శత్రువులు, కశ్మీర్ శత్రువులకు ఇదంతా నచ్చట్లేదు. వారి దీన్ని చూసి ఓర్వలేకపోతున్నారు. ఉగ్రవాదులు, వారి వెనుక ఉండే సూత్రధారులు కశ్మీర్ మరోసారి నాశనం కావాలనుకుంటున్నారు. అందుకే ఇంత పెద్ద కుట్రకు తెగబడ్డారు." అని ప్రధాని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషించేవారి పిరికితనానికి ఈ దాడి నిదర్శనమని వ్యాఖ్యానించారు. "ఉగ్రవాదంపై మనం జరుపుతున్న పోరులో.. దేశ ప్రజల ఐకమత్యం, 140 కోట్ల మంది భారతీయుల సంఘీభావమే మనకున్న అతి పెద్ద బలం, ఉగ్రవాదంపై మన నిర్ణయాత్మక పోరాటానికి ఈ ఐక్యతే ఆధారం" అని మోదీ పేర్కొన్నారు. ఈ సమయంలో ఒక దేశంగా మనందరం బలమైన సంకల్పశక్తిని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఈ ఉగ్రదాడి తర్వాత.. దేశప్రజలందరూ ముక్తకంఠంతో మాట్లాడడాన్ని ప్రపంచమంతా ఆసక్తిగా గమనిస్తోందని చెప్పారు. వివిధ దేశాల నేతలు తనకు ఫోన్ చేసి మాట్లాడారని, లేఖలు రాశారని, సందేశాలు పంపారని.. అందరూ ఈ నీచమైన దాడిని తీవ్రంగా ఖండించారని, బాధితుల కుటుంబాలకు సానుభూతి తెలిపారని మోదీ వెల్లడించారు.

యుద్ధానికి సిద్ధం.. కాల్పులు.. కూల్చివేతలు..

అరేబియా సముద్రంలో భారత నౌకాదళం క్షిపణి సన్నద్ధత పరీక్షలు



పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాక్ 'అణు'బీరాలు పలుకుతున్న వేళ.. భారత నౌకాదళం అరేబియా సంద్రంలో మన యుద్ధనౌకల సన్నద్ధతను మరోసారి పరీక్షించుకుంది. యుద్ధనౌకల నుంచి.. పలు నౌకా విధ్వంసక క్షిపణులను విజయవంతంగా ప్రయోగించింది. సముద్ర జలాల్లో ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎలాగైనా దేశ ప్రయోజనాలను కాపాడేందుకు సిద్ధంగా ఉన్నామంటూ నౌకాదళం 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. ఐక్యతలోనే బలం ఉందని మరో పోస్టులో పేర్కొంది. భారత సైన్యం కూడా.. "ఎల్లప్పుడూ సిద్ధం, నిరంతరం అప్రమత్తం" అంటూ ఒక పోస్టు చేసింది. మరోవైపు.. కశ్మీర్‌లో ఉగ్రవాదుల కోసం తనిఖీలు, ఉగ్రవాదుల ఇళ్ల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. గడిచిన ఆరు రోజుల్లో మన భద్రతా దళాలు 10 మంది ఉగ్రవాదుల ఇళ్లను కూల్చిపారేశాయి. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల నెట్‌వర్క్‌ను సమూలంగా నాశనం చేసేందుకే ఈ సోదాలు, కూల్చివేతలను కొనసాగిస్తున్నట్టు పోలీసు శాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఇక.. నియంత్రణ రేఖ వద్ద పాక్ కవ్వింపు కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయి. వాటికి మన సైన్యం దీటుగా బదులిస్తోంది.

48 గంటల్లోగా కోతలు పూర్తిచేయండి

పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో.. నియంత్రణ రేఖకు ఆనుకుని ఉన్న పొలాలన్నింటిలో పంట కోతలు 48 గంటల్లోగా (సోమవారం సాయంత్రంలోగా) పూర్తి చేసి, వాటిని ఖాళీ చేయాలని భారత సరిహద్దు భద్రత దళాలు రైతులను శనివారం సాయంత్రం ఆదేశించినట్టు సమాచారం. పంజాబ్ సెక్టార్‌లో 530 కిలోమీటర్ల మేర విస్తరించిన ఇండో-పాక్ అంతర్జాతీయ సరిహద్దుపై ఉన్న జీరోలైన్‌కు, భారత్ వైపు ఉన్న సరిహద్దు కంచెకు నడుమ.. రైతులకు దాదాపు 45 వేల ఎకరాల సాగుభూములున్నాయి. వారంతా అక్కడ గోధుమలు పండిస్తుంటారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆయా పొలాల్లో కోతలు రెండు రోజుల్లోగా పూర్తిచేయాలంటూ అమృత్‌సర్, ఫిరోజ్‌పూర్, ఫజిల్కా తదితర జిల్లాల్లోని గ్రామ గురుద్వారాలు ప్రకటనలు చేస్తున్నాయి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగితే.. ఆ పొలాలకు వెళ్లేందుకు ఉపయోగించే మార్గాలను (యాక్సెస్ గేట్స్) కూడా త్వరలో మూసేసే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నాయి. చొరబాటుదారులకు ఆ పొలాలు మరుగు (కవర్)గా ఉపయోగపడే ప్రమాదం ఉన్న నేపథ్యంలోనే బీఎస్ఎఫ్ ఈ ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. అయితే, అధికారులు ఈ ఆదేశాలను మౌఖికంగా జారీచేశారని పంజాబ్ సరిహద్దు ప్రాంత రైతు సంఘం ఉపాధ్యక్షుడు సుర్జిత్ సింగ్ తెలిపారు. ఇప్పటికే ఆ పొలాల్లో 80-90 శాతం మేర కోతలు పూర్తయ్యాయని, రెండు రోజుల వ్యవధిలో మిగిలిన కోతలు పూర్తిచేసి, పశువులకు అవసరమైన గడ్డి తీసుకెళ్లడం కష్టమేనని ఆయన పేర్కొన్నారు.

మా 130 అణ్వస్త్రాలను


మీకే గురి పెట్టాం

» భారత్‌ను ఉద్దేశించి పాకిస్థాన్ మంత్రి హనీఫ్ అబ్బాసీ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు మరింతగా ముదురుతున్నాయి. పాకిస్థాన్ నేతలు, సైన్యాధికారులు రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తూ.. అగ్నికి ఆజ్యం పోస్తున్నారు. లండన్‌లోని పాకిస్థాన్ హైకమిషన్ ఎదుట ఆందోళన చేస్తున్న భారత సంతతి ప్రజలను 'గొంతు కోసేస్తాం..' అంటూ సంజ్ఞలతో పాక్ సైనికాధికారి హెచ్చరించిన మర్నాడే పాకిస్థాన్ రైల్వే మంత్రి హనీఫ్ అబ్బాసీ మరింత రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. "భారత్ సింధు నది నీటిని ఆపేస్తే పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధంగా ఉండాలి. పాకిస్థాన్ వద్ద ఉన్న అణ్వాయుధాలు, క్షిపణులు ఏదో ప్రదర్శన కోసం కాదు. వాటిని దాడికి సిద్ధంగా దేశవ్యాప్తంగా రహస్య ప్రదేశాల్లో దాచి ఉంచాం. పాకిస్థాన్ వద్ద ఉన్న 130 అణ్వాయుధాలు భారత్ వైపే గురిపెట్టి ఉన్నాయి" అని అబ్బాసీ హెచ్చరించారు. ఘోరీ, షహీన్, ఘజ్నవీ వంటి క్షిపణులు, అణ్వాయుధాలు అన్నీ భారత్ కోసమే సిద్ధం చేశామన్నారు. పహల్గాం ఉగ్రదాడి విషయంలో భారత్ తన భద్రతా వ్యవస్థల వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు పాకిస్థాన్‌పై నిందలు వేస్తోందని ఆరోపించారు. పాకిస్థాన్ విషయంలో చేపట్టిన చర్యల తీవ్ర పరిణామాలు ఏమిటో భారత్‌కు ఇప్పుడిప్పుడే తెలిసివస్తోందని.. అందుకే దాడికి వెనుకాడుతోందన్నారు. పాకిస్థాన్ గగనతలం మీదుగా భారత విమానాలు ప్రయాణించకుండా నిషేధించిన రెండు రోజులకే.. విమానయాన పరిశ్రమలో గగ్గోలు పుట్టిందని, మరో పది రోజులు ఇలాగే కొనసాగితే ఆ సంస్థలు నష్టాల్లో కూరుకుపోతాయని చెప్పారు. ఇక ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని భారత్ నిలిపివేయడంపై స్పందిస్తూ... ఇలాంటి వాటిని ఎదుర్కొవడానికి తాము సిద్ధంగానే ఉన్నామని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన చర్యలతో పాకిస్థాన్ అప్రమత్తమైంది. ఇప్పటికే వాణిజ్యం నిలిపివేతతో మొదలైన ఇబ్బందులను, యుద్ధ పరిస్థితులు ఏర్పడితే ఎదురయ్యే పరిణామాలను ఎదుర్కొనేందుకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఆ దేశ త్రివిధ దళాలను అప్రమత్తం చేసింది. సిబ్బంది సెలవులను రద్దు చేసింది. అన్ని రైల్వే స్టేషన్లను ఆర్మీ ఆధీనంలోకి తెచ్చింది. అత్యవసర పరిస్థితి తలెత్తితే... యుద్ధ ట్యాంకులు, మిలటరీ పరికరాలు, ఆయుధాలు, సైన్యానికి అవసరమైన సరుకులు వంటివాటిని అప్పటికప్పుడు, వేగంగా రవాణా చేయడానికి ఈ చర్యలు చేపట్టినట్టు అబ్బాసీ పేర్కొన్నారు. పాకిస్థాన్‌లో ఔషధాల కొరత ఏర్పడకుండా ఆ దేశం అత్యవసర చర్యలు చేపట్టింది. చైనా, రష్యా, ఇతర దేశాల నుంచి ఏపీఐలను దిగుమతి చేసుకునేందుకు పాక్ ప్రయత్నాలు ప్రారంభించింది.

లోకం తీరు



22 గంటలు ట్రెక్కింగ్ చేసొచ్చి ఘాతుకం!

కొండలు, గుట్టల్లో నడిచివచ్చి పర్యాటకులను చంపిన ఉగ్రవాదులు

పహల్గాం, ఏప్రిల్ 27: పహల్గాం దాడిపై జరుగుతున్న దర్యాప్తులో కీలక విషయాలు బయటికొస్తున్నాయి. ఉగ్రవాదులు పహల్గాం చేరుకునేందుకు 20 నుంచి 22 గంటలపాటు ట్రెక్కింగ్ చేసినట్టు సమాచారం. ఉగ్రవాదులు తమ ప్రణాళికను అమలు చేసేందుకు కోకెర్నాగ్ అడవి నుంచి బైరసన్ లోయ వరకు కాలినడకన వచ్చినట్టు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అంతేకాక, దాడి సమయంలో ఉగ్రవాదులు రెండు సెల్‌ఫోన్లు కూడా చోరీ చేసినట్టు తెలిసింది. ఇందులో ఒకటి స్థానికుడిది కాగా మరొకటి పర్యాటకునిది. ఇక, స్థానిక ఉగ్రవాది అదీల్ థోకర్, ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులు మొత్తం నలుగురు ఈ దాడిలో పాల్గొన్నారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఉగ్రవాదులు ఏకే47, ఎం4 ఎసాల్ట్ రైఫిల్‌లతో మారణహోమానికి పాల్పడినట్టు ఫోరెన్సిక్ విశ్లేషణలో తేలింది.

పహల్గాం ఉగ్రదాడిని.. చిత్రీకరించిన వీడియోగ్రాఫర్

» చెట్టు పై నక్కి రికార్డింగ్

జమ్మూ, ఏప్రిల్ 27: పహల్గాంలోని బైసారన్‌లో జరిగిన ఉగ్రదాడిపై విచారణ జరుపుతున్న జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు కీలక ఆధారం లభించింది. నలుగురు ఉగ్రవాదులు రెండు జట్లుగా విడిపోయి, చేసిన మారణకాండను ఓ 'రీల్స్ వీడియోగ్రాఫర్' సొంతం చిత్రీకరించారు. తూటాల శబ్దం వినబడగానే ఆ వీడియోగ్రాఫర్ తొలుత ప్రాణభయంతో చెట్టుపైకెక్కారు. అక్కడే నక్కి ఉగ్రదాడిని చిత్రీకరించారు. ఇప్పుడు ఎన్ఐఏ దర్యాప్తులో ఈ వీడియో కీలకమైన సాక్ష్యంగా మారింది. ఉగ్రవాదులకు స్థానికంగా సహకరించిందెవరు? అనే అంశంపైనా ఓ స్పష్టత వస్తుందని ఎన్ఐఏ భావిస్తోంది. వీడియోలో ఉన్నదాన్ని బట్టి.. "నలుగురు ఉగ్రవాదులు రెండుగా విడిపోయారు. తొలుత ఇద్దరు బైసారన్ లోయ వైపు పర్యాటకుల వద్దకు వచ్చి, కాల్పులు మొదలుపెట్టారు. నలుగురు పర్యాటకుల తలలపై అతి సమీపం నుంచి(పాయింట్ బ్లాంక్ రేంజ్) కాల్పులు జరిపారు. ఆ శబ్దం రాగానే, ఓ దుకాణం వెనక నక్కిన మిగతా ఇద్దరు ఉగ్రవాదులు మరోవైపు నుంచి పర్యాటకుల వైపు కదిలారు" అని ఓ దర్యాప్తు అధికారి వివరించారు.

పాక్‌కు నీటిని ఆపడం

సాధ్యమేనా?



(సెంట్రల్ డెస్క్)

సింధుజలాల ఒప్పందాన్ని నిలిపివేసిన భారత్.. దాయాది దేశం పాకిస్థాన్‌కు పూర్తిస్థాయిలో జలాలు వెళ్లకుండా అడ్డుకోగలదా? ఆ నీటిని భారత్‌లోని ఇతర ప్రాంతాలకు మళ్లించగలదా? సింధు, దాని ఉపనదుల్లో 5,295.91 టీఎంసీల నీరు ఉంటుందని అంచనా. అంత మొత్తంలో నీటిని నిల్వ చేసుకోగలిగే డ్యాములను అనతి కాలంలో నిర్మించడం సాధ్యమవుతుందా? అదే జరిగితే.. ముంపునకు గురయ్యే ప్రాంతాలు లక్ష చదరపు కిలోమీటర్లుగా ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితిని భారత్ ఎదుర్కోగలదా? సింధుజలాల అంశంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

వేసవిలో నీటి ప్రవాహం

సాధారణంగా వేసవి కాలంలో నదుల్లో నీటి నిల్వలు తగ్గుతాయి. కానీ, సింధు, దాని ఉపనదుల్లో మాత్రం ఎగువన మంచు కరగడం వల్ల జలకళ ఉట్టిపడుతుంది. 1960లో జరిగిన సింధుజలాల ఒప్పందం మేరకు.. సింధు, జీలం, చీనాబ్ నదుల నీటిలో సింహభాగం(80% -- 3496.64 టీఎంసీలు) పాకిస్థాన్‌కు.. మిగతా 20% భారత్‌కు దక్కుతాయి. రావి, బియాస్, సట్లెజ్ నదుల జలాలు(1,448.15 టీఎంసీలు) పూర్తిగా భారత్‌కు చెందుతాయి. ఈ ఒప్పందం ప్రకారం భారత్ నిర్మించే డ్యామ్‌లను పరిశీలించే అధికారం పాకిస్థాన్‌కు సింధు కమిషన్ దఖలుపరిచింది. ఇప్పటి వరకు సింధు, జీలం, చీనాబ్ నదులపై భారత్ జలవిద్యుత్తు ప్రాజెక్టులను నిర్మించినా.. వాటిని 'రన్-ఆఫ్-ద రివర్' కేటగిరీలో చూపించింది. అంటే.. ప్రాజెక్టులు ఉన్నంత మాత్రాన పాకిస్థాన్‌కు నీటి సరఫరా నిలిచిపోదు. అలాగని, ఈ ప్రాజెక్టుల కోసం నీటిని నిల్వ చేసుకునే వెసులుబాటు ఉండదు. ఇప్పుడు ఒప్పందాన్ని రద్దుచేసుకోవడం వల్ల.. ఇకపై భారత్ ఈ నదులపై నీటి నిల్వల కోసం ప్రాజెక్టులను చేపట్టే అవకాశాలుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికిప్పుడు ఈ ఒప్పందం రద్దుతో పాకిస్థాన్‌పై ప్రభావం పడకున్నా.. దీర్ఘకాలంలో ఇబ్బందులు తప్పవని వివరిస్తున్నారు. ప్రస్తుతం సింధు, జీలం, చీనాబ్‌పై భారత జలవిద్యుత్తు ప్రాజెక్టులున్నాయి. చీనాబ్‌పై బాగిల్‌హార్, దుల్‌హస్తీ, సలాల్ డ్యాములు, జీలం ఉపనది అయిన కృష్ణగంగపై కృష్ణగంగ డ్యామ్, లద్దాఖ్‌లో సింధూనదిపై నిమూబజ్గో డ్యామ్ ఉన్నాయి. రావి నదిపై 1979 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆనకట్ట ప్రతిపాదన బాలారిష్టాలను దాటుకుని, 2001లో రంజిత్ సాగర్ డ్యామ్ పూర్తయింది. రాజస్థాన్-పంజాబ్‌ల మధ్య సయోధ్య కుదరక షాపుర్‌కంది బ్యారేజీ నిర్మాణం మాత్రం నిలిచిపోయింది. 2018లో కేంద్ర ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహించి, నిర్మాణాన్ని పూర్తిచేసింది. ఆదివారం నుంచి ఈ డ్యామ్ ద్వారా దిగువకు(సింధుకు) నీటి విడుదలను ఆపివేస్తారని సమాచారం. ఈ నీటిని జమ్మూకశ్మీర్‌లోని కఠువా, సాంబా జిల్లాలకు మళ్లించి, 32వేల హెక్టార్లకు సాగునీరందిస్తారని తెలుస్తోంది. నిజానికి భారత్ సింధూ, దాని ఉపనదుల ద్వారా 18,653 మెగావాట్ల మేర విద్యుత్తును ఉత్పత్తి చేయగలిగే ప్రాజెక్టులను నిర్మించవచ్చు. ప్రస్తుతం 3,034 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుండగా.. మరో 2,526 మెగావాట్ల సామర్థ్యమున్న ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. మరో 5,846 మెగావాట్ల ప్రతిపాదిత ప్రాజెక్టులు ప్రణాళిక దశలో ఉన్నాయి. సింధు ఒప్పందం నిలిపివేతతో.. ఇప్పుడు ఈ ప్రాజెక్టులను భారత్ వేగంగా నిర్మించే అవకాశాలుంటాయి.


1960లో సింధూ జలాల ఒప్పందంపై సంతకం చేస్తున్న అప్పటి భారత ప్రధాని నెహ్రూ, పాక్ ప్రధాని ఆయూబ్ ఖాన్

పాకిస్థాన్‌కు భారీ నష్టం

పాకిస్థాన్‌లో ఉన్న ఆనకట్టల్లో భారీ నీటి నిల్వలకు అవకాశాల్లేవు. భారత్ వదిలే నీటి ద్వారానే అక్కడి(పశ్చిమ పంజాబ్, సింధ్ ప్రావిన్సులు) వ్యవసాయం సాగుతోంది. పాకిస్థాన్‌లో ఉత్పత్తి అయ్యే ఆహార ధాన్యాల్లో ఈ రెండు ప్రావిన్సుల వాటా 80% ఉంటుందని అంచనా. పాకిస్థాన్ జీడీపీలో ఈ ప్రావిన్సుల వాటా 25శాతంగా ఉంటుంది. ఈ రెండు ప్రావిన్సుల్లోని 16 లక్షల హెక్టార్ల సాగుభూమికి సింధునది జీవనాడి వంటిది. ఈ ప్రాంతంలోని పరిశ్రమలు, జలవిద్యుదుత్పత్తిని కలుపుకొంటే.. పాక్ జీడీపీలో వాటా 35% ఉంటుందని అంచనా. రెండేళ్ల క్రితం వరదలతో ఈ ప్రాంతంలో పంటలు దెబ్బతినగా.. ఆ దేశంలో గోధుమ పిండి కోసం ప్రజలు ఘర్షణలు పడ్డ విషయం తెలిసిందే.! భారత్ ఇప్పుడు నీటిని నిలిపివేస్తే పాకిస్థాన్‌కు కోలుకోలేని దెబ్బ తగులుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

100% నీటిని ఆపడం అసాధ్యమే

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రాజెక్టుల ద్వారా పాకిస్థాన్‌కు వెళ్లే నీటిని 10-15% వరకు నిలువరించవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే.. దీర్ఘకాలంలో ప్రాజెక్టులను నిర్మిస్తే.. సింధు, దాని ఉపనదుల జలాలను పూర్తిగా భారత్‌లోకే మళ్లించే అవకాశాలున్నాయంటున్నారు. ఈ క్రమంలో కేవలం ఆనకట్టలను నిర్మిస్తే సరిపోదని, నదులను మళ్లించేందుకు భారీ సొరంగాలను తవ్వాల్సి ఉంటుందని గుర్తుచేస్తున్నారు. లద్దాఖ్ లాంటి ప్రాంతాల్లో పర్వతాలు, లోయలతో కఠినమైన వాతావరణం ఉంటుందని, ఈ ప్రాంతాల్లో సొరంగాల తవ్వకం ఖర్చుతో కూడినదే కాకుండా, నిర్మాణానికి చాలా సమయం తీసుకునే అవకాశం ఉంటుందని వివరిస్తున్నారు. పైగా ఈప్రాంతం భూకంప జోన్-5లో ఉందని, భారీ భూకంపాలకు ఆస్కారం ఉంటుందని చెబుతున్నారు. మే-సెప్టెంబరు మధ్య కాలంలో హిమాలయాల్లో మంచు కరిగి, చీనాబ్, జీలం నదుల్లో వేల కోట్ల క్యూబిక్ మీటర్ల నీరు ప్రవహిస్తుందని, ఈప్రవాహాన్ని ఆపడం అంత సులభం కాదని అంటున్నారు. భారీ ఆనకట్టలను నిర్మిస్తే.. సుమారు లక్ష చదరపు కిలోమీటర్ల భూమి ముంపునకు గురవుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఉత్తరాఖండ్‌లో ఉన్న తెహ్రీ డ్యామ్ మాదిరి 30 దాకా భారీ ఆనకట్టలను నిర్మించాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇందుకు 10 ఏళ్ల సమయం పట్టవచ్చంటున్నారు.

సుసాధ్యం చేయొచ్చు?

ప్రస్తుతం భారతీయ సైన్యానికి చెందిన ఇంజనీరింగ్ విభాగం అధునాతన సాంకేతికతను కలిగి ఉంది. కొవిడ్-19 కాలంలో ఢిల్లీలో తాత్కాలికంగా వెయ్యి పడకల భారీ ఆస్పత్రిని 12 రోజుల వ్యవధిలో నిర్మించింది. డీఆర్‌డీవో వంటి సంస్థలు, ఆర్మీ ఇంజనీరింగ్ సంయుక్తంగా సరిహద్దుల్లో అతి తక్కువ సమయంలో వనరుల కల్పన విషయంలో ఇప్పటికే ఎన్నో అసాధ్యాలను సుసాధ్యం చేసి చూపించాయి. హిమాలయ రాష్ట్రాల్లో భారీ టన్నెల్స్‌ను నిర్మించి.. రహదారులను మెరుగుపరిచాయి. అటల్ టన్నెల్ ఇందుకు గొప్ప ఉదాహరణ. సింధు, దాని ఉపనదుల వద్ద మట్టి పరీక్షలు నిర్వహించి, వెనువెంటనే సంప్రదాయ పద్ధతులతోపాటు.. ప్రీకాస్ట్/ప్రీఫ్యాబ్రికేటెడ్ పద్ధతుల్లో డ్యామ్‌లను నిర్మించడం.. పర్వతాల మధ్య లోయ ప్రాంతాల్లో నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేయడం సాధ్యమేనని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న డ్యామ్‌లను నీటిని నిల్వకు అనుగుణంగా అభివృద్ధి చేయడం పెద్ద కష్టమైన పని కాదని, దీన్ని తక్కువ సమయంలో పూర్తిచేయవచ్చని అభిప్రాయపడుతున్నారు.

జల విధ్వంసంపై పాక్‌కు భయం!

ఇప్పటికిప్పుడు నదీజలాలను భారత్ ఒడిసిపట్టలేకున్నా.. డ్యామ్‌లను ఒక్కసారిగా తెరిచి, జల విధ్వంసానికి ప్రయత్నించే ప్రమాదముందని పాకిస్థాన్ పర్యావరణ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే శనివారం చీనాబ్ నది నుంచి ఎలాంటి హెచ్చరికల్లేకుండా నీటిని వదిలారని, దాంతో ముజఫరాబాద్‌లో నీటి ఎమర్జెన్సీని ప్రకటించాల్సి వచ్చిందని పాకిస్థానీ పత్రిక 'డాన్' తన వెబ్‌సైట్‌లో ఓ కథనాన్ని ప్రచురించింది. నదీ పరీవాహకంలో ఉన్న ప్రజలు ఆందోళనకు గురయ్యారని పేర్కొంటూ.. వరద వీడియోలను షేర్ చేసింది. సింధు, జీలం నదుల విషయంలోనూ ఇలాంటి సంఘటనలు జరగవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. 1960 నాటి ఒప్పందం ప్రకారం వరద విషయంలో పాకిస్థాన్‌కు ముందస్తు హెచ్చరికలు చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు ఆ ఒప్పందం రద్దుకావడంతో భారత్‌కు హెచ్చరికలు చేయాల్సిన బాధ్యత ఉండదని పేర్కొంది.

అంతరిక్ష రంగంలో దూసుకెళ్తున్నాం!

- దేశంలో 325కు పైగా అంతరిక్ష స్టార్టప్‌లు..మన్‌కీ బాత్‌లో ప్రధాని



న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: అంతరిక్ష రంగంలో భారత్ దూసుకెళ్తోందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ప్రపంచం మొత్తం మీద అతి తక్కువ ఖర్చుతో అంతరిక్ష ప్రయోగాలను విజయవంతంగా పూర్తి చేస్తోందన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు చేరుతుందని తెలిపారు. ఆదివారం ఆయన మన్‌కీ బాత్ 121వ ఎపిసోడ్‌లో దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అంతరిక్ష స్టార్టప్‌ల రంగంలో యువత సరికొత్త మైలురాళ్లను చేరుకుంటున్నారన్నారు. దశాబ్దం కిందట దేశంలో ఒకే ఒక్క అంతరిక్ష స్టార్టప్ ఉండగా.. ఇప్పుడు వాటి సంఖ్య 325కి చేరిందని తెలిపారు. అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం బాగా పెరిగిందన్నారు. రెండు రోజుల కింద మరణించిన ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరి రంగన్‌కు ప్రధాని నివాళులర్పించారు. ఆయన మృతితో దేశం గొప్ప శాస్త్రవేత్తను కోల్పోయిందన్నారు. సైన్స్, విద్య, అంతరిక్ష కార్యక్రమాల్లో దేశం అత్యున్నత శిఖరాలకు చేరుకోవడంలో ఆయన భాగస్వామ్యం ఎనలేనిదని.. కస్తూరి రంగన్ సేవలను దేశం ఎన్నటికీ మరువలేదని చెప్పారు. సరిగ్గా 50 ఏళ్ల కిందట ఏప్రిల్‌లోనే ఆర్యభట్ట ఉపగ్రహాన్ని ప్రయోగించామని.. ఐదు దశాబ్దాల ప్రయాణంలో అంతరిక్ష రంగంలో దేశం ఎంత అభివృద్ధి చెందిందో చూస్తున్నామని తెలిపారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అభివృద్ధి చేసిన సాచెట్ యాప్ గురించి వివరిస్తూ... తుఫాన్లు, వరదలు, కొండచరియలు విరిగిపడడం, సునామీ, కార్చిచ్చులు, హిమపాతం, ఈదురుగాలులు వంటి ప్రకృతి విపత్తులపై ప్రజలను ముందుగానే హెచ్చరించేందుకు సాచెట్ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు..

కేంద్రంపై 1.50 లక్షల కోర్టు ధిక్కరణ కేసులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: కేంద్ర ప్రభుత్వంపై కోర్టు ధిక్కరణ కేసులు పెరిగిపోతుండడంపై న్యాయశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. వీటిని నివారించాలంటే సకాలంలో కోర్టు ఉత్తర్వులపై స్పందించాల్సి ఉంటుందని తెలిపింది. దేశంలోని వివిధ కోర్టుల్లో కేంద్రంపై సుమారు 1.50 లక్షల కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలంటూ అన్ని మంత్రిత్వ శాఖలకు లేఖ రాసింది. వివిధ శాఖల్లో కోర్టు వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న అధికారులకు న్యాయ విద్యలో తగిన అర్హతలు లేకపోవడమే ఇందుకు కారణమని అభిప్రాయపడింది. కోర్టు ఆదేశాల అమలులో జాప్యం చేస్తే తలెత్తే పరిణామాలపై వారికి అవగాహన ఉండడం లేదని తెలిపింది. ఈ కారణంగానే ఆయా శాఖల అధిపతులపై కోర్టు ధిక్కరణ కేసులు నమోదవుతున్నాయని పేర్కొంది.

సరైన సమయంలో పాక్‌కు గుణపాఠం!

- మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్

చెన్నై, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులతో కాల్పులు జరిపించిన పాకిస్థాన్‌కు భారత ప్రభుత్వం సరైన సమయంలో తగిన గుణపాఠం నేర్పుతుందని మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. బంగ్లాదేశ్‌ను పోగొట్టుకున్నప్పటికీ పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషించడమే పనిగా పెట్టుకుందని అన్నారు. మరోవైపు, గవర్నర్ల వ్యవహారంపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులు వేర్వేరుగా ఉన్నాయని, ఉపకులపతులను నియమించుకునే అధికారం కేరళ గవర్నర్‌కు ఉందని తెలిపిన సుప్రీంకోర్టే.. ప్రస్తుతం తమిళనాడు గవర్నర్‌కు ఆ అధికారం లేదంటూ తీర్పు వెలువరించిందని తెలిపారు, ఈ తారతమ్యాలపై న్యాయనిపుణులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఊటీలో గవర్నర్ ఏర్పాటు చేసిన సదస్సుకు వీసీలను వెళ్లకుండా బెదిరించారనే ఆరోపణలపై రాధాకృష్ణన్ స్పందిస్తూ తమిళనాట బెదిరింపులు సర్వసాధారణమని, వీసీలకు మినహాయింపు లేదని వ్యాఖ్యానించారు.

కొడంగల్‌లో బొలెరో, కారు ఢీ..
భార్య, భర్త వారి కుమార్తె మృతి

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో బైక్‌ను ఢీ కొట్టిన కారు
- తీవ్ర గాయాలతో ఇద్దరు వ్యక్తుల దుర్మరణం

కొడంగల్/కొడంగల్ రూరల్/ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనం చేసుకొని తిరిగొస్తుండగా కొడంగల్‌లో కారును బొలెరో ఢీ కొట్టిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందగా.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో బైక్‌ను కారు ఢీకొని ఓ బాలుడు, మరో యువకుడు చనిపోయారు. హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన రామారావు (51) ఆయన భార్య శ్రీలత (42) వారి చిన్న కుమార్తె శృతి ముగ్గురు కలిసి ఆదివారం కర్ణాటకలోని గాన్‌గాపూర్‌కు దైవ దర్శనం కోసం కారులో వెళ్లారు. దైవ దర్శనం అనంతరం హైదరాబాద్‌కు తిరిగొస్తున్న క్రమంలో కొడంగల్ మండలంలోని ఐనన్‌పల్లి గేటు సమీపంలో వీరి కారును ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీలత అక్కడికక్కడే మృతి చెందగా రామారావు, శృతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కాగా, స్వల్ప గాయాలతో బయట పడిన బొలెరో డ్రైవర్.. ప్రమాదం అనంతరం ఘటనా స్థలి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్- బీజాపూర్ 163వ జాతీయ రహదారిపై మలుపుల దగ్గర సూచిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇద్దరు..



మహేశ్‌బాబు (ఫైల్)

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామ శివారులో కారు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ బాలుడు, మరో యువకుడు మృతి చెందారు. ఏపీలోని ప్రకాశం జిల్లా మైనంపాడు గ్రామానికి చెందిన తన్నీరు శివ దంపతులు హైదరాబాద్‌లో పనులు చేస్తూ జీవిస్తున్నారు. వారి చిన్న కుమారుడు మహేశ్‌బాబు ఏపీలోని పొదిలిలో సంక్షేమ వసతిగృహంలో ఉంటూ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల పరీక్షలు ముగియడంతో అతనికి పరిచయం ఉన్న సంటరుపాడు గ్రామానికి చెందిన దినసరి కూలీ కుంచెర్ల మధుతో కలిసి పది రోజుల కిందట ఎల్లారెడ్డిపేటలోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంపై సిరిసిల్ల వైపు వెళుతున్న క్రమంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో మహేశ్ బాబు (16), మధు (34) అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మే 1 నుంచి జూలై 15 వరకు..
వీఐపీ సిఫారసు బ్రేక్ దర్శనాల రద్దు


- బ్రేక్ దర్శనాల సమయంలోనూ మార్పులు



తిరుమల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ పెరగడంతో మే నెల 1 నుంచి జూలై 15 వరకు సిఫారసు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్టు టీటీడీ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. స్వయంగా వచ్చే ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనాలు ఉంటాయని స్పష్టం చేసింది. ఇక, వీఐపీ బ్రేక్ దర్శన సమయం మార్పు కూడా మే 1వ తేదీ నుంచి అమలుచేయనున్నారు. ప్రస్తుతం వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉదయం 8 గంటల నుంచి మొదలవుతున్న విషయం తెలిసిందే. అయితే గతంలో మాదిరిగా మొదటి గంట తర్వాత ఉదయం 6 గంటలకు బ్రేక్ దర్శనాలను ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నారు.

మొగల్, ఢిల్లీ సుల్తానుల
చరిత్ర మాయం

7వ తరగతి సాంఘిక శాస్త్ర పుస్తకంలో పూర్తిగా తొలగించిన ఎన్‌సీఈఆర్టీ



- మగధ, మౌర్యులు, శాతవాహనులు వంటి సామ్రాజ్యాలపై పాఠ్యాంశాల చేర్పు
- మహాకుంభమేళా గురించి ప్రస్తావన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: ఎన్‌సీఈఆర్టీ 7వ తరగతి కొత్త సాంఘిక శాస్త్ర పుస్తకంలో మొగల్స్, ఢిల్లీ సుల్తానుల చరిత్ర పాఠ్యాంశాలను పూర్తిగా తొలగించారు. వాటి స్థానంలో ప్రాచీన భారతీయ రాజవంశాలైన మగధ, మౌర్యులు, శాతవాహనులు, శుంగులు వంటి రాజ్యాలపై కొత్త చాప్టర్లను ప్రవేశపెట్టారు. జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)-2020, నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సీఎఫ్)-2023లో భాగంగా ఈ కొత్త పుస్తకాలను రూపొందించారు. 'ఎక్స్‌ప్లోరింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్, పార్ట్-1' పేరుతో ఉన్న ఈ కొత్త సాంఘిక శాస్త్ర పుస్తకంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఇటీవల జరిగిన మహా కుంభమేళాతో పాటు కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలైన మేకిన్ ఇండియా, బేటీ బచావో-బేటీ పడావో వంటి అంశాల గురించి ప్రస్తావించారు. 'భూమి పవిత్రంగా ఎలా మారుతుంది' అనే చాప్టర్ భారత్‌తో పాటు బయటి ప్రాంతాల్లో అన్ని మతాలు పవిత్రంగా పరిగణించే ప్రదేశాలు, తీర్థయాత్రలపై దృష్టిపెట్టింది. ఇందులో 12 జ్యోతిర్లింగాలు, చార్ దామ్ యాత్ర, శక్తిపీఠాలతో కూడిన పవిత్ర భౌగోళిక ప్రాంతాల వివరాలను చేర్చారు. అదేవిధంగా వివిధ చాప్టర్లలో జానపద, సమ్రాజ్, అధిరాజా, రాజాధిరాజా అనే సంస్కృతం పదాలను జోడించారు. ఇంకా గ్రీకులపై కూడా వివరణాత్మక విభాగాలు అందించారు. గత ఏడాది 3, 6వ తరగతులకు కొత్త పుస్తకాలను ప్రవేశపెట్టిన ఎన్‌సీఈఆర్టీ.. ఈ ఏడాది 4, 7వ తరగతులకు అప్‌డేటెడ్ వెర్షన్ల పుస్తకాలను తీసుకువచ్చింది. 7వ తరగతి సాంఘిక శాస్త్రం పార్ట్-2 పుస్తకాన్ని కూడా త్వరలో విడుదల చేస్తామని ఎన్‌సీఈఆర్టీ అధికారి ఒకరు చెప్పారు. అయితే తొలగించిన పాఠ్యాంశాలను రెండో పార్టులో చేరుస్తారా? అనే ప్రశ్నకు మాత్రం స్పందించలేదు. కాగా, ఎన్‌సీఈఆర్టీ అంతకుముందు సిలబస్ హేతుబద్ధీకరణలో భాగంగా 2022-23లో మొగల్స్, ఢిల్లీ సుల్తానులకు సంబంధించిన సెక్షన్లను కొంత మేర తగ్గించారు. వారి విజయాలకు సంబంధించిన రెండు పేజీల టేబుల్‌తో పాటు తుగ్లక్‌లు, ఖిల్జీలు, లోడీల రాజ్యాల వివరాలకు కోత పెట్టారు. ఇప్పుడు కొత్త పుస్తకంలో వారికి సంబంధించిన అన్ని వివరాలను పూర్తిగా తొలగించారు. 7వ తరగతి కొత్త సోషల్ సైన్సెస్ పుస్తకం ముందుమాటలో 'ఈ పుస్తకంలోని అంశాలు మన విద్యార్థులు అభివృద్ధి చేయాలని కోరుకునే విలువలను ఏకీకృతం చేస్తాయి. భారతీయ సంస్కృతి లోతుల్లోకి వెళ్లాయి. వయసుకు తగినట్లుగా ప్రపంచ దృక్పథాలను పరిచయం చేస్తాయి' అని ఎన్‌సీఈఆర్టీ డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లాని రాశారు.

'సెల్'లో బందీలైతే
మెదడు మొద్దుబారుతుంది

- తాజా సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: జీవితాన్ని ఎంతో సులభతరం చేసి, సమయాన్ని ఆదా చేస్తున్న సెల్‌ఫోన్లతో లాభం ఎంతుందో నష్టం కూడా అంతకన్నా ఎక్కువగా ఉందని సర్వేలు హెచ్చరిస్తున్నాయి. పిల్లలైతే సెల్‌ఫోన్‌లో బందీలవుతున్నారు. స్ర్కీన్‌లను విడిచిపెట్టడం లేదు. దీంతో నిద్రలేమి, కుంగుబాటు వంటి తీవ్ర సమస్యలు తలెత్తుతాయని ఇప్పటికే రుజువైంది. ఇది మానవ మేధోశక్తిపైనా ప్రభావం చూపుతుందని, ఫలితంగా ఐక్యూ స్థాయి తగ్గిపోతుందని మిషిగాన్ విశ్వవిద్యాలయం నిర్వహించిన 'మానిటరింగ్ ది ఫ్యూచర్' సర్వేలో వెల్లడైంది. సర్వే సమాచారాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ ప్రచురించింది. స్ర్కీన్ టైం అధికమైతే టీనేజర్లు, యువకుల్లో వివేచన సామర్థ్యం తగ్గుతున్నట్టు తేలింది. ఏకాగ్రత లోపించడం, జ్ఞాపకశక్తి మందగించడం, ప్రాథమిక స్థాయి తార్కిక శక్తి లేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. మెదడు పనితీరులోనే మార్పులున్నట్టు గుర్తించారు. గతంలో పిల్లలు, టీనేజర్లు పుస్తకాలు, చిన్న కథలు చదివేవారు. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ వచ్చాక పుస్తక పఠనంపై ఆసక్తి కనబరిచేవారే లేరు. అమెరికాలో జరిగిన సర్వే ప్రకారం 2012లో 45శాతం మందికి పుస్తక పఠనం అలవాటుగా ఉండేది. 2021 నాటికి అది 38 శాతానికి పడిపోయింది. ప్రతిదీ ఒక క్లిక్, స్వైప్ ద్వారా లభిస్తుండడంతో దేన్నీ గుర్తించుకోవాల్సిన అవసరం లేకపోయింది. దాంతో స్పష్టంగా ఆలోచించే సామర్థ్యాన్ని కోల్పోతున్నారు.

మేఘాలను ప్రేరేపించి..
మెరుపులు పుట్టించే డ్రోన్!

- జపాన్ ఇంజనీర్ల ఘనత
- పుట్టే మెరుపు నుంచి విద్యుత్‌శక్తిని ఒడిసిపట్టేందుకు ప్రయోగాలు



టోక్యో, ఏప్రిల్ 27: తివిరి ఇసుమున తైలము తీయవచ్చే లేదో గానీ.. 'ఒడిసి మెరుపున విద్యుత్తు లాగుతాము' అంటున్నారు జపాన్ ఇంజనీర్లు! రుణావేశిత (నెగెటివ్ చార్జ్) మేఘాలు భూమివైపు ఆకర్షితమై విద్యుత్‌శక్తిని విడుదల చేయడం వల్ల మెరుపులు పుడతాయి. వీటి వల్ల ఏటా ప్రపంచవ్యాప్తంగా దాదాపుగా 24 వేల మంది చనిపోతున్నట్టు అంచనా. అంతకు పది రెట్ల మంది గాయపడుతున్నారు. పెద్ద ఎత్తున ఆస్తినష్టం సంభవిస్తోంది. కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతింటుంటాయి. అందుకే ఎత్తైన భవనాలు, నిర్మాణాల్లో.. పిడుగుపాటును తట్టుకునే కండక్టర్లను ఏర్పాటు చేస్తారు. అలాంటివి ఏర్పాటు చేయలేని క్రీడా మైదానాల వంటి చోట్ల పిడుగుపడితే? అలాంటి పిడుగుల వల్ల జపాన్‌లో ఏటా రూ.6-11 వేల కోట్ల దాకా ఆస్తినష్టం సంభవిస్తోంది. దీంతో "అలాంటి చోట్ల మేఘాలు విద్యుత్‌శక్తిని విడుదల చేసేదాకా ఆగడం? నష్టపోవడం దేనికి? రుణావేశిత మేఘాలు మోహరించినప్పుడు.. మెరుపులు పుట్టేలా ప్రేరేపించి.. అప్పుడు జనించే మెరుపును మనకు కావాల్సిన మార్గంలోకి మళ్లించి విద్యుత్తు లాగేద్దాం" అని జపాన్‌కు చెందిన 'నిహాన్ టెలిగ్రాఫ్ అండ్ టెలిఫోన్ కార్పొరేషన్ (ఎన్‌టీటీ) ఇంజనీర్లు అనుకున్నారు. ఆ దిశగా తీవ్ర పరిశోధనలు చేసి ఓ డ్రోన్‌ను రూపొందించారు. అది మేఘాలకు సమీపంలోకి వెళ్లి రుణావేశిత మేఘాలను గుర్తించి, విద్యుత్తు క్షేత్రాల్లో హెచ్చుతగ్గులు సృష్టించడం ద్వారా ఆ మేఘం విద్యుత్‌శక్తిని విడుదల చేసేలా (మెరుపును పుట్టించేలా) చేస్తుంది. 2024 డిసెంబరు 13న ఒక డ్రోన్ సాయంతో భూమి నుంచి 984అడుగుల ఎత్తున ఒక మేఘాన్ని ప్రేరేపించి మెరుపు పుట్టేలా చేశారు. ఈ పరిజ్ఞానాన్ని మరింత అభివృద్ధి చేసి.. మెరుపు నుంచి విద్యుత్ శక్తిని ఒడిసిపట్టేలా కృషి చేస్తున్నట్టు ఎన్‌టీటీ ఇంజనీర్లు తెలిపారు.

'త్రీ ఇడియట్స్' పాఠశాలకు ఎట్టకేలకు సీబీఎస్ఈ గుర్తింపు


న్యూఢిల్లీ, ఏప్రిల్27: త్రీ ఇడియట్స్ సినిమాతో ప్రసిద్ధి చెందిన లడఖ్‌లోని పాఠశాలకు ఎట్టకేలకు సీబీఎస్ఈ గుర్తింపు లభించింది. రాంచో పాఠశాలగా స్థానికులు పిలిచే ఈ పాఠశాల 2009లో బాలీవుడ్ హీరో అమిర్‌ఖాన్ నటించిన 'త్రీ ఇడియట్స్' సినిమాతో బాగా ప్రసిద్ధి చెందింది. ఇప్పటివరకు జమ్ము, కశ్మీర్ పాఠశాలవిద్య బోర్డుకు అనుబంధంగా ఉంది. సంప్రదాయ బట్టీ చదువులకు భిన్నంగా వినూత్న విధానాలతో ఇక్కడ బోధన సాగుతుంది. నూతన జాతీయ విద్యా విధానంలో ప్రతిపాదించిన సంస్కరణలను ఈ పాఠశాల ముందే అనుసరిస్తుండడం గమనార్హం. 24ఏళ్లు నిండిన ఈ పాఠశాలకు 15వ శతాబ్దానికి చెందిన ప్రముఖ పండితుడు విఫామ్ పెమా కార్పో పేరు పెట్టారు.

22 నాటి ఆర్ఆర్‌బీ
సెషన్-2 పరీక్ష రద్దు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులు ఈ నెల 22న రెండో సెషన్‌లో నిర్వహించిన ఆర్ఆర్‌బీ జేఈ సీబీటీ-2 పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించాయి. అదేరోజు తొలి సెషన్‌లో నిర్వహించిన పరీక్షలో వచ్చిన పలు ప్రశ్నలు రెండో సెషన్‌లోనూ వచ్చినట్లు గుర్తించారు. సాఫ్ట్‌వేర్ సమస్యల కారణంగా ఈ పొరపాటు జరిగిందని నిర్ధారించారు. ఈమేరకు రెండో సెషన్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు, తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటించనున్నట్లు ఆర్ఆర్‌బీలు పేర్కొన్నాయి. 22న పరీక్షకు హాజరైన అభ్యర్థులు ఈ సమాచారం కోసం ఆర్ఆర్‌బీలఅధికారిక వైబ్‌సైట్‌లు చూడాలని సూచించాయి.

విచారణకు రాలేను..
మరో తేదీ ఇవ్వండి

- ఈడీకి సినీ హీరో మహేశ్ బాబు లేఖ



హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): షూటింగ్‌లో బిజీగా ఉన్నందున సోమవారం విచారణకు రాలేనని సినీ హీరో మహేశ్‌బాబు ఈడీ అధికారులకు లేఖ పంపారు. ముందే నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం తాను సినిమా షూటింగ్‌లో ఉన్నానని.. విచారణకు మరో తేదీ ఇవ్వాలని కోరారు. మనీ లాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న సురానా గ్రూప్, సాయి సూర్య డెవలపర్స్ సంస్థలకు సంబంధించిన ప్రకటనల్లో మహేశ్ నటించారు. సాయి సూర్య డెవలపర్స్ ప్రకటనల్లో నటించినందుకు మహేశ్ బాబుకు రూ.5.9 కోట్లు పారితోషికం చెల్లించారు. అందులో రూ.2.5 కోట్లు నగదు రూపంలో ఇచ్చారు. ఇటీవల జరిగిన ఈడీ సోదాల్లో ఈ విషయం వెల్లడికావడంతో మహేశ్‌బాబు 28న విచారణకు రావాలని ఈడీ నోటీసు జారీ చేసింది.

బినామీల గుట్టు విప్పని హరిరామ్!

ఆస్తుల లెక్క రూ.200 కోట్ల పైమాటే.. కాళేశ్వరం ఈఎన్‌సీకి 14 రోజుల రిమాండ్

- చంచల్‌గూడ జైలుకు తరలింపు



హైదరాబాద్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన కాళేశ్వరం ఈఎన్‌సీ భూక్యా హరిరామ్ కూడబెట్టిన ఆస్తుల విలువ రూ.200 కోట్ల పైమాటేనని ఏసీబీ వర్గాలు చెబుతున్నాయి. అయితే, తన బినామీల గుట్టును హరిరామ్ బయటపెట్టలేదని సమాచారం. దీంతో ఆయన్ను కస్టడీలోకి తీసుకుని విచారణ చేపట్టాలని ఏసీబీ భావిస్తోంది. హరిరామ్‌ను శనివారం అదుపులోకి తీసుకున్న అధికారులు ఆదివారం తెల్లవారుజామున 3గంటలకు న్యాయమూర్తి ఇంట్లో హాజరు పరిచారు. న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించగా హరిరామ్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

వేలకోట్ల పనుల్లో భాగస్వామి

కాళేశ్వరం ప్రాజెక్టు సహా నీటిపారుదల శాఖలోని పలు ముఖ్యమైన ప్రాజెక్టుల్లో హరిరామ్ కీలకపాత్ర పోషించారు. హరిరామ్ చేతుల మీదుగా వేలకోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టుల పనులు జరిగాయి. ఈ క్రమంలోనే హరిరామ్ భారీగా అక్రమఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. బహిరంగ మార్కెట్‌లో రూ.200 కోట్లకు పైగా విలువ ఉండే ఆస్తులను ఇప్పటిదాకా గుర్తించామని అధికారులు అంతర్గత సంభాషణల్లో పేర్కొంటున్నారు. కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం ఉన్న మర్కూక్ మండలంలో హరిరామ్ 28 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. హైదరాబాద్‌లోని షేక్‌పేట్, కొండాపూర్‌లో హరిరామ్‌కు రెండు విల్లాలుండగా వాటి విలువ రూ.10 కోట్లకు పైనే ఉంటుందని సమాచారం. ఇక, హైదరాబాద్‌లోని శ్రీనగర్‌కాలనీ, మాదాపూర్, నార్సింగ్ ప్రాంతాల్లో ఆయనకు ఉన్న ప్లాట్ల విలువ రూ.10 కోట్లకు పైనే ఉంటుందని అంచనా. ఏపీ రాజధాని అమరావతిలో హరిరామ్‌కు ఉన్న వాణిజ్య స్థలం విలువ రూ.20 కోట్లు ఉండవచ్చునని చెబుతున్నారు. ఇవే కాక, పటాన్‌చెరు లాంటి కీలక ప్రాంతంలో 20 గుంటల స్థలం, శ్రీనగర్ కాలనీలో రెండు ఇండిపెండెంట్ ఇళ్లు, బొమ్మలరామారంలో ఆరు ఎకరాల మామిడితోటలో ఖరీదైన ఫామ్‌హౌస్, కొత్తగూడెంలో ఓ వాణిజ్య సముదాయం, కుత్బుల్లాపూర్, మిర్యాలగూడలో ఇళ్ల స్థలాలు గుర్తించారు. హరిరామ్‌కు చెందిన కొన్ని బ్యాంకు లాకర్లు ఇంకా తెరవాల్సి ఉంది. కాగా, హరిరామ్‌ను విచారించే విషయంలో వారం రోజులు కస్టడీ కోరుతూ ఏసీబీ సోమవారం న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉంది.

అధిక బీపీతో..
పీఎస్ఆర్ విచారణకు బ్రేక్

- ఉదయాన్నే ప్రభుత్వాస్పత్రికి తరలించిన సీఐడీ
- బీపీ ఎక్కువగా ఉన్నందున విచారణ సరికాదన్న వైద్యులు.. దీంతో తిరిగి జైలుకు తరలింపు

విజయవాడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీపై వేధింపుల కేసులో ప్రస్తుతం జైల్లో ఉన్న ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులును సీఐడీ అధికారులు తొలి రోజు విచారించలేకపోయారు. మూడో అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఆయన్ను మూడ్రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతించిన విషయం తెలిసిందే. ఆ మేరకు ఆది, సోమ, మంగళవారాల్లో ఆయన్ను ప్రశ్నించేందుకు సీఐడీ అధికారులు అంతా సిద్ధం చేసుకున్నారు. పీఎస్ఆర్‌ను కస్టడీలోకి తీసుకోవడానికి ఆదివారం ఉదయం విజయవాడలోని జిల్లా జైలుకు వెళ్లారు. ఆయనకు బీపీ ఎక్కువగా ఉందని వారికి జైలు అధికారులు తెలియజేశారు. ఇదే విషయాన్ని కాగితంపై రాసివ్వాలని సీఐడీ అధికారులు అడుగగా.. అలా ఇవ్వలేమని వారు చెప్పారు. కస్టడీలోకి తీసుకుని.. ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించి, అక్కడ ధ్రువీకరణపత్రం తీసుకోవాలని స్పష్టం చేశారు. దీంతో సీఐడీ అధికారులు పీఎస్ఆర్‌ను కస్టడీకి తీసుకుంటున్నట్లు జైలు రికార్డుల్లో రాసి.. తమ అధీనంలోకి తీసుకుని జైలు నుంచి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు బీపీ, ఈసీజీ, షుగర్ పరీక్షలు చేశారు. బీపీ 160/90 ఉన్నట్లు తేలింది. షుగర్ మాత్రం సాధారణ స్థాయిలో ఉంది. బీపీ ఎక్కువగా ఉన్నందున ఆయన్ను ప్రశ్నించడం సరికాదని వైద్యులు అభిప్రాయపడ్డారు. ఇదే విషయాన్ని ధ్రువీకరిస్తూ రాసిచ్చారు. దీంతో సీఐడీ అధికారులు ఆయన్ను తిరిగి జిల్లా జైలుకు తరలించారు.

ఎమ్మార్పీఎస్ ఏపీ నేత దారుణహత్య

- గుంతకల్లులో టిప్పర్‌తో ఢీకొట్టి.. కొడవళ్లతో నరికి దురాగతం
- కారులో వెళ్తుండగా దాడి.. కుమారుడు, బంధువుకు గాయాలు
- టీడీపీ నేత శ్రీరాములు దంపతుల హత్య కేసులో లక్ష్మీనారాయణ నిందితుడు



లక్ష్మీనారాయణ (ఫైల్)

గుంతకల్లు/కర్నూలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ (60) ఆదివారం దారుణ హత్య కు గురయ్యారు. అనంతపురం జిల్లా గుంతకల్లు శివారులో దుండగులు టిప్పర్‌తో ఢీకొట్టి, వేట కొడవళ్లతో నరికి చంపారు. కర్నూలు జిల్లా చిప్పగిరికి చెందిన ఆయన.. ఆదివారం ఉదయం తన కుమారుడు వినోద్‌కుమార్, సమీప బంధువు గోవిందుతో కలిసి గుంతకల్లుకు వచ్చారు. అనంతరం వారు మధ్యాహ్నం ఇన్నోవా వాహనంలో చిప్పగిరికి బయల్దేరారు. గుంతకల్లు-ఆలూరు రహదారిలో పట్టణ శివారులోని రైలు వంతెన సమీపాన స్పీడ్ బ్రేకర్ వద్ద ఇన్నోవాను ఆగంతకులు టిప్పర్‌తో ఎదురుగా వచ్చి ఢీకొట్టారు. ఆ వెంటనే లక్ష్మీనారాయణను బయటకు లాగి, వేటకొడవళ్లతో ఆయన తల, వీపు మీద నరికారు. తర్వాత కారులో పరారయ్యారు. స్థానికులు వెంటనే లక్ష్మీనారాయణ, వినోద్‌కుమార్, గోవిందులను గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి లక్ష్మీనారాయణ అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. గాయపడిన వినోద్‌కుమార్, గోవిందు మాట్లాడుతూ.. తమ వాహనాన్ని టిప్పర్‌తో ఢీకొట్టి 8 మంది కొడవళ్లతో లక్ష్మీనారాయణను విచక్షణరహితంగా నరికారని తెలిపారు. విషయం తెలిసి మృతుడి కుటుంబ సభ్యులు, చిప్పగిరి గ్రామస్థులు పెద్దఎత్తున ఆస్పత్రికి చేరుకున్నారు. లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా.. లక్ష్మీనారాయణకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన 2006లో టీడీపీ నాయకుడు, కర్నూలు జిల్లా సహకార బ్యాంకు మాజీ చైర్మన్ వైకుంఠం శ్రీరాములు, ఆయన భార్య శకుంతల హత్య కేసులో నిందితుడి(ఏ-7)గా ఉన్నారు. ఈ కేసును న్యాయస్థానం కొట్టివేసింది.

అమరావతి రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం

- మే 2 రాష్ట్ర చరిత్రలోనే గొప్ప మలుపు కానుంది : చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నిన్నటి విధ్వంసం నుంచి రేపటి వికాసం వైపు రాజధాని ప్రయాణం సాగనుందని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మే 2న ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని అమరావతి పనులు పునఃప్రారంభ కార్యక్రమంపై చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రులు, ఉన్నతాధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. బహిరంగ సభ, భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమరావతిని దెబ్బతీయాలని అనేక కుట్రలు, దాడులు చేసిందని.. అయితే అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజల అభిలాష మేరకు ప్రారంభమైన అమరావతి అనేక సవాళ్లను, కష్టాలను ఎదుర్కొని నిలబడిందని అన్నారు. ప్రధాని చేతుల మీదుగా అమరావతి పనులు మళ్లీ ప్రారంభమవుతున్నాయని, ఆ రోజు రాష్ట్ర చరిత్రలో గొప్ప మలుపు కానుందని చెప్పారు. అమరావతి అనేది ఏపీ ప్రజల ఆత్మగౌరవం, ఆకాంక్ష, సెంటిమెంట్ అని.. దీన్నిఎవరూ దెబ్బతీయలేరన్నారు. కుట్రలకు, కుతంత్రాలకు ప్రజారాజధాని బలికాబోదని, ఆంధ్రుల రాజధాని స్వప్నాన్ని ఎవరూ చెరిపివేయలేరని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని దేశమంతా గుర్తించేలా రాజధాని పనులను స్వయంగా ప్రధాని చేతుల మీదుగా పునఃప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా.. వేడుకగా నిర్వహించాలని, రాష్ట్రంలో ప్రతి పౌరుడు 'నాది ఆంధ్రప్రదేశ్.. నా రాజధాని అమరావతి' అని చెప్పుకొనేలా అమరావతి నిర్మాణం జరుగుతుందని అన్నారు.

ఈడీ నుంచి ఐ4సీకి సమాచారం

- సైబర్ మోసాల కట్టడి లక్ష్యంతో కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: దేశంలో సైబర్ మోసాలు నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో వాటి కట్టడితోపాటు నగదు జాడను గుర్తించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)తో సమాచారం ఇచ్చిపుచ్చుకోవడానికి ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ)కు అధికారమిచ్చింది. ఈమేరకు పీఎంఎల్ఏలోని సెక్షన్ 66 కింద ఐ4సీని చేర్చుతూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని రెవెన్యూ విభాగం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఈడీ, ఇతర లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో ఐ4సీ సమాచారం పంచుకోవడానికి, పొందడానికి అవకాశం ఉంటుంది. సాధారణ వ్యక్తులు లక్ష్యంగా సైబర్ మోసాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సమాచార పంపిణీ వల్ల ఈ మోసాల వెనకున్న సూత్రధారులను గుర్తించడానికి అవకాశం ఏర్పడుతుంది. ఏదైనా మోసం జరిగిన సందర్భాల్లో అలాంటి వెబ్‌సైట్లకు సంబంధించిన సమాచారాన్ని నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ cybercrime.gov.in ద్వారా లేదా 1930కి కాల్ చేసి తెలియజేయాలని ప్రజలకు ప్రభుత్వం సూచిస్తోంది.

వేదనాకాశం కింద చెహోవ్ హీరో



"గాడిదకు దుఃఖం తెలుస్తుందా" – ఫ్రెడరిక్ నీఛ
"గాడిదకు పన్నీరు వాసన తెలుస్తుందా" – తెలుగు సామెత.
చెహోవ్ హీరో గాడిద కాదు, కనీసం గాడిదగా మిగిలిపోడు; జీవితానికి ఒక నిర్దిష్ట ప్రయోజనమో పరమార్థమో ఉంటాయనుకుని బ్రతకడం వృథా ప్రయాస అనే స్పృహను, దాన్లోంచి వచ్చే యాతనను సమస్త మానవజాతి తరపున భరించగల సార్థకజీవి.

ఒక లెక్కలేనితనం తెచ్చే అందంతో చూస్తుంటాయి చెహోవ్ కళ్ళు ఇప్పటికీ, తన ఫోటో ఎవరు చూస్తుంటే వాళ్ళ లోపలికి. తన కథలకు ఆకర్షణీయమైన పేర్లు అనవసరమనీ, ఏడేళ్ళకు మించి వాటికి పాఠకాదరణ ఉండబోదనీ అనుకున్న ఈ రచయిత పేరు నూట నలభై సంవత్సరాలుగా 'కథ'కు పర్యాయనామం అయి కూచుంది. మొదట్లో కేవలం సంపాదన కోసం హాస్యకథలు, ఏకాంక నాటికలూ రాస్తూ వచ్చిన చెహోవ్‌ను అన్న అకాల మరణం రచనకళ పట్ల, జీవితం పట్ల దృక్పథాన్ని మార్చుకునేట్లు చేసింది. అలా ఇరవై ఏడేళ్ళకే మరణ విచారణ, బ్రతుకు చింతన ఆయన కథల విషయం అయింది. అప్పుడు రాసినవే 'The Tedious Story', 'The Kiss'.

"మనిషికి తీవ్ర అస్తిత్వ వేదన నుంచి జాగృతి పుడుతుందా లేక తనకు ఆ స్పృహ వచ్చినప్పుడు మానవ అస్తిత్వ వేదన తెలుస్తుందా?" అనే సూక్ష్మ సందిగ్ధతను పదునుగా చెప్పిన కథలు ఈ రెండూ.

'The Tedious Story'లో విషయం– అరవై పైబడిన ప్రొఫెసర్ నికొలాయ్ స్టెపనొవిచ్‌కు, అతని గార్డియన్షిప్‌లో కూతురిలా పెరిగిన పాతికేళ్ళ కేటీ కి జీవితం పట్ల వచ్చిన నిస్పృహ. అకస్మాత్తుగా శక్తిహీనత, మృత్యుస్పృహ వచ్చిపడ్డాక, స్టెపనొవిచ్, "నాకు ఎటువంటి ప్రఖ్యాతి! వృద్ధాప్యం, రోగాలు, మృత్యువు నాకెట్లా వస్తాయి? అద్దంలో ఆ వంకరనోటి ముఖం నాదేనా! శరీరంలో, మనసులో దౌర్బల్యం, బయట మనుషుల్లో నన్ను అర్థం చేసుకోలేని స్వార్థం! ఏ పని లోనూ అభిరుచి లేదు, భోజనం లోనూ తీవ్రమైన అరుచి. లోకంలో కళాకాంతీ పోయాయి!" అని వాపోతుంటాడు.

తనకు మృత్యువు వస్తోందనా, జీవితేచ్ఛ పోతున్నదనా దుఃఖం? "అరవై రెండేళ్ళ సుదీర్ఘ జీవితాన్ని ఎంత నిరర్థకంగా ఖర్చు చేసుకున్నాను కదా!" అనే జ్ఞానమా? ఇన్నాళ్ళూ తను గొప్పవి అని నమ్మి నెత్తిన పెట్టుకున్న జీవితవిలువలు ఉట్టి డొల్ల అని ఒప్పుకోవడం ఎంత దుర్భరమో, ఇప్పుడు వాటికి విరుద్ధంగా బ్రతకాలనే ప్రయత్నం అంతకన్నా కష్టం. ఇన్నాళ్ళుగా యాంత్రిక జీవనం అనే ఉరితాడును వరమాలనుకుని మెడకు వేసుకుని తిరిగానని తెలుసుకున్న నేరస్థులు చెహోవ్ పాత్రలు. జ్ఞానాన్ని మించిన నేరం, దుఃఖం లేవు.

ఇక, కేటీ విషాదకారణాలు ముసలితనమో, శారీరక అశక్తతో కావు. ఆమె తన నటనావృత్తిలోనూ, ప్రేమలోనూ ఓడిపోయింది. జీవితమంటే నిర్వేదం. తండ్రి వంటి స్టెపనొవిచ్ ముందు, "నేనిప్పుడు ఏం చెయ్యాలి ఈ 'utter will-lessness' (చెప్ప లేనంత నిరాసక్తత) నుంచి బయటపడే దారేది?" అని రోదిస్తూ "ఒక్కమాట చెప్పు, ఈ స్థితినుంచి దారి చూపించే ఒక్కమాట!" అంటుంది. కానీ, అటువంటి సంశయంలోనే కొట్టుకుపోతున్న స్టెపనొవిచ్ దగ్గర దానికి జవాబు లేదు. ఒక తండ్రిలా ఆమె కోసం దుఃఖిస్తూనే, "నిజంగా నాకూ తెలియడం లేదమ్మా" అంటూనే, "నా అంతఃకరణం ఏదో చెప్తున్నది కానీ ఆ విధంగా నడిచే ధైర్యమూ శక్తీ నాకిప్పుడు లేవు. దైవం ఏ శిక్ష వేస్తాడో వెయ్యనీ," అంటాడు. తనను నడిపించిన సూత్రం, సత్యం ఇవీ అని చెప్పగల విద్య ఇన్నాళ్ళ అధ్యాపక అనుభవంలో నేర్చుకోలేదు ఆ ప్రొఫెసర్.

ఇక్కడ చెహోవ్ ఒక యూనివర్సిటీ చదువులనే బోనులో నిలబెట్టలేదు, వరసగా వస్తారు ఆయన ముద్దాయిలు– వివిధ సిద్ధాంతకారులు, ప్రభువులు, ప్రవక్తలూ, మనిషి ప్రియ వ్యసనాలైన అంతఃకరణశుద్ధి లేని కళలు, అబద్ధపు అభ్యుదయ సమాజపు కలలు, మోతాదు మించిన సైన్సు, సత్యాన్వేషణ కాని సాహిత్యం.. ఇలా అన్నిటికీ మెల్లగా కీళ్ళు ఊడదీసి చల్లగా కూలదోసిన రచనలు చెహోవ్‌వి.

'The Kiss'లో ఒక మిలిటరీ బెటాలియన్ ఒక పల్లెటూరిలో రాత్రికి బస చేయవలసి వస్తుంది. అలసిపోయిన జవాన్లు తొందరగా నిద్రపోదాం అని సిద్ధమవుతుంటే, ఆ ఊళ్ళోని రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్, వీళ్ళను విందుకు ఆహ్వానిస్తాడు. "ఖర్మరా బాబూ" అనుకుంటూ వెళ్ళాక తెలుస్తుంది, పిలిచినవాళ్ళు కూడా "ఖర్మరా బాబూ" అనుకుంటూనే మర్యాద కోసం పిలిచారని. వాళ్ళింట్లో ఏదో శుభకార్యం, ఇంటి నిండా స్వజనం. వాళ్ళు ఇబ్బందిని దాస్తూ గౌరవాన్ని నటించగల అనుభవజ్ఞులు కాబట్టి వీళ్ళకు చాలా శ్రద్ధగా తిండి, పానీయాలు పోసి, తమ డాన్స్, పియానో పాటల్లో కూడా కలుపుకుంటారు. జవాన్లు ఆ సంపన్నుల భవంతిలో, అప్సరసల వంటి ఆ ఇంటి స్త్రీల మధ్య, తమ ఉక్కిరిబిక్కిరితనాన్ని దాచిపెట్టి హుందాతనాన్ని తెచ్చిపెట్టుకుని తిరుగుతారు, ఒక్క ర్యాబోవిచ్ తప్ప. అతను కాస్త నటన చేసైనా మామూలు మనిషిలాగా కనపడటానికి వీలుకానంత చిన్న మనిషి– అందంలో, స్థాయిలో, నాగరీకంలో. దిక్కు తోచక ఆ ఇంట్లో ఉన్న లెక్కలేనన్ని గదులు తిరుగుతూ తిరుగుతూ తోవ మర్చిపోయి, సన్నగా సంగీతం వినపడుతున్న ఒక చీకటి గదిలోకి వచ్చి పడతాడు. ఆ చీకటి గదిలో విరగపూసిన పూలవాసన. గది కిటికీలు తోటలోకి తెరుచుకున్నట్లు ఉన్నాయి. "ఇది కాదు నేను రావలసిన గది" అనుకుంటుండగానే– స్త్రీ దుస్తుల రెపరెపలు వినపడటం, పరిగెత్తిన ఆయాసంతో ఆడగొంతు "దొరికావు చివరికి" అనడం, పరిమళాల ఆడ చేతులు రెండు తన మెడను చుట్టడమూ, వెచ్చటి చెంప తన చెంపకు ఆనటమూ, చటుక్కున ముద్దు! వెంటనే చిన్న కేక వేసి ఒక్క గెంతులో దూరంగా వెళ్లిపోయింది ఆమె ఎవరో! అతనికి అంత చీకట్లోనూ ఆమె అసహ్యం కనపడింది. ఆ ముద్దు తనది కాదని తెలిసింది. అయినా, ఉద్వేగంతో హృదయం కొట్టుకుంటోంది. పెనవేసుకున్న స్త్రీ చేతులు తన మెడకు ప్రసాదించిన పవిత్రతైలాల అనుభూతి పూతను వదిలించుకునే శక్తి అతనికి లేదు. ఈ షైకంలోనే మన హీరో మిగతా జవాన్లతో కలిసి బస వైపు నడుస్తాడు. సుష్టైన విందు పానీయాల మత్తుతో నడుస్తున్న జవాన్లు "ఎప్పటికైనా ఇలా ఇల్లు సంసారం ఏర్పడక పోతాయా మనలాంటి మామూలు మనుషులకు కూడా" అనుకుంటారు (ఈ మాట బరువు తూచలేము). ఎక్కడో ఒక కోయిల తన గుండెల్లో బలిమినంతా గొంతులోకి తెచ్చుకుని పాడుతున్నది. అంతటా ఆనందమే ఆ రాత్రి.

చెహోవ్ కథల్లో ఒక సుష్టైన విందు, సుందరమైన దృశ్యం, అందమైన స్త్రీ ఉనికి మనిషిలో దాదాపు పునర్జన్మ వంటి ఒక పరివర్తనం తీసుకురావటం తరచూ కనపడుతుంది.

మరుసటిరోజు ఆ మిలిటరీ బెటాలియన్ ఆ ఊరు విడిచి పోతుంది. ఆనాటి నుండి మళ్ళీ తిరిగివెళ్ళే ప్రయాణంలో ఇదే ఊర్లో ఆగటానికి మధ్య నూట మూడు రోజుల పొడవునా ర్యాబోవిచ్‌కు అనుభవమైన అందమైన అవస్థే ఈ కథకు ప్రాణం. ఆరోజు తనకు ప్రేమ దొరికిందనీ, తనదిప్పుడు విరహబాధ అనీ, తన ప్రేమ కథ ఎవరికైనా ఒక మధురభావనగా చెప్పాలనీ కలలూ కోరికలతో సతమతమై పోతుంటాడు ర్యాబోవిచ్. తన అందవికార రూపం, పేదరికం, తక్కువస్థాయి ఉద్యోగం, అన్నిటినీ మర్చిపోయేట్లు చేసింది ఈ అయాచిత అనుభవం. ఆమెను ప్రేయసి చేసింది, ఆరోజు చీకట్లో ఆమె ముఖం కూడా చూడకపోయినా. మిలిటరీ బెటాలియన్ మళ్ళీ ఆ ఊర్లో ఆగినప్పుడు విందుకు ఆహ్వానం అందుతుందనీ, ఈసారైనా ఆమె దర్శనం దొరుకుతుందనీ ఆశ అతన్ని ఈ వసంత కాలమంతా నిలువనివ్వలేదు. కానీ, తీరా ఆ ఊరు చేరేసరికి, ఇప్పుడసలు ఆ ఆసామి ఊర్లోనే లేడు. ఆ భవంతి, ఆ తోట, దానికి నది ప్రక్కనుంచి తోవ, నదిపైన ముచ్చటైన వంతెన అన్నీ అట్లాగే ఉన్నాయి, "ఒక్క ఆ గుండెబలిమి ఉన్న కోయిల పాట లేదు. నదిలో చంద్రుడు ఎర్రగా ఉన్నాడు, నీటిబుడగలు ఆయన ప్రతిబింబాన్ని పరిమాణంలో పెంచుతూ, ఇంతలో ముక్కలుగా తుంచుతూ, చంద్రుణ్ణి తమతో లాక్కెళ్ళుతాం అనుకుంటున్నాయా అన్నట్లు తన గుండా పోతున్నాయి." ఉన్నట్లుండి అతనికి తన ఈ నిరాశ ఆశ్చర్యపడవలసిన ఒక విషయమే కాదు అనిపిస్తుంది. ఆమె తనకు కనపడుతుందనీ, ఇది ప్రేమేననీ ఇన్నిరోజులుగా అనుకోవటం ఎంత సహజమో, ఇప్పుడు అవన్నీ వ్యర్థమైన ఊహలు అని తెలియడమూ అంతే సహజం అనుకుంటాడు. ఈ నది ఆ రోజు ఎలా ప్రవహించిందో ఈనాడూ అలాగే ఏదీ పట్టించుకోకుండా ప్రవహించడమూ వింత కాదు. "నేనెంత బాధలో ఉన్నా లోకం ఏంటి ఇంత అందంగా వెలిగిపోతోంది, దీనికి మనసే లేదు!" అనే చెహోవ్ మరో సందర్భంలో, "ఈ సృష్టి అంతా ఎంత చక్కగా ఉంది, ఇక్కడ మనిషి తన మానవ మర్యాదలను మరిచిపోయి చేసే పనులు తప్ప!" అనీ అంటాడు. ర్యాబోవిచ్ మళ్ళీ అన్నీ నెమరు వేసుకుంటాడు. విధి ఒక అపరిచిత స్త్రీ రూపంలో హత్తుకోవటం, తర్వాత తనను వదలని midsummer night (day) dreams, ప్రస్తుతం వాస్తవమైన తన శోకం... "ఎంత అల్పమైన దయనీయ దౌర్భాగ్య జీవితం నాది!" అనుకుంటాడు. తన మనుషులను ఎంత అభావంగా చూపెట్టగలిగితే, వారికి పాఠకుల నుంచి అంత జాలి దొరుకుతుంది అనే కిటుకు తెలిసిన రచయిత చెహోవ్. సాంద్రమైన చిన్నకథకు మచ్చుతునక ఈ కథ.

"గాడిదకు దుఃఖం తెలుస్తుందా" – ఫ్రెడరిక్ నీఛ.

"గాడిదకు పన్నీరు వాసన తెలుస్తుందా" – తెలుగు సామెత.

చెహోవ్ హీరో గాడిద కాదు, కనీసం గాడిదగా మిగిలిపోడు; జీవితానికి ఒక నిర్దిష్ట ప్రయోజనమో పరమార్థమో ఉంటాయనుకుని బ్రతకడం వృథా ప్రయాస అనే స్పృహను, దాన్లోంచి వచ్చే యాతనను సమస్త మానవజాతి తరపున భరించగల సార్థకజీవి.

మనుషులు ఎదిగే పరిణామక్రియను, వారి మనస్తత్వపు జీవితచరిత్రలను ఇటుకపై ఇటుకగా నిర్మించే ఒక్క చెహోవ్ తప్ప మరొకరు పట్టుకోలేరు. జీవకణ ప్రయోగశాలలో సూక్ష్మదర్శిని కింద జరుగుతుండే పరమాణు క్షణక్షణ పరివర్తనల వంటివే మనిషి మనస్సు, మెదడులలో నిరంతరం జరిగే మార్పులు. ఆ చలనగతులను పట్టుకోగల కన్ను చెహోవ్‌ది, వాటి కోసమే ఎదురు చూస్తుంటాడు, శిశువు శిరోదయం కోసం ఎదురుచూసే మంత్రసాని జాగరూకతతో.


■ పద్మజ సూరపరాజు ✆ 99403 44406

సోమవారం 28 ఏప్రిల్ 2025

వివిధ

vividha@andhrajyothy.com సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



జీరో గ్రావిటీ

చక్రాన్ని తిప్పుతూ తిప్పుతూ
అలసిపోవడమే పాపమైనపుడు
ఆనంద భైరవుని నెత్తినున్న మల్లెమాల
వజ్రపు కిరీటమై రోజుకింత బరువు పెరుగుతుంటది

ప్రకృతి పామై కాటేసే
ప్రతీ సందర్భంలో
కడుపులో పెరుగుతున్న శిరోభారాలు
నిన్ను మరమనిషిని చేసే మాయల పక్కీర్లు

ఆప్యాయతలు ప్రేమలు బాధ్యతల బంధాల్లో
అనివార్యమైన అల్లింపుల

నిర్మాణ సూత్రంలో
భార రహితస్థితి నీకో అనివార్యత

నీవు మోస్తున్న ప్రతి బరువూ
జారిపోతూ జారిపోతూ
నీకు ప్రసవ సుఖాన్ని పరిచయం చేస్తుంటది

నీవు కోల్పుతున్నది భారమేననే రహస్యం
నిన్ను తేలిక పరుస్తున్న
కన్నీటి సుక్కనడుగు చెప్తది

■ హజారి

నాకు నేనే గిఫ్ట్ ఇచ్చుకుంటాను

చదువు ముచ్చట

పూర్ణిమ తమ్మిరెడ్డి



ఆఖరుగా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?

సమాంతా హార్వే రాసిన 'ఆర్బిటాల్'. 2024 బుకర్ ప్రైజ్ అందుకున్న రచన. సైన్స్ ఫిక్షన్‌ను ఇంత కవితాత్మకంగా రాయచ్చా అని అనిపించింది. ప్రముఖ హిందీ కవి, వినోద్ కుమార్ శుక్లా రాసిన "దూర్ సే అప్నా ఘర్ దేఖ్నా చాహియే" (దూరం నుంచి మన ఇంటిని చూసుకోవాలి) అన్న కవితను గుర్తు తెచ్చింది. అలానే, కార్ల్ సాగన్ రాసిన 'ది పేల్ బ్లూ డాట్'ను కూడా!

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?

నాకు ఇరవై రెండేళ్ళు వచ్చే వరకూ స్కూలు, కాలేజీ పుస్తకాలు తప్పించి సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు అందుబాటులో లేవు. పదో తరగతిలో 'బారిష్టర్ పార్వతీశం' నాన్‌డిటేయిల్‌గా ఉండేది. అదే ఏడాది పరీక్షల్లో కొత్త తరహా ప్రశ్నాపత్రంలో మామూలు ప్రశ్నలు కాకుండా, సృజనాత్మకతకి తావిచ్చే "మీరు పార్వతీశం స్థానంలో ఉంటే ఏం చేస్తారు?" లాంటి ప్రశ్నలు ప్రవేశపెట్టారు. నాకు కథలు రాయాలన్న ఆసక్తి అక్కడ నుంచే మొదలైందనుకుంటాను.

ఒకప్పటికీ ఇప్పటికీ మీరు చదివే పద్ధతి ఎలా మారింది?

పైన చెప్పినట్టు, నేను ఇరవై రెండేళ్ళ వరకూ పుస్తకాలు చదవలేదు. అందుకని అందరూ చిన్నగా ఉన్నప్పుడు చదివే సాహిత్యం నేను చదవలేదు. ఏవి చదవాలన్నది తోటి బ్లాగర్ల రెకమెండేషన్ల బట్టి నిర్ణయించుకునేదాన్ని. అది ఇది అని తేడా లేకుండా ఆసక్తి కలిగించే ప్రతి రచననూ చదివేదాన్ని.

ఇప్పుడు నేను చేస్తున్న పనులకు పనికొచ్చే పుస్తకాలు ఎక్కువగా చదువుతున్నాను. అనువాదాలు చేస్తున్నాను కాబట్టి, దేశ విభజన సాహిత్యం, తెలంగాణ సాయుధ పోరాటం గురించి ఎక్కువగా చదివాను. అలానే, నా 'ఎలమి' ప్రచురణలు సంస్థ నుంచి తీసుకురాబోయే అనువాదాల కోసం దేశీ, విదేశీ సాహిత్యాన్ని చదువుతున్నాను.

ఇక నాకోసం చదువుకునే పుస్తకాలను ఎక్కువగా ఆడియో రూపంలో వింటున్నాను. ఉర్దూ, కన్నడ, హిందీ భాషల పుస్తకాలు వినడం వల్ల నాకా భాషలపై పట్టు పెరుగుతూ వస్తోందని నా నమ్మకం.

మీరు బహుమానంగా అందుకున్న పుస్తకాల్లో బెస్ట్?

కువెంపు రాసిన 'మలెగలల్లి మదుమగలు' అనే నవలను కన్నడ రచయిత అబ్దుల్ రషీద్ బహూకరించారు. కన్నడం నేర్చుకోవడం, చదవడం పట్ల నేను చూపిస్తున్న శ్రద్ధాసక్తులను ఆయన గమనించి ఈ క్లాసిక్ చదవమని ఇవ్వడం బాగా అనిపించింది. ప్రతీ ఏడాదీ నాకు నేను న్యూ ఇయర్ గిఫ్ట్‌గా నాకు ఇష్టమైన కార్టూనిస్టులు – గ్రాంట్ స్నైడర్, టామ్ గాల్డ్ – పుస్తకాలు ఇచ్చుకుంటాను.

మీరు తరచూ చేసే పుస్తక సమీక్షల గురించి చెప్పండి?

ఇంటర్నెట్‌లో విపరీతంగా సమాచారం (పుస్తకాలతో సహా) లభిస్తుంది. దానికి ఆదీ అంతం లేనట్టు ఉంటుంది. ఆ ఉధృత ప్రవాహంలో కొట్టుకుపోకుండా, నిలకడగా ఉండడానికి నేను పాటించే సూత్రం: నాకున్న తీరిక సమయంలో 50శాతం కంటెంట్ కన్స్యూమ్ చేస్తే, 50శాతం నేను ఏదో ఒకటి ప్రొడ్యూస్ చేయాలి. ఆ బాలెన్స్ పాటించకపోతే, డూమ్ స్క్రోలింగ్‌కు పుస్తకాలు చదువుకుంటూ పోడానికి పెద్ద తేడా ఉండదు. అందుకే పుస్తకం చదివాక, దాని గురించి రాసుకోవడం నాకు ముఖ్యం.

రచన విషయంలో మీకు దొరికిన మంచి సలహా?

దీర్ఘకాలం రచనలు చేస్తూనే ఉండడానికి కావాల్సిన వనరులు– డబ్బు, ఆరోగ్యం, తీరిక– సమకూర్చుకోవడంపై దృష్టి పెట్టమని అక్కినేని కుటుంబ రావు విలువైన సలహా ఇచ్చారు.



తరచుగా గుర్తొచ్చే కవితా పంక్తి?

"ఎప్పుడో ఒకప్పుడు, నేను వయసులో ఉన్నప్పుడు
ఎక్కడో ఒక కవిత చదివినట్లు గురుతు. అప్పుడు
భావం తెలియలేదు; కానీ క్రమేణ గ్రహించాను;
తరంగాల తాడనలా అర్థోద్ధతి సహించాను."

– జీవితానుభవాలు ఏవైనా కొత్త వెలుగులో అర్థమైన ప్రతిసారీ బైరాగి రాసిన ఈ పంక్తులను తలచుకుంటాను.

(పూర్ణిమ తమ్మిరెడ్డి రచయిత, అనువాదకురాలు, ప్రచురణకర్త. కథా సంపుటి– 'ఏమోషనల్ ప్రెగ్నెన్సీ'; అనువాదాలు– మంటో 'సియా హాషియే', అమృతా ప్రీతమ్ 'పంజరం'; నాన్‌ఫిక్షన్– 'ఆన్‌లైన్ స్కాములు' వెలువరించారు. ఓల్గా 'పంపాతీరం' నవలకు ఆమె ఇంగ్లీష్ అనువాదం త్వరలో రానుంది.)

ఈమెయిల్: purnimat07@gmail.com

హృదయం నుండి



1
జీవితానికి భయపడుతున్న బిడ్డకి
మార్దవంగా చెప్పావు

జీవితం అంతిమంగా దైవస్వరూపం
మరొకటి కాదు, ధైర్యంగా ఉండు

ఈ నిముషానికి శరణాగతి చెందు
నడవలేని బిడ్డని తల్లి ఎత్తుకున్నట్టు
జీవితమే నిన్ను మోస్తుంది

జీవితానుభవంలో ఖాళీ అనంతం
అనుభవాలు చీమల్లాంటివి
వాటిని చూస్తూ బెంగటిలవద్దు

దుఃఖం, భయం శిక్షలు కావు, శిక్షణ
చేయవలసిన ఉదాత్త కార్యాలకీ
పొందదగిన ఉదాత్త అనుభవాలకీ

చాలా మాటలు చెప్పాక, అడిగావు
ఉపయోగపడతాయా
ఆమె అంది.. ఏదో ఒకరోజు



2
ప్రేమ కావాలి
ఇదంతా ప్రేమ అనే మెలకువ కావాలి
ఇంతకన్నా అక్షరాలకి పనేముంది

లోతైన మెలకువ విత్తనం లాంటిది
నిశ్శబ్దంగా మొలకెత్తుతుంది
ఎండ పడే కాలానికి
నీడ నిచ్చే వృక్షమౌతుంది



3
జీవితం అందమైందో, కాదో
చెప్పగలవారు లేరు
ప్రపంచం నిజంగా ఉన్నదో, లేదో
తెలిసినవారు లేరు

కలలో ఉన్నవేళ
ఇది కల సుమా అని
ఎవరు ఎవరికి తెలియజెబుతారు

ఒక మాట పలకాలని తోచినపుడు
పదాల లోపలి
నిశ్శబ్దాన్నంతా గుమ్మరించగలిగితే
పలికినా పలకనివాడివి
అర్థం కాకున్నా విన్నవాడివి



4
బిడ్డని,
మాటలతో తాకావా, హృదయంతోనా

మాటలదేముంది
హృదయం పనిచేస్తుంది
హృదయం మాత్రమే..

■ బివివి ప్రసాద్

✆ 90320 75415



సోమేపల్లి అవార్డుల ప్రదానోత్సవం

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం – గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కీ.శే. సోమేపల్లి వెంకటసుబ్బయ్య జయంతి, సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం మే 1 సా.5గంటలకు కొరటాల భవన్, బ్రాడీపేట, గుంటూరులో జరుగుతుంది. అధ్యక్షత చలపాక ప్రకాష్; ముఖ్య అతిథులు పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ. కథా పురస్కారం సి. యమున ('రెక్కలొచ్చాయి'), కవితా పురస్కారం ఖాదర్ షరీఫ్ ('జీవ రహస్యలిపి') స్వీకరిస్తారు.

వశిష్ఠ సోమేపల్లి

ఉమ్మడిశెట్టి అవార్డుల ప్రదానోత్సవం

ఉమ్మడిశెట్టి అవార్డుల ప్రదానోత్సవం మే 4, ఫిలింభవన్, కరీంనగర్‌లో జరుగుతుంది. ఉమ్మడిశెట్టి సత్యాదేవి అవార్డును వైష్ణవిశ్రీ, ఉమ్మడిశెట్టి సతీష్ కుమార్ యువ పురస్కారాన్ని నందకిషోర్, రాధేయ కవితా పురస్కారాన్ని సుధామురళి స్వీకరిస్తారు. సభలో రాధేయ, నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం, అద్దేపల్లి ప్రభు, మానస చామర్తి పాల్గొంటారు.

ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్

వెచ్చటి వెన్నెల అను ఒక platonic poem

చుట్టూ చీకటి కమ్ముకునింది. మనిద్దరం పచార్లు చేస్తూ. నేనేమో రెండోసారి నీకోసం Mens Hostel - I నుండి North Ladies Hostel కి వాన తుంపర్లలో పలుచగా తడిసొచ్చి నువ్వేదో చెబుతావని ఎదురుచూస్తూ. నిశ్శబ్దంగా నీతో నడుస్తూ. అటు ఇటు రెండుమార్లు నడిచాక బహుశా చెప్పాలని నన్నాపావు గుండె కొట్టుకుంటున్నట్టు ఆగి వెలుగుతున్న వీధి లైట్ కింద, ఆ ఒకే కాంతి ఆ దారి మొత్తమ్మీద. "నీతో స్నేహం ఎండాకాలంలో కురిసిన వానజల్లులా బావుంది, వెచ్చని కౌగిలిలానూ ఉంది. మన స్నేహమొక శాశ్వతత్వంలా. అబ్బాయీ! కౌగిలించుకోవచ్చా నిన్నొకసారి?" అని నువ్వన్నప్పుడు నవ్వుతూ చాలా తేలికగా అన్నాను నీ మాటల్లోని కవితాత్మకతనీ జీవాత్మని గుర్తించక "ఎంతమందో కౌగిలించుకుంటారు నన్ను, పెద్ద తేడా ఏముంది నువ్వు కౌగలించుకున్నా, పర్లేదు, ఇవ్వు". అందరికిమల్లే నువ్వూ తేలికగా హత్తుకుంటావనుకున్నాను. ఎన్ని క్షణాలు కౌగిలించుకుని ఉంటామో గుర్తులేదు. కాస్త నిశ్శబ్దమూ ప్రశాంతత. పిల్లవాడు చందమామని అందులోని కుందేలుని మేఘాల వంటి మెత్తని కొండలని కౌగిలించుకుని నిదరోతున్నంత ప్రశాంతత.

•

చెప్పకూడదు ఇలా ఇప్పుడు:
మనం కలుసుకోలేనంత దూరమయ్యి, కలిస్తే మరొక్కసారి హత్తుకోవాలన్న తపన.

అమ్మాయీ,

ఎవరన్నా దగ్గరకొస్తే చికాకేస్తుంది తెలుసా! బహుశా మనసంతా నిరాకరణను కమ్ముకున్నదేమో నువ్వు రావాలని. నీ కౌగిలిలో పొందిన వెచ్చటి వెన్నెల ఇక్కడెవరిలోనూ దొరకదని నీకూ తెలుసు. నువ్వెళ్ళిపోయాక కౌగిలింతలన్నీ ముళ్ళదేహాలపై వాలి పావురానికి గాయమైనట్లు, చీకటిలో రాళ్ళు పరిచిన దారిలో చెప్పుల్లేకుండా నడుస్తున్నట్లు, కాలిపోతున్న చుట్టుగోడలు మధ్య ఇరుక్కుపోయినట్లు, నలిపిన కాగితంపై బొమ్మ గీసినట్లు.

అమ్మాయీ! ఎలా ఉన్నావు ఇంతకీ?
నీకూ ఇలాగే మనసు పీకుతోందా?

■ లిఖిత్ కుమార్ గోదా
✆ 96400 33378


అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కేసీఆర్


తెలంగాణ తల్లి విగ్రహానికి పూలు వేస్తున్న బీఆర్ఎస్ అధినేత

- తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన గడ్డ
- రాణిరుద్రమ, సమ్మక్క-సారలమ్మ, బమ్మెర పోతనలను కన్న భూమి
- పోరాటాల పురిటిగడ్డపై చరిత్రాత్మక సభ జరుపుకొంటున్నాం
- రజతోత్సవ సభలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్
- మావోయిస్టులపై ఊచకోతను ఆపి.. శాంతి చర్చలు జరపాలని డిమాండ్
- మూడేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేశామని వెల్లడి
- కాంగ్రెస్ హామీలన్నీ మోసమే.. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని వ్యాఖ్య


సభ ప్రారంభానికి ముందు పహల్గాం ఉగ్రదాడి మృతులకు నివాళిగా మౌనం పాటిస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఓరుగల్లు.. పోరుగల్లు..


మాట్లాడుతున్న కేసీఆర్


(వరంగల్- ఆంధ్రజ్యోతి ప్రతినిధి)


'ఓరుగల్లు.. పోరుగల్లు.. తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన పోరాటాల పురిటిగడ్డ వరంగల్ వేదికగా చరిత్రలో నిలిచిపోయేలా రజతోత్సవ సభ నిర్వహించుకుంటున్నాం. ఈ గడ్డకు ప్రత్యేక ఉంది.. రాణి రుద్రమ ఏలిన గడ్డ.. సమ్మక్క-సారలమ్మ, బమ్మెర పోతల జీవగడ్డ.. అమరులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా' అంటూ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ప్రసంగించారు. ఆదివారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ 25వ ఆవిర్భావ భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 1959లో మూగబోయిన తెలంగాణ గొంతుక మళ్లీ జీవం పోశామని, 2001 ఏప్రిల్ 27న తెలంగాణ సాధన కోసం టీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశామని, తెలంగాణ ఉద్యమానికి వరంగల్ వెన్నుదన్నుగా నిలిచిందని గుర్తుచేశారు. 10ఏళ్ల పాలనలో సాగునీటిప్రాజెక్టులకు పెద్దపీట వేశామన్నారు. వరంగల్‌లో పెండింగ్‌లో ఉన్న దేవాదుల ప్రాజెక్టును పూర్తి ఈ గడ్డకు నీళ్ల తెచ్చుకున్నామని, మూడేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టును కట్టుకున్నామని, వాగుల మీద వంకల మీద చెక్‌డ్యాంలు కట్టుకున్నామని, మిషన్ కాకతీయ ద్వారా చెరువులన్నింటిని పూడికలు తీసుకున్నామని, అద్భుతమైన తెలంగాణను తయారు చేసుకున్నామని కేసీఆర్ పేర్కొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపండి

తెలంగాణ సరిహద్దులో కేంద్రం ఆపరేషన్ కాగర్ పేరుతో నక్సల్స్‌ను ఊచకోత కోస్తోందని, వాళ్ల శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటిస్తున్నారని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపితే వాళ్ల డిమాండేంటో తెలుస్తుందని కేసీఆర్ పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేసి, కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో చర్చలు జరపాలని ప్రభుత్వాలను

మిగతా 7వ పేజీలో...


సభకు హాజరైన వారికి నమస్కరిస్తున్న కేసీఆర్




రజతోత్సవ సభకు భారీగా హాజరైన జనం

కార్యకర్తలకు కేటీఆర్, హరీశ్‌రావు అభివాదం



రజతోత్సాహం

7

- బీఆర్ఎస్ 'పాతికేళ్ల' సభ సక్సెస్
- శ్రేణులకు కేసీఆర్ దశదిశా నిర్దేశం
- మళ్లీ అధికారంలోకి వస్తామని ప్రకటన
- సుమారు గంట సేపు ప్రసంగించిన అధినేత
- సభలో ప్రసంగించని ఇతర నేతలు


వరంగల్ కోట, వేయిస్తంభాల ఆలయాలను పరిశీలించిన ఈవెంట్ నిర్వాహకులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అందాల భామల ఓరుగల్లు పర్యటనలో మార్పులు

- మే 14న వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట సందర్శన
- పర్యటన షెడ్యూల్‌ను మార్చిన ప్రభుత్వం

6


ఏప్రిల్ 21న ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలో ప్రచురితమైన కథనం

నేడు కాంగ్రెస్ సమావేశం

- టీపీసీసీ పరిశీలకులు కోటిమ్‌రెడ్డి వినయ్‌రెడ్డి, మక్సూద్ అహ్మద్ రాక
- సంస్థాగత నిర్మాణంపై దిశా, నిర్దేశం
- గ్రామ స్థాయి నుంచి పదవుల భర్తీపై దృష్టి



హనుమకొండ సిటీ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ శ్రేణుల జిల్లా సమావేశం సోమవారం జరుగనుంది. ఉదయం 10:30 గంటలకు హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ప్రారంభం కానుంది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరం గల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో హనుమకొండ జిల్లా టీపీసీసీ పరిశీలకులుగా నియమితులైన కోటిమ్‌రెడ్డి వినయ్‌రెడ్డి, మక్సూద్ అహ్మద్ పాల్గొననున్నారు. జిల్లా పరిశీలకులుగా బాధ్యతలు చేపట్టాక తొలి సారి హనుమకొండకు ఇరువురు రానున్నారు. ఇటీవలే హైదరాబాద్ గాంధీ భవన్ సమావేశంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో జిల్లాలకు టీపీసీసీ పరిశీలకుల నియమాకం జరిగింది. ఈ క్రమంలో కోటిమ్‌రెడ్డి వినయ్‌రెడ్డి, మక్సూద్ అహ్మద్ సమావేశానికి హాజరై పరిచయం కానున్నారు. జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, టీపీసీసీ పరిశీలకులు కోటిమ్‌రెడ్డి వినయ్‌రెడ్డి, మక్సూద్ అహ్మద్ శ్రేణులకు పార్టీ సంస్థాగత నిర్మాణంపై దిశా, నిర్దేశం చేస్తారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ నిర్మాణంలో భాగంగా పదవుల భర్తీ చేసే ప్రక్రియను సమావేశంలో చర్చిస్తారు. పార్టీ కోసం పని చేసే నాయకత్వాన్ని గుర్తించడంపై దృష్టి పెడతారు. కమిటీల నిర్మాణ కసరత్తును ఆరంభించడం, పార్టీ కోసం నిరంతరాయంగా పని చేస్తున్న వారిని గుర్తించడంలో భాగంగా గ్రామ స్థాయి నుంచి నాలుగు నుంచి ఐదుగురి నాయ కుల పేర్లతో నివేదికను రూపొందించే అంశాలను సమావేశంలో చర్చిస్తారు. అబ్జర్వర్ల నియామకం తరువాత గ్రామ స్థా యి నుంచి పార్టీ కార్యక్రమాల నిరంతర నిర్వహణ, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం, పార్టీకి ప్రజల మద్దతును ఎప్పటికప్పుడు కూడగట్టే చర్యలు నిర్వహించడం తదితర అంశాలపై టీపీసీసీ అధినాయకత్వ గాంధీభవన్ సమావేశంలో జిల్లా అధ్యక్షులు, కొత్తగా నియమితులైన టీపీసీసీ పరిశీలకులకు ఉపదేశించింది. దీనిని కార్యరూపంలో పెట్టే దిశగా జిల్లా కాంగ్రెస్ సమావేశం జరుగనుండడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. సంస్థాగత నిర్మాణం దిశగా పార్టీ చర్యలు చేపట్టడంతో యువ నాయకత్వానికి ప్రాధాన్యత ఉంటుందనే అభిప్రాయాలు నెలకొన్నాయి.

నేడు బల్దియాలో 'ప్రజావాణి'

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం(నేడు) జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ తెలిపారు.

నేటి కలెక్టరేట్ గ్రీవెన్స్ రద్దు

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నేడు(సోమవారం) రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారం అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ దృష్ట్యా రద్దు చేశామని, వచ్చే సోమవారం యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు దీనిని గమనించాలని కలెక్టర్ ప్రకటనలో పిలుపునిచ్చారు.

కర్రెగుట్టల్లో కొనసాగుతున్న కూంబింగ్

- గుట్టలపై గుహ ఉన్నట్లు మీడియాలో ప్రచారం

వెంకటాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో ఆరు రోజులుగా కేంద్ర బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. కర్రెగుట్టల్లో మావోయిస్టు అగ్రనేతలతోపాటు సుమారు వెయ్యి మంది ఉన్నట్లు నిఘావర్గాల సమాచారం. దీంతో కేంద్ర బలగాలు కర్రెగుట్టలను చుట్టు ముట్టి మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను తొలగించుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఆరో రోజు కర్రెగుట్టలపై సుమారు వెయ్యి మంది ఉండేలా గుహ ఉందని, అందులో నీటి సౌకర్యంతోపాటు నిత్యావసర సరుకులు, ఆయుధాలు ఉన్నట్లు కూంబింగ్ ఆపరే షన్‌కు వెళ్లిన జవాన్లు గుర్తించారని, వారి రాకను గమనించిన మావోయిస్టులు వేరే ప్రాంతానికి వెళ్లారని మీడియాలో వైరల్ అవ తోంది. అయితే.. ఈ విషయం అధికారికంగా వెల్లడికాలేదు.

ఆగుతూ.. సాగుతూ..

- ఎట్టకేలకు తుదిదశకు కాజీపేట ఆర్వోబీ పనులు
- రూపుదిద్దుకుంటున్న బౌ స్ట్రింగ్ ఆర్చ్ పనులు
- సీఎంతో ప్రారంభింప జేసేలా సన్నాహాలు

6


కొనసాగుతున్న బౌ స్ట్రింగ్ ఆర్చ్ పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అందాల భామల ఓరుగల్లు పర్యటనలో మార్పులు

- మే 14న వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట సందర్శన
- పర్యటన షెడ్యూల్‌ను మార్చిన ప్రభుత్వం

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వేదికగా వచ్చే నెల జూన్ 6, 7 తేదీల నుంచి మిస్ వరల్డ్ పోటీలు జరగనున్న నేపథ్యంలో ఆ పోటీలకు హాజరయ్యే వివిధ దేశాల సుందరీమణులను రాష్ట్రంలోని పర్యాటక, చారిత్రక ప్రదేశాలను చూపించేలా ప్రభుత్వం ఓ ప్రణాళికను ఖరారు చేసింది. అందులోభాగంగా మే 14న 30 దేశాలకు చెందిన అందాల భామలు ఉమ్మడి ఓరుగల్లు జిల్లాలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయంతో పాటు హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రాన్ని చూపేలా పర్యటన షెడ్యూల్ ఖరారు చేశారు. అయితే రామప్ప, కాళోజీ కళాక్షేత్రాన్ని చూపడం వరకు సరే కానీ అసలు ఎంతో చారిత్రకమైన ఓరుగల్లు ఖ్యాతికి నిదర్శనమైన వేయిస్తంభాల ఆలయం, కాకతీయులు ఏలిన వరంగల్ కోట ప్రాంతాలను ఆ జాబితాలో చేర్చకపోవడంపై ప్రజల్లో చర్చ జరిగింది. ఈ క్రమంలో ఏప్రిల్ 21న 'ఆంధ్రజ్యోతి' ఉమ్మడి వరంగల్ జిల్లా సంచికలో 'కోట కానరాలేదా అందాల బామల సందర్శన ప్రాంతాల్లో లేని ఖిలావరంగల్ శీర్షికన కథనం ప్రచురితమైంది. ఆ కథనం ప్రజల్లో విస్తృత చర్చకు దారితీయగా.. దాన్ని పరిగణనలోకి తీసుకున్న పర్యాటక శాఖ అధికారులు సుందరీమణుల పర్యటన షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేయడం విశేషం. మే 14వ తేదీన అందాల భామల బృందం ఒకటి హైదరాబాద్ నుంచి నేరుగా రామప్పకు చేరుకోనుంది. మరో బృందం నేరుగా హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌కు చేరుకొని అదే రోజు వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోటలను సందర్శించి ఆ తర్వాత కాళోజీ కళాక్షేత్రంలో సమావేశం కానున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ ప్రతిపాదనతో ప్రభుత్వం సుందరీమణుల వరంగల్ పర్యటన కార్యక్రమాన్ని రీ షెడ్యూల్ చేయగా.. ఆదివారం హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట ప్రాంతాలను పది మంది ఈవెంట్ నిర్వాహకుల తోపాటు పర్యాటక శాఖకు చెందిన సూర్య కిరణ్, లోకేష్ తదితరులు సందర్శించి కార్యక్రమాలను ఖరారు చేశారు. అయితే ఇప్పటికే యునెస్కో గుర్తింపు ద్వారా రామప్పకు ప్రపంచవ్యాప్త వారసత్వ కట్టడంగా గుర్తింపు లభించింది. ఇదే తీరులో సుమారు వేయి సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉన్న ప్రస్తుత శిల్ప కళా సౌందర్య సహస్ర స్తంభాల ఆలయం కూడా మిస్ వరల్డ్ పోటీదారుల సందర్శన నేపథ్యంలో దీనికి కూడా అంతర్జాతీయస్థాయి గుర్తింపు వచ్చే అవకాశాలున్నాయి. దీంతో పాటు వరంగల్ చారిత్రక కోట వైభవం కూడా మరింత ప్రాచుర్యంలోకి రానుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే కేవలం రామప్ప, కాళోజీ కళాక్షేత్రం సందర్శనకే పరిమితమైన సుందరీమణుల పర్యటనలో మార్పులు చేసి వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోటను కూడా ఆ జాబితాలో చేర్చడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



సుందరీమణుల పర్యటన కోసం వేయిస్తంభాల ఆలయాన్ని పరిశీలిస్తున్న ఈవెంట్ నిర్వాహకులు



'కోట'ను పట్టించుకోలేదంటూ 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం



కనకదుర్గ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీఎం రఘుపతిరావు, వివిధ విభాగాల ఉద్యోగులు

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' డైరెక్టర్ కనకదుర్గకు ఘన నివాళి

మడికొండ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ -ఆంధ్రజ్యోతి సంస్థల డైరెక్టర్ వేమూరి కనకదుర్గ నాలుగో వర్ధంతి సందర్భంగా ఆదివారం హనుమకొండ జిల్లా మడికొండలోని 'ఆంధ్రజ్యోతి' వరంగల్ యూనిట్ కార్యాలయంలోని ఉద్యోగులు, సిబ్బంది ఆమెకు నివాళులర్పించారు.ఈసందర్భంగా సంస్థ అభ్యున్నతికి కనకదుర్గ చేసిన కృషిని వారు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ వర్ధినేని రఘుపతిరావు, ఎడిషన్ ఇన్‌చార్జి కొల్లు రాజేష్, ఎలక్ట్రికల్ ఆర్ఎం అజయ్, ఏడీవీటీ ఇన్‌చార్జ్ మాటేటి రమేష్, అసిస్టెంట్ సర్క్యులేషన్‌మేనేజర్ షరీఫ్, సబ్‌ఎడిటర్లు, పలు విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

అంతరాలు లేని సమాజ నిర్మాణానికి పునరంకితమవుదాం

- పూలే, అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి
- కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కృష్ణ



పూలే, అంబేద్కర్ జనజాతర సభలో మాట్లాడుతున్న కృష్ణ

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు గడిచినా భారతదేశంలో అట్టడుగు వర్గాలు అంటరానితనం, వివక్షతను ఎదుర్కొంటున్నాయని.. అంత రాలులేని సమాజ నిర్మాణానికి మనమంతా పునరంకితమవుదామని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ గడ్డం కృష్ణ అన్నారు. మహబూబాబాద్ ఐఎంఏ హాల్‌లో కుల వివక్ష వ్యతిరేకపోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో ఆదివారం పూలే, అంబేద్కర్ జన జాతర సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘంజిల్లా అధ్యక్షుడు చీపిరి యాకయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. మహనీయుల విగ్రహాలకు దండలు వేసేందుకు పోటీ పడుతున్న రాజకీయ నేతలు వారి ఆశయాలను ముందుకు తీసుకుపోవడంలో చిత్తశుద్ధి కనపరచడం లేదని చెప్పారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కోసం పాటు పడ్డ పూలే, అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని సూచించారు. జ్ఞానం ఎవరి సొత్తు కాదని అది అందరిదని చెప్పారు. అన్ని సమస్యలకు పరిష్కారం ఒక్కటేనని అదే రాజకీయ అధికారమేనని చెప్పారు. ఆ దిశగా దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలు కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫిరోజ్ గణేష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌భావజాలాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందిరిపై ఉందన్నారు. తొలుత పూలే, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేవీపీఎస్, ప్రజా, కులసంఘాల నాయకులు సాదుల శ్రీనివాస్, దుడ్డెల రాంమూర్తి, గుగ్గిళ్ల పీరయ్య, గుగులోతు కిషన్‌నాయక్, చాగంటి ప్రభాకర్, పిల్లి సుధాకర్, బొడ్డుపల్లి ఉపేంద్రం, గునిగంటి రాజన్నసామెల్,బానోత్ వెంకన్న,వీరస్వామి, ప్రశాంత్, గణేష్, వెంకన్న, దర్గయ్య పాల్గొన్నారు.



గుండ్లకుంటకాలనీలో రాజ్యాంగ రక్షణ సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జేఎంఎం నేతలు

రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలంతా ఏకం కావాలి

జేఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : దేశంలో రాజ్యాగం ప్రమాదంలో ఉందని, రాజ్యాంగ రక్షణకు కులాలు, మతాల కతీతంగా ప్రజలంగా ఏకం కావాలని జాతీయ మాల మహానాడు (జేంఎంఎం) రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. మహబూబాబాద్ వీఆర్ఎస్ గార్డెన్స్ ఈనెల 29న జేఎంఎం, తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో జరుపతలపెట్టిన రాజ్యాంగ పరిరక్షణ సదస్సు కరపత్రాలను పట్టణంలోని గుండ్లకుంట కాలనీలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ సదస్సుకు ముఖ్యవక్తగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ హాజరవుతున్నారని, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగంపై జరుగుతున్న దాడిని అడ్డుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు చీపిరి యాకయ్య, తవ్వ జయపాల్, జాన్, సురేష్, శైలజ, ఎల్లమ్మ, విజయలక్ష్మి, కృష్ణ, సరిత, తిరుపమ్మ, పద్మ, రజియా, సుహాసిని పాల్గొన్నారు.

ఫిర్యాదులపై పట్టింపేది?

ఎంజీఎంలో అలంకారప్రాయంగా బాక్స్



ఫిర్యాదుల పెట్టె

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర తెలంగాణలో పేదల ఆస్పత్రిగా ప్రసిద్ధి చెందిన ఎంజీఎం ఆస్పత్రిలో రోగుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు కొన్ని నెలల కిందట ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టె అలంకారప్రాయంగా ఉంది. వరంగల్ కలెక్టర్ సత్యశారద ఆదేశంతో ఎంజీఎంలోని పలు వార్డులలో పెట్టెలను ఏర్పాటు చేశారు. శానిటేషన్, సెక్యూరిటీ, వైద్య సహాయంలో ఏమైనా ఫిర్యాదులు ఉంటే ఈ డబ్బాలో వేయమని సూచించారు. స్వయంగా కలెక్టర్ ఫిర్యాదులను పరిశీలిస్తారని పెట్టెలపై పేర్కొన్నారు. ఈ పెట్టెలు ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఫిర్యాదులను చూడకపోవడం పట్ల రోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదుల డబ్బా నిండికొని బయటికి వస్తున్నాయని రోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎంజీఎంలో క్షేత్రస్థాయి సేవలు మెరుగుపర్చేందుకు ఫిర్యాదుల పెట్టెలోని ఫిర్యాదులను పరిష్కరించాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కేసముద్రంలో మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

ప్రధాని మన్‌కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ నాయకులు

కేసముద్రం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ 121వ భాగం కార్యక్రమాన్ని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం విలేజి బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పొదిల నర్సింహారెడ్డి ఇంట్లో ఆదివారం ఆ పార్టీ నాయకులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్, ప్రధాన కార్యదర్శి బొగోజు నాగేశ్వరాచారి, గాంతి వెంకటరెడ్డి, మల్యాల రాములు, కొనకటి రవీందర్, బొల్లోజు వీరన్న, చెలగొల వెంకటేష్, జాటోత్ రమేష్ పాల్గొన్నారు.

బైక్ దహనం, కారు ధ్వంసం





కాలిపోయిన ద్విచక్రవాహనం, ధ్వంసమైన కారు

మరిపెడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : అన్నకు సంబంధించిన ద్విచక్ర వాహనాన్ని తమ్ముడు దహనం చేసి, కారును ధ్వంసం చేసిన సంఘటన ఆదివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని వీరారంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందినచల్లా రవి తనకు వారసత్వంగా వచ్చిన మామిడి తోటలో కూలీలతో ఆదివారం కాయలు కోయిస్తున్నాడు. ఈ క్రమంలో రవి సోదరుడు సత్యనారాయణ అక్కడికి చేరుకొని ఆగ్రహంతో రవి బైక్‌పై పెట్రోల్ పోసి దహనం చేశాడు. అంతటితో ఆగకుండా రవి ఇంటి వద్ద ఉన్న కారును సైతం సత్యనారాయణ ధ్వంసం చేశారు. ఈ విషయంపై మరిపెడ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితడు రవి తెలిపాడు. అయితే అన్నదమ్ముల మధ్య మామిడితోట విషయంలో వివాదం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

అన్ని దారులు ఎల్కతుర్తి వైపే

- వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య
- వాహనాలన్నీ సింగిల్ లైన్‌లోకి రావడంతో ట్రాఫిక్‌జామ్



బావుపేట క్రాస్ వద్ద ట్రాఫిక్ జాం

హసన్‌పర్తి/కమలాపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి వచ్చే వాహనాలు, ఎడ్ల బండ్లు ఎల్కతుర్తికి బయలుదేరాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు హసన్‌పర్తి, కమలాపూర్ నుంచి బావుపేట క్రాస్ రోడ్డు ఫోర్ లైన్ల నుంచి ఎల్కతుర్తికి బయలు దేరాయి. సాయంత్రం 5 గంటలకు సభా స్థలికి చేరుకోవాల్సిన వాహనదారులు మధ్యాహ్నం నుంచి పెద్దగా లేకపోవడంతో ప్రధాన రహదారుల్లో రద్దీ లేదు. సాయంత్రం 3.30 గంటల నుంచి వాహనాల రద్దీ గంట గంటకు పెరగడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. కమలాపూర్, హనుమకొండ నుంచి హసన్‌పర్తి, బావుపేట క్రాస్ రోడ్డు మీదుగా ఫోర్‌లైన్ల ద్వారా ఎల్కతుర్తి సభకు చేరుకోవాల్సి ఉంది. బావుపేట ఎన్‌హెచ్ పనులు పూర్తి కాకపోవడంతో ఫోర్‌లైన్ల ద్వారా వచ్చే వాహనాలు అనంతసాగర్ కెనాల్ సమీపంలో సింగిల్ రోడ్డు నుంచి ఎల్కతుర్తి సభా స్థలికి చేరుకోవాల్సి ఉంది. దీంతో వాహనాల రద్దీ పెరిగి అక్కడ మూడు కిలోమీటర్ల మేర ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. బీఆర్ఎస్ నేతలు, ప్రజా ప్రతినిధులకు ఇబ్బందులు తప్పలేదు.

మొరాయించిన సత్తుపల్లి డిపో బస్సు

సత్తుపల్లి నుంచి సభకు వస్తున్న సత్తుపల్లి డిపో బస్సు బావుపేట క్రాస్‌రోడ్డులోని సింగిల్ రోడ్డుకు చేరుకోవడంతో రేడియేటర్ వేడై నిలిచిపోయింది. వాహనాలను క్రమబద్ధీకరించి ఎల్కతుర్తి సభకు చేరుకునేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. బావుపేట క్రాస్ రోడ్డు వద్ద ట్రాఫిక్‌జామ్ కాకుండా హసన్‌పర్తి ఎస్సై దేవేందర్, ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ఆగుతూ.. సాగుతూ..

- ఎట్టకేలకు తుదిదశకు కాజీపేట ఆర్వోబీ పనులు
- రూపుదిద్దుకుంటున్న బౌ స్ట్రింగ్ ఆర్చ్ పనులు
- సీఎంతో ప్రారంభింపజేసేలా సన్నాహాలు



నిర్మాణ దశలో ఉన్న ఆర్వోబీ

కాజీపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఆగుతూ.. సాగుతూ.. కాజీపేట ఫాతిమానగర్ అదనపు ఆర్వోబీ పనులు ఎట్టకేలకు తుదిదశకు చేరుకున్నాయి. రాష్ట్రంలో మునుపెన్నడు లేనివిధంగా ఆర్వోబీపై ఉక్కుతో తయారు చేస్తున్న బౌ స్ట్రింగ్ ఆర్చ్ పనులు శరవేగంగా నడుస్తున్నాయి. రేయింబవళ్లు పనులు చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి విడి భాగాలు తీసుకువచ్చి ఇక్కడే నేలపై బిగిస్తున్నారు. విల్లు ఆకారంలో నిర్మించే సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా బ్రిడ్జిపై బిగించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్చ్ మోడలింగ్ ఫినిషింగ్ పనులు పరుగులు తీస్తున్నాయి. 1600 టన్నుల బరువుతో 500 అడుగుల పొడవుతో ఆర్చ్ నిర్మిస్తున్నారు. పనులు పూర్తయిన తర్వాత బ్రిడ్జికి నయా లుక్ వస్తుందని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఆర్వోబీకి ఇరువైపులా నిర్మాణం పూర్తయ్యింది. రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జి జాయింట్లు కలిపి, దానిపై బౌస్ట్రింగ్ ఆర్చ్ బిగిస్తే దాదాపు పనులు పూర్తయినట్లేనని రైల్వే, ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. ఎస్‌వీఆర్ సంస్థ ఈ నిర్మాణ పనులు చేస్తుంది.



కొనసాగుతున్న బౌ స్ట్రింగ్ ఆర్చ్ పనులు

ఎనిమిదేళ్ల క్రితం శంకుస్థాపన పనులు

9.5 మీటర్ల వెడల్పు, 1.5 మీటర్ల ఫుట్‌పాత్, రూ. 40 కోట్ల బ్రిడ్జి నిర్మాణానికి రూ.20 కోట్ల బౌ స్ట్రింగ్ ఆర్చ్ కోసం, ల్యాండ్‌తో కలిపి మొత్తం రూ. 78 కోట్లతో ఆర్వోబీ పనులకు 2017 సంవత్సరంలో శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. 2019లో టెండర్లు పిలిచారు. 2020లోనే పూర్తికావల్సిన ఈ పనులు నిధుల విడుదల జాప్యంతో ఐదు సంవత్సరాలుగా కొనసాగుతున్నాయి.

80 సంవత్సరాల గ్యారంటీ ఐరన్ షీట్లతో జాయింట్ చేసి సిమెంట్‌తో ఫ్లోరింగ్ పనులు, పూర్తి స్థాయి స్ప్రింగ్ యాక్షన్‌తో మరో మూడు నెలల్లో పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్ట్ సంస్థ ప్రణాళిక వేసింది. ఈ ఆర్వోబీని సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభించేందుకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సన్నాహాలు చేస్తున్నారు.

ట్రాఫిక్‌కు చెక్

ప్రస్తుతం ఇప్పుడున్న ఆర్వోబీ అప్పటి జనాభా రాకపోకలకు అనుగుణంగా నిర్మించింది. ప్రస్తుతం దాని కాలపరిమితి పూర్తయ్యింది. అక్కడక్కడా పెచ్చులూడి చిన్న మరమ్మతులతో పనిచేస్తుంది. అంతేకాకుండా హైదరాబాద్-వరంగల్ ప్రధాన రహదారికి ఈ బ్రిడ్జి అత్యంత ప్రాధాన్యమైంది. ఉదయం, సాయంత్రం ఉద్యోగులు, విద్యార్థులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ బ్రిడ్జిపై ఏ చిన్న ప్రమాదం జరిగినా గంటలకొద్ది ట్రాఫిక్‌జామ్ అవుతోంది. కొత్తగా నిర్మించే బ్రిడ్జితో ట్రాఫిక్‌జామ్‌కు చెక్ పడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



హెలీప్యాడ్ వద్ద కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న నేతలు



బీఆర్‌ఎస్ ఆవిర్భావ రజతోత్సవ సభలో కార్యకర్తల ఉత్సాహం



రజతోత్సాహం



సూర్యాపేట నుంచి సభకు వచ్చిన ఎడ్లబండ్లు



పులుముకున్న అభిమానం..

శరీరంపై జైకేసీఆర్ నినాదాలతో సభకు వచ్చిన అభిమానులు

పార్టీ శ్రేణులకు కేసీఆర్ దశదిశా నిర్దేశం

- మళ్లీ అధికారంలోకి వస్తామని ప్రకటన
- సుమారు గంట సేపు ప్రసంగించిన అధినేత
- ప్రసంగించని ఇతర నేతలు



హనమకొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పోరుగల్లు.. ఓరుగల్లు వేదికగా జరిగిన బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ సక్సెస్ అయ్యింది. నాడు తెలంగాణ ఉద్యమంలో ఈ పోరుగడ్డ నిర్వహించిన భూమిక ఎప్పటికీ మరవలేనిదంటూ గుర్తు చేసుకున్న మాజీ సీఎం బీఆర్‌ఎస్ అధినేత కె చంద్రశేఖర్ రావు.. పార్టీ శ్రేణులకు భవిష్యత్‌పై దశదిశా నిర్దేశం చేశారు. ఆదివారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన రజతోత్సవ మహా సభ పార్టీ నేతలు ఊహించిన మేరకు విజయవంతమైంది. వాతావరణం కూడా అనుకూలించడం, నేతల జనసమీకరణ ఫలితంగా పలు జిల్లాల నుంచి భారీగా శ్రేణులు తరలిరావడంతో సాయంత్రం 6 గంటలకల్లా సభాప్రాంగణం నిండిపోయింది. పలుచోట్ల ట్రాఫిక్ జామ్ కారణంగా చాలా మంది మార్గమధ్యలోనే ఆగిపోయినట్టు తెలుస్తోంది. సభనుద్దేశించి కేసీఆర్ సుమారు గంటపాటు ప్రసంగించారు. ప్రసంగంలో ఇదివరకటి ఉద్వేగం. ఆవేశం, చణుకులు, చురకలు లేకపోయినా చెప్పదలుచుకున్నా విషయాన్ని స్పష్టంగా.. సూటిగా చెప్పారు. ఇక ప్రసంగం మొదట్లోనే వరంగల్ జిల్లా ప్రాముఖ్యాన్ని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తమ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హాయంలో వివిధ రంగాల్లో చేసిన అభివృద్ధిని వివరిస్తూనే ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ప్రాజెక్టుల అమలును గుర్తు చేశారు. దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేశామని, మూడేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామన్నారు. మిషన్ కాకతీయ ద్వారా ఏడాది పొడవున పంటలకు నీళ్లందేలా చెరువులను అభివృద్ధి చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఏడాదిన్నర పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధిని వివరించడం ద్వారా ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కేసీఆర్ తన ప్రసంగంలో బీఆర్‌ఎస్ శ్రేణులకు దశాదిశ నిర్దేశం చేశారు. మళ్లీ వంద శాతం బీఆర్‌ఎస్ అధికారంలో వస్తుందని భరోసా ఇచ్చారు. ఇందుకు పార్టీ శ్రేణులు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే తాను బయటకు వస్తానని ప్రజలతో మమేకం అవుతానని, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా పోరాటాలు సాగిస్తానన్నారు. బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు ఇందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సభను విఫలం చేయడాని కాంగ్రెస్ కుట్రలు చేసిందని ఆరోపించారు. ఇందుకు పోలీసులు సహకరించారని ఆరోపించారు. పోలీసులను పరోక్షంగానే హెచ్చరించారు. పోలీసులు తమ విధులను నిర్వహించాలి కానీ రాజకీయాలకు ఎందుకు అని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వంపై కూడా కేసీఆర్ ధ్వజమెత్తారు. కగార్‌ను నిలిపివేయాలని కోరారు. సభకు బీఆర్‌ఎస్ అగ్రనేతలంతా హాజరయ్యారు. వారెవ్వరూ మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎటువంటి ప్రసంగం లేకుండా ముక్తసరిగా స్వాగతం చెప్పి తప్పుకున్నారున కేసీఆర్ మాత్రమే మాట్లాడారు. వేదికపై పెద్ద సంఖ్యలో నాయకులు ఆసీనులయ్యారు. అంతకు ముందు కళాకారులు ఆటపాటలతో ఉర్రూతలూగించారు. గులాబీ జెండాలు, తెలంగాణ ఉద్యమ నేపథ్యంలోని ఆటపాటలతో సభా ప్రాంగణం హోరెత్తింది. సభ సక్సెస్ కావడంతో బీఆర్‌ఎస్ నేతల్లో సంతోషం వెల్లివిరిసింది.





సభా వేదికపై పలు జిల్లాల నేతలు, ప్రారంభోపన్యాసం చేస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు





సభకు హాజరైన జనం, సభలో కళాకారుల ఆటపాట, వేదిక ముందుకు దూసుకొచ్చేందుకు ప్రయత్నించిన కార్యకర్తలను అదుపుచేస్తున్న వలంటీర్లు









సభావేదికపై బీఆర్‌ఎస్ నేతలు, ప్రజలకు అభివాదం చేస్తున్న కల్వకుంట్ల కవిత, సత్యవతిరాథోడ్, మాలోత్ కవిత, తదితరులు

ఆవిరైన అభిమానం



సభ వద్దకు వెళ్లనీయకుండా పోలీసులు ఆపిన కేసీఆర్ అభిమాని

వరంగల్ క్రైం/ వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అభిమానంతో ఒళ్లంతా గులాబీ రంగు పూసుకుని 'సైకో పోవాలి.. కేసీఆర్ రావాలి' అనే నినాదాన్ని చేతులపై, వీపుపై రాసుకుని వచ్చారు సూర్యాపేట జిల్లా తుంగతుర్తి ప్రాంతానికి చెందిన సురేష్‌యాదవ్, బందెల శ్రీను. కాగా, వారిని వేదిక వద్దకు సెక్యూరిటీ రానివ్వకపోవడంతో నిరాశకు గురయ్యారు.

చేతులెత్తేసిన పోలీసులు!



సభాప్రాంగణం వద్ద పోలీసులు

కేసీఆర్ సభలో పోలీసులు చేతులెత్తేయడంతో ప్రజలను నియంత్రించకపోవడంతో వారిని అదుపు చేయడం పార్టీ కార్యకర్తల వల్ల కాలేదు. 1100 మంది పోలీసులుబందోబస్తులో పాల్గొంటున్నామని కమిషనరేట్ కార్యాలయం నుంచి ప్రకటించినప్పటికీ సభ ప్రాంగణం సమీప ప్రాంతా ల్లో 50 నుంచి 100 మంది కూడా కనిపించకపోవడం గమనార్హం. సభ ముగిసిన అనంతరం తిరుగు ప్రయాణంలో పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. ఎల్కతుర్తి నుంచి ఎటు వైపుచూసినా సుమారు 10 కిలో మీటర్ల మేరకు ట్రాఫిక్ స్తంభించింది. సభకు వచ్చిన ప్రజలతో పాటు సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విధులకు వచ్చిన కొంత మంది పోలీసు ట్రాఫిక్ రద్దీలో ఇరుక్కున్నప్పటికీ ట్రాఫిక్‌ను క్లియర్ చేయకపోగా ఎప్పుడు ఇంటికి తొందరగా వెళదామని రాంగ్‌రూట్లో ప్రయాణించి ట్రాఫిక్ అంతరాయాన్ని మరింత తీవ్రం చేశారు. ప్రాణాపాయ స్థితిలో వ్యక్తిని తరలిస్తున్న అంబులెన్స్ ట్రాఫిక్‌లో ఇరుక్కు పోవడంతో స్థానిక యువకులు, సభకు వచ్చిన ప్రజలు గంట సేపు శ్రమించి ట్రాఫిక్ క్లియర్ చేసి అంబులెన్స్‌ను పంపించారు.

ఓరుగల్లు.. పోరుగల్లు..

(5వ పేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్రానికి పార్టీ తరుపున లేఖ రాస్తామన్న ఆయన సభలో ఈ మేరకు తీర్మానం చేయించారు.

కాంగ్రెస్ హామీలన్నీ మోసమే..

కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని కేసీఆర్ ఆరోపించారు. గతంలో తాము రైతు బంధు ద్వారా రైతులకు రూ.10వేలు ఇస్తే, అధికారంలోకి వస్తే రూ.15వేలు ఇస్తామన్నారని, మరి ఇస్తున్నారా అని కేసీఆర్ ప్రశించారు. లేదు అంటూ సభికులు పేర్కొన్నారు. అలాగే రూ.2వేల పింఛన్‌ను రూ.4వేలు చేయటమే కాకుండా.. ఇంట్లో ఇద్దరూ ఉంటే ఇద్దరికిస్తాం అని చెప్పి మోసగించారని, దివ్యాంగులకు రూ.6వేలు, ఆడబిడ్డలకు స్కూటీలు, విద్యార్థులకు రూ.5లక్షల బ్యాంకు కార్డు ఇస్తామని, డిసెంబర్ 9 నాడే ఒక్క కలం పోటుతో రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. వడ్లు, మొక్కజొన్నకు రూ.500 బోనస్ ప్రతీ పంటకు ఇస్తామని చెప్పారని, కల్యాణలక్ష్మి కింద రూ.లక్షతో పాటు తులం బంగారం కలిపిస్తానని మోసం చేశారని ఆరోపించారు. సిగ్గులేక ఊళ్లపొంటి తిరిగి బాండు పేపర్లు రాసిచ్చిండ్లని విమర్శించారు.

డైరీలో రాసిపెట్టుకోండి.. వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే

బీఆర్‌ఎస్ సభకు పోలీసులు అడ్డంకులు సృష్టిస్తున్నారని కేసీఆర్ ఆరోపించారు. బస్సులు ఇచ్చిన ప్రైవేటు స్కూళ్లకు నోటీసులు ఇచ్చారనీ, ఆడుగడుగున ఆర్‌టీఏ అధికారులు, పోలీసులను బెట్టి బస్సులు రాకుండా ట్రాఫిక్ జామ్ చేస్తున్నారని ఆరోపించారు. దీనితో సభకు రావలసిన లక్షా 50వేల మంది అక్కడే ఆగిపోయారన్నారు. ఇంత కడుపు మంటా? బీఆర్‌ఎస్ సభలను ఆపుతరా? ఈ ప్రభంజాన్ని ఎవడు ఆపుతడు? అని ప్రశ్నించారు. ప్రజలకు అడిగే హక్కున్నది. సోషల్ మీడియాలో పని చేసే మా పార్టీ కార్యకర్తలు మీద కేసులు పెట్టడం అన్యాయం. మీ విధుల్లో మేము తలదూర్చం, కానీ, అన్యాయంగా తమ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు పెడితే చూస్తూ ఊరుకోమంటూ హెచ్చరించారు. 'పోలీసు మిత్రులారా.. మీ డైరీలో రాసుకోండి. వందకు వంద శాతం మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే.. దీనిని ఎవడు కూడా కూడా ఆపలేడు.. ఎవడి తరం కాదు. ఎవడి వశం కాదు. మీకు రాజకీయలెందుకు.. మీ డ్యూటీ మీరు చేయండి..' అంటూ పోలీసులకు సున్నితంగా వార్నింగ్ ఇచ్చారు. ఎక్కడ బీఆర్‌ఎస్ కార్యకర్తలపై అన్యాయంగా కేసులు పెట్టినా టీఆర్‌ఎస్ లీగల్ సెల్ చూసుకుంటుంది. మీరు భయపడే అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఇక నేను కూడా ఊరుకోను. నేనూ బయలు దేరుతా ఎవనెవని సంగతేమిటో, లెక్కేందో.. అన్ని తీస్తా అని కేసీఆర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్వాగత ఉపన్యాసం చేయగా, కేసీఆర్ ఒక్కరే ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూధనాచారి, ఎమ్మెల్సీలు కవిత, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నరేందర్, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీ కవిత తదితరులు పాల్గొన్నారు.

బయట ట్రాఫిక్ జామ్.. లోపల ఖాళీగా కుర్చీలు

ఎల్కతుర్తి/వరంగల్ క్రైం/ వరంగల్ కార్పొరే షన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ రజతోత్సవ సభా ప్రాంగణం దాదాపు నిండినా వెనుకభాగంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. దీన్ని ముందే గ్రహించిన మాజీ మంత్రి దయాకర్‌రావు పలు మార్లు వేదికపై నుంచి ఖాళీ కుర్చీలు కనిపించడానికి కారణం ట్రాఫిక్ జామ్ అంటూ పదే పదే చెప్పారు. వాస్తవానికి జనాలు కూడా రోడ్లపై ఇరుక్కు పోవడంతో సభ స్థలికి చేరు కోలేక పోయారు. ఇదే విషయాన్ని కేసీఆర్ కూడా హెలీక్యాప్టర్‌లో నుంచి గమనించి ఖాళీ కుర్చీలు ఉన్నాయి. సభను లేటుగా ప్రారంభిద్దా మని శ్రేణులకు చెప్పారట. కానీ కొంత మంది పార్టీ శ్రేణులు సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చారనీ వారు మళ్లీ వెళ్లడానికి ఇబ్బంది అవుతుందని తెలుపడంతో సభను ప్రారంభించారు.

రజతోత్సవం.. జనప్రవాహం

- బీఆర్‌ఎస్ సభకు భారీగా తరలొచ్చిన జనం
- సైకిళ్లు, ఎడ్లబండ్లు, పాదయాత్రగా వచ్చిన శ్రేణులు
- వచ్చి, పోయే సమయాల్లో కిలో మీటర్ల మేర ట్రాఫిక్ జామ్

ఎల్కతుర్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు జనం ప్రవాహంలా తరొచ్చారు. ఈ సభ కు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు వివిధ జిల్లాల నుంచి శ్రేణులు సైకిళ్లు, ఎడ్లబండ్లు, వాహనాల్లోనే కాకుండా పాదయాత్రగా కూడా చేరుకున్నారు. ఈ క్రమంలో ఎడ్లబండ్లకు మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ స్థానిక నాయకులతో కలిసి స్వాగతం పలికారు. వర్ధన్నపేట, సూర్యాపేట నుంచి వచ్చిన ఎడ్లబండ్లకు మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద మహిళలు మంగళ హారతులు పట్టారు. అలాగే 150 కిలోమీటర్ల దూరం సూర్యాపేట నుంచి సైకిళ్లపై యువకులు సభకు చేరుకున్నారు. అయితే సభకు తరలి వచ్చే, తిరుగు ప్రయాణ సమయంలో కిలో మీటర్ల మేర జామ్ అయింది. కరీంనగర్, వరంగల్, సిద్దిపేట నుంచి వచ్చే వాహనాలు సభాస్థలికి 4 నుంచి 5 కిలో మీటర్ల దూరంలో ఆగిపోయాయి. వరంగల్ నుంచి వచ్చే వాహనాలు ఎస్సాఆర్ వర్సిటీ నుంచి ఎల్లాపూర్ వరకు నిలిచిపోయాయి. కరీంనగర్ నుంచి వచ్చే వాహనాలు రిలయన్స్ ఇండస్ట్రీ వరకు నిలిచిపోయి దీంతో సభకు చేరుకునే సమయంలో, తిరిగి వెళ్లే క్రమంలో ఇబ్బందులు పడ్డారు. ఈ రెండు వైపులా ఎన్‌హెచ్ 563 రహదారి పనులు నడుస్తుండడంలో సింగిల్ రోడ్డులో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

పోలీసులపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపాటు

సభలో పోలీసులు కావాలనే అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. సభకు వచ్చే దారిలో పోలీసులు కావాలనే లారీలను అనుమతించారని మండిపడ్డారు. సభా స్థలానికి జనాన్ని రాకుండా అడ్డుపడుతున్నారని సభాముఖంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. సభకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బంది కల్గించ వద్దని సూచించారు. సభకు వచ్చే జనాన్ని తప్పు దారి పట్టించారని ఆరోపించారు. సభ ముందు ఉన్న జనాలు బారికేడ్లను నెట్టుకుంటూ వచ్చినందుకు కొందరు పోలీసులు లాఠీ చార్జికి యత్నించారు. గమనించిన ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పోలీసులను వారించారు.

సెల్‌ఫోన్ లైట్ వెలుగులు

కేసీఆర్ సభకు కొద్ది క్షణాల్లో చేరుకోబోతుండగా సభపై ఉన్న నాయకులతో పాటు సభ ప్రాంగణంలో ఉన్న ప్రజలు తమ సెల్‌ఫోన్ లైట్లను ఆన్ చేసి అటు ఇటు ఊపుతూ కేరింతలు కొట్టారు. వారికి మద్దతుగా సభపై ఉన్న నాయకులు సైతం ధూం.. ధాం కళాకారులు ఆలపిస్తున్న గీతాలకు అనుగుణంగా సెల్‌ఫోన్లను ఊపుతూ ఉత్సాహం నింపారు.



సూర్యాపేట నుంచి వచ్చిన ఎడ్లబండ్లకు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్



సైకిళ్లపై ఎల్కతుర్తి చేరుకున్న సూర్యాపేట యువకులు

జేబుదొంగకు దేహశుద్ది

కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో ఓ జేబు దొంగ చేతి వాటాన్ని ప్రదర్శించాడు. చోరీ చేసే సమయంలో ఓ కార్యకర్త అతడిని పట్టుకున్నాడు. అతడి వద్ద పదుల కొద్ది సెల్‌ఫోన్లు, పర్సులు, గోల్డ్ చైన్లు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. అతడిని చితకబాదారు. నిందితుడు దెబ్బలు తాళలేక స్పృహ కోల్పోయాడు. సమీపంలో ఉన్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకోకుండా చోద్యం చూస్తూ ఉండిపోయారు.

వలంటీర్లకు ఆరెస్పీ దిశానిర్దేశం

సభా ప్రాంగణంలో వలంటీర్లకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వాకీటాకీ ద్వారా దిశానిర్దేశం చేశారు. వేదికపై నిలబడి సభకు వచ్చే ప్రజలను ఎటు వైపుకు పంపించాలో వలంటీర్లకు వివరించారు.

స్టేజీ మీద మంత్రి మల్లారెడ్డి స్టెప్పులు

వేదికపైకి చేరుకున్న మాజీ మంత్రి మల్లారెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ ధూం..ధాం పాటలకు స్టేజి మీద స్టెప్పులు వేశారు. మల్లారెడ్డి స్టెప్పులకు జనాలు కేరింతలు కొట్టారు.

తేనేటీగల దాడి


రజతోత్సవ సభకు వస్తున్న ప్రజలపై మండల కేంద్రంలోని వనవిహార్ వద్ద తేనేటీగలు దాడి చేశాయి. దీంతో సభ వద్దకు నడుచుకుంటూ వెళ్తున్న పది మందిపై దాడి చేశాయి. దీంతో జనాలు పరుగులు పెట్టారు.

హెలీకాప్టర్‌లో వచ్చి.. బస్సులో తిరుగు ప్రయాణం

ఎల్కతుర్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ హైదరాబాద్ నుంచి సాయంత్రం 5:50 గంటలకు సభా ప్రాంగణం సమీపంలోని హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ పలువురు నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. సాయంత్రం 6.55 గంటలకు స్టేజీపైకి చేరుకుని ప్రజలకు అభివాదం చేశారు. 6.59 నిమిషాలకు ప్రసంగాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులపై ఆరోపణలు చేస్తు ప్రసంగాన్ని కొనసాగించారు. 7.51 గంటలకు కేసీఆర్ ప్రసంగాన్ని ముగించారు. అనంతరం కేసీఆర్ రోడ్డు మార్గంలో బస్సులో తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో ఎల్కతుర్తి మండలంలోని చింతలపల్లి, దామెర, ధర్మసాగర్, వేలేరు, మల్లికుదుర్ల, చిలుపూర్ మండలం వెంకటేశ్వరపల్లి, మల్కాపూర్, తరిగొప్పుల, చేర్యాల మండలం మీదుగా ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. మల్లికుదుర్ల గ్రామంలో కేసీఆర్ వాహనాన్ని బీఆర్‌ఎస్ నాయకులు ఆపగా.. అక్కడ కేసీఆర్ బస్సులో నుంచే అభివాదం చేయగా.. ఆయనకు కార్యకర్తలు పూలు చల్లి వీడ్కోలు పలికారు.



వేలేరు మండలం మల్లికుదుర్లలో అభివాదం చేస్తున్న కేసీఆర్



యూపీఎస్సీ ర్యాంకర్‌కు సన్మానం

వడ్డెపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : యూపీఎస్సీలో ర్యాంక్ సాధించిన పోతరాజు హరిప్రసాద్‌ను హనుమకొండలోని ప్రైవేట్ సమావేశ మందిరంలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ గ్రూప్స్, సివిల్స్ రాస్తున్న విద్యార్థులు ప్రణాళికతో చదువుకుంటే విజయం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కిట్స్ కళాశాల ప్రొఫెసర్ బి.శశికాంత్‌తో పాటు గ్రూప్ -2, 3, 4 లో విజయం సాధించిన విద్యార్థులు పాల్గొన్నారు.



యూపీఎస్సీలో ర్యాంక్ సాధించిన హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవు

వై.సుధాకర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్, కాజీపేట



ప్రశ్నోత్తరం

ఆంధ్రజ్యోతి: ఐపీఎల్ బెట్టింగ్‌కు ఎక్కువగా ఎవరు పాల్పడుతున్నారు?
ఇన్‌స్పెక్టర్: నిరుద్యోగ యువత పాల్పడుతున్నారు.
ఆంధ్రజ్యోతి: బెట్టింగ్‌కు పాల్పడినవారిని ముందుగా ఎలా గుర్తిస్తారు?
ఇన్‌స్పెక్టర్: మ్యాచ్‌లు ప్రారంభం అయినప్పుడు పిల్లల మొబైల్స్ వాడకంపై దృష్టి సారించాలి.
ఆంధ్రజ్యోతి: ఎలాంటి ప్రదేశాల్లో బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు.
ఇన్‌స్పెక్టర్: గ్రామాల్లో ఊరి చివరన, నగరంలో ప్రత్యేక గదుల్లో గ్రూపులుగా ఉంటారు.
ఆంధ్రజ్యోతి: గుర్తించిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
ఇన్‌స్పెక్టర్: చట్టరీత్యా కేసులు నమోదు చేసి రిమాండ్ చేస్తాం.
ఆంధ్రజ్యోతి: బెట్టింగ్‌కు పాల్పడితే ఎవరికి సమాచారం ఇవ్వాలి?
ఇన్‌స్పెక్టర్: 8712685008 నంబర్‌కు సమాచారమివ్వాలి.

- కాజీపేట (ఆంధ్రజ్యోతి)

హౌసింగ్‌బోర్డు కాలనీ అధ్యక్షుడిగా నాగరాజు



వడ్డెపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని హౌసింగ్‌బోర్డు కాలనీ కమిటీ ఎన్నికలు ఆదివారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించినట్లు ఎన్నికల అధికారి వైకుంఠం తెలిపారు. అధ్యక్షుడిగా కొండా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా గంగుల వినోద, కోశాధికారిగా బేతెల్లి రవిని ఎన్నుకున్నట్లు వైకుంఠం వెల్లడించారు. కాగా, కమిటీ సభ్యుల సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని కొండా నాగరాజు తెలిపారు.

కాకతీయ మున్నూరుకాపు పరపతి సంఘం నూతన కార్యవర్గం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పద్మాక్షి కాలనీలో కాకతీయ మున్నూరుకాపు పరపతి సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈసందర్భంగా సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోట కనకరాములు, ఉపాధ్యక్షుడిగా తోట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తోట ప్రకాశ్, సహాయ కార్యదర్శిగా బొల్లం అశోక్, కోశాధికారిగా బండారి మహేందర్ ఎన్నికయ్యారు. అలాగే డైరెక్టర్లుగా కొండ్ర సతీష్, సానం జగదీష్, తోట రమేశ్, మందాటి మహేందర్, ఆడిటర్‌గా వి.సారంగపాణి, అకౌంటెంట్‌గా కె.సుదర్శన్, సలహాదారులుగా మిద్దెల బాబు, తోట వెంకన్న నియమితులయ్యారు. అనంతరం సంఘ సభ్యుల సంక్షేమానికి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థినులు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని సెయింట్ జోసెఫ్ బాలికల ఉన్నత పాఠశాల (తోటబడి)లో 1998-99వ సంవత్సరంలో పదవ తరగతి పూర్తిచేసిన విద్యార్థినులు 25 సంవత్సరాల అనంతరం ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంతా హాజరై ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టి.శ్వేత, ఎం.సుజాత, ఎ.శ్రీరజ, డాక్టర్ కె.సంధ్య, బి.స్రవంతి, బి.హైమావతి పాల్గొన్నారు.

నేడు సీతంపేట జీపీలో అత్యవసర సమావేశం

ఎంపీడీవో కర్ణాకర్‌రెడ్డి

హసన్‌పర్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): 'సంతకం ఫోర్జరీపై కలెక్టర్‌కు ఫిర్యాదు' అనే కథనం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైంది. ఈ విషయంపై ఎంపీడీవో కర్ణాకర్‌రెడ్డి స్పందించారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యుడి సంతకం ఫోర్జరీ చేశారంటూ శనివారం కమిటీ సభ్యుడు గుంపుల రణదీర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై ఎంపీడీవో ఆరా తీశారు. సోమవారం జీపీలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని కార్యదర్శి హరితకు ఆదేశాలు జారీ చేశారు. రెండు జాబితాలను పరిశీలించి ప్రాధాన్యతా క్రమంలో మొదటి దఫా ఒంటరి మహిళకు, వితంతువులు, దివ్యాంగులు, కార్మికులను లబ్ధిదారులుగా గుర్తించాలని సూచించారు. పాత జాబితాను రద్దు చేసి మళ్లీ ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యుల సమక్షంలో జాబితాను రూపొందించాలని ఆదేశించారు. నిష్పక్షపాతంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు.

ఉద్యమకారులపై బీఆర్‌ఎస్ వైఖరి తెలియజేయాలి

- తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర చైర్మన్ కుమారస్వామి



హసన్‌పర్తిలో ఆందోళన చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

హసన్‌పర్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుల పట్ల బీఆర్‌ఎస్ వైఖరి తెలియజేయాలని ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర చైర్మన్ గోధుమల కుమారస్వామి డిమాండ్ చేశారు. హసన్‌పర్తిలో ఉద్యమకారుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. బీఆర్‌ఎస్ సభకు హాజరయ్యే జనాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఎంతో మంది ఉద్యమకారుల త్యాగాలు, ఆత్మ బలిదానాలతో తెలంగాణ సాధించుకున్నామన్నారు. కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో ఉద్యమకారులను విస్మరించారని మండిపడ్డారు. తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసిన వారిని అందలం ఎక్కించారని విమర్శించారు. రజతోత్సవ సభలో స్పష్టమైన వైఖరిని కేసీఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారులు నవరత్న ఆనంద్, మురళీనాయక్, అంకుషావలి, హాజీ, నవీన్, రామకృష్ణ, దార సూరి, రుద్రోజు నవీన్, గౌస్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



పక్కారోడ్లు, డ్రెయినేజీలు లేని పోలీసు కాలనీ



కాలనీలోని ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

రోడ్లు నిర్మించరూ..

- డ్రెయినేజీలు కానరావు
- ఎక్కడి చెత్త అక్కడే
- సమస్యల వలయంలో పోలీసు కాలనీ వాసులు

వడ్డెపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ పరిధిలోని పోలీసు కాలనీలోసమస్యలు ప్రజలకు సవాల్‌గా మారాయి. రోడ్లు, డ్రెయినేజీలు లేక ప్రజలు పడుతున్న బాధలు చెప్పనలవికావు. పేరుకుపోయిన చెత్తతో కాలనీవాసులు నరకయాతన అనుభవిస్తున్నారు.

రోడ్లు, డ్రెయినేజీలు మృగ్యం..

పోలీసు కాలనీ ఆవిర్భవించి రెండు దశాబ్దాలు కావస్తున్నా కాలనీలో మౌలిక వసతులు కొరవడినాయి. పక్కారోడ్లు పత్తాకైనా కానరావు. చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతాయి. డ్రెయినేజీలు మచ్చుకైనా కనిపించని దుస్థితి నెలకొంది. నివాస గృహాల నుంచి వెలువడే నీటితోపాటు వర్షపు నీరు రోడ్లపైనే పారుతోంది. మురుగునీటి గుంతల్లో దోమలు వృద్ధి చెందుతున్నాయని రాత్రి వేళల్లో నరకయాతన అనుభవించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

కాలనీలోని ఖాళీ స్థలాల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. కాలనీ వాసులు చెత్తను, వ్యర్థాలను ఖాళీ స్థలాల్లో వేస్తున్నారు. వాటిని పారిశుధ్య కార్మికులు ప్రతీ రోజు తొలగించక పోవడంతో గాలి వీచినప్పుడల్లా చెత్తతో పాటు వ్యర్థాలు దుర్వాసన వెదజల్లుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులు, పందులు నిత్యం వ్యర్థాలను కదిలించడంతో దుర్గంధ భరితమైన దుర్వాసనను భరించాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

బాదావత్ సురేష్‌నాయక్, పోలీసు కాలనీ



కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలి. రోడ్లు, డ్రెయినేజీలు వెంటనే నిర్మించాలి. దోమల నివారణ మందును వారానికో సారి పిచికారీ చేయాలి. పందులు, పశువులు కాలనీలో సంచరించకుండా అరికట్టాలి. ప్రతీ రోజు చెత్తా చెదారాన్ని తొలగించాలి.

వైద్య కేంద్రాలలో తనిఖీలు

అనుమతులు లేని వాటిపై కేసులు



నగరంలోని ఓ వైద్య కేంద్రంలో తనిఖీ నిర్వహిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లాలోని మూడు నకిలీ వైద్య కేంద్రాలలో తెలంగాణ వైద్య మండలి సభ్యులు తనిఖీలు నిర్వహించారు. మండలి సభ్యుడు డాక్టర్ వి.నరేశ్ కుమార్, వరంగల్ లీగల్ యాంటి క్వాకరీ కమిటీ చైర్మన్ డాక్టర్ అన్వర్‌మియా, సెక్రటరీ డాక్టర్ వెంకటస్వామి, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్‌మోహన్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించి వైద్యపరంగా ఎలాంటి విద్యార్హతలులేని వారిని గుర్తించారు. కేయూ ఎక్స్ రోడ్‌లోని అమైరా క్లినిక్, భీమారంలోని శ్రీనివాస క్లినిక్, ఎర్రగట్టు గుట్టలోని ఎస్‌ఆర్‌ఆర్ డయాగ్నోస్టిక్ సెంటర్లపై తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అనుమతి లేకుండా వైద్యసేవలు అందిస్తున్న నిర్వాహకులు ఫజ షేక్, ఇమ్రాన్ ఖాన్, ఇ.శ్రీనివాస్, బి.అనిల్‌పై ఎన్‌ఎంసీ సెక్షన్లు 24, 35 తెలంగాణ స్టేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 22 ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు వారు తెలిపారు.

వైభవంగా పెద్దకోవెలలో బ్రహ్మోత్సవాలు

- నేత్రపర్వంగా గోదా రంగనాయకస్వామి కల్యాణం



ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ రాగన్న దర్వాజ ప్రాంతంలోని చారిత్రక హనుమద్గిరి రంగనాయకస్వామి దేవాలయం, రామానుజుల సన్నిధి పెద్దకోవెలలో ఈనెల 25వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శనివారం రాత్రి వందలాది మంది భక్తుల సమక్షంలో శ్రీ గోదా రంగనాయకస్వామి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహింపజేశారు. మహా పూర్ణాహుతి, స్నపనం, చక్రతీర్థం లాంటి కార్యక్రమాలు నిర్వహించి ఆదివారం రాత్రి వైభవంగా మహాపుష్ప యాగం నిర్వహించారు. ఆలయ అర్చకులు కలకోట రాఘవాచార్య, నర్సింహాచార్యల ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవ మూర్తులకు వైభవంగా అభిషేకింపజేశారు. రాత్రి ద్వాదశ తిరు వారాధనలు, 12 సేవలు నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, డాక్టర్ పాంచాలయ్ రాయ్, రేబల్లి వెంకటేశ్వరస్వామి, డాక్టర్ జ్ఞానేశ్వర్ తదితర కాలనీ ప్రముఖులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం నుంచి భగవత్ రామానుజుల తిరునక్షత్ర ఉత్సవాలు కూడా ఇదే క్రమంలో కొనసాగనున్నాయి.

బీజేపీ విధానాలతో కట్టుబానిసలుగా కార్మికులు

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ రావు



రాజకీయ శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న వీఎస్ రావు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మికులు కట్టుబానిసలుగా మారుతున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం కేయూ కామర్స్ హాల్‌లో సీఐటీయూ నేత మెట్టు రవి అధ్యక్షత సీఐటీయూ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ రావు 'లేబర్ కోడ్స్ కార్మికులపై ప్రభావం' అనే అంశంపై మాట్లాడారు. మే డే అంతర్జాతీయ కార్మిక ఐక్యతకు సంకేతమన్నారు. కేంద్రం నయా ఉదారవాద విధానాలను ప్రతిఘటించాలని అన్నారు. మే డే స్ఫూర్తితో పెట్టుబడిదారులు, కార్పొరేట్, మతోన్మాద శక్తులను అడ్డుకోవాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాపాడుకోవాలని అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక ప్రతిఘటన పోరాటాలు ఉధృతం అవుతున్నాయన్నారు. కార్మికులకు వారానికి 35గంటల పనిదినాలు కావాలని అన్నారు. ఈ సమవేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు బొట్ల చక్రపాణి, సీహెచ్.రాజేశ్వరి, కె.కల్పన, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్ కాలనీలో సమస్యల మోత



ఇంటిముందు ఉన్న మురికినీటి గుంత, మట్టిరోడ్డును చూపుతున్న కాలనీవాసులు

- ఏళ్లుగా కానరాని డ్రెయినేజీ వ్యవస్థ
- మురికి గుంతల్లో పడి ప్రమాదాల బారిన పిల్లలు
- మట్టిరోడ్లే రాచబాటలు
- సౌకర్యాలు కల్పించాలంటున్న కాలనీవాసులు

మడికొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మడికొండ గ్రామం గ్రేటర్ వరంగల్‌లో విలీనమై ఏళ్లు గడుస్తున్నా 64వ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ కాలనీ సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతోంది. డ్రెయినేజీ, సీసీ రోడ్లు వంటి కనీస సౌకర్యాలకు సైతం నోచుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ ఎన్నికల సమయంలో కాలనీని అభివృద్ధి చేస్తామని ఇంటింటికీ తిరిగి ఓట్లు వేయించుకొన్న ప్రజాప్రతినిధులు ఆ తర్వాత కాలనీ వైపు కన్నెత్తి చూడటం లేదని వాపోతున్నారు. గతంలో స్వయంగా ఎమ్మెల్యేనే కాలనీలో అన్ని రోడ్లు వేయిస్తామని చెప్పి హామీ ఇచ్చి శంకుస్థాపన చేసిన చోట కూడా తట్టెడు మట్టి పోసిన వారులేరని, ఎమ్మెల్యే హామీ సైతం అమలుకు నోచుకోక పోవడంతో కాలనీ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందంటున్నారు.

కానరాని డ్రెయినేజీలు..

మెట్టుగుట్ట ద్వారం ఎదురుగా జాతీయ రహదారి నుంచి కాలనీ లోపలికి వెళ్ళే ప్రధాన దారి వెంట ఇప్పటి వరకు కూడా డ్రెయినేజీ వ్యవస్థ లేదు. ఇంట్లో మురికి నీరు బయటికి వెళ్ళే మార్గంలేక పోవడంతో ఎవరి ఇంటి ముందు వారు గుంతలు తీసుకున్నారు. దీంతో అనేక సార్లు చిన్నపిల్లలు ఆ గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాలు సైతం గుంతల్లో పడి వాహనదారులు గాయపడుతున్నారు. వర్షాకాలంలో అయితే రోడ్డుపైన మురికి నీరు వర్షం నీటితో ఇళ్లలోకి చేరుతుందంటున్నారు. అలాగే ఇళ్ల ముందు మురికి నీరు నిలువ ఉండడంతో రాత్రయిందంటే దోమలు స్వైర విహారం చేస్తుండటంతో అనారోగ్యం బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలి

భూక్య సోమరావు, కాలనీవాసి



నెహ్రూనగర్ కాలనీలో సరైన డ్రెయినేజీ, సీసీరోడ్లు లేక ఇబ్బంది పడుతున్నాం. ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ చొరవ చూపి ప్రధాన రోడ్డు వెంట డ్రెయినేజీ నిర్మించాలి. ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలి. అలాగే కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి.



అనేక ఏళ్లుగా సీసీరోడ్డుకు నోచుకోని కాలనీ

మట్టి రోడ్లే రాచబాటలు..

కాలనీలో చాలా చోట్ల మట్టి రోడ్లే రాచబాటలుగా వర్ధిల్లుతున్నాయి. కొన్ని చోట్ల ఇళ్లలోని నీరు రోడ్లపైకి చేరి గుంతలు ఏర్పడుతున్నాయని, గుంతల్లో నుంచి వెళ్తున్న వాహనాదారులు ప్రమాదాల బారిన పడుతున్నామని, అలాగే తరచూ వాహనాలు మరమ్మత్తులకు గురవుతున్నాయని కాలనీవాసులంటున్నారు. కాగా, కాలనీలో గతంలో సీసీ రోడ్లకు టెండరు వేసిన కాంట్రాక్టరు బిల్లులు రావట్లేదని పనులు చేపట్టలేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు కాలనీపై దృష్టి సారించి డ్రెయినేజీ, సీసీరోడ్లు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



దాత కుటుంబానికి సర్టిఫికెట్ అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

పుట్టెడు దుఃఖంలోనూ.. కుమారుడి నేత్రాలు దానం

హసన్‌పర్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోమటిపల్లికి చెందిన అభిషేక్(18) కారు ప్రమాదంలో ఐదు రోజుల క్రితం మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రులు అపర్ణ-జోసెఫ్ పుట్టెడు దుఃఖంలోనూ కుమారుడి నేత్రదానానికి అంగీకరించారు. దీంతో తెలంగాణ నేత్ర, అవయవ దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ సిబ్బంది నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆదివారం మృతుడి ఇంటి వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించి దంపతులకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షురా లు మునిగాల పద్మ, కామిడి సతీష్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.మల్లారెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పరికిపండ్ల వేణు, యుగేందర్, రవీందర్ గౌడ్, బంధుమిత్రులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళి



అమరవీరుల స్తూపం నుండి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కాలనీవాసులు

కాజీపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్డెపల్లి ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కశ్మీర్‌లో ఉగ్రదాడిని ఖండిస్తూ ర్యాలీ తీశారు. నల్లబ్యాడ్జీలు ధరించి వందే భారత్, అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పహల్గాంలో పర్యాటకులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వడ్డెపల్లి ట్యాంక్‌బండ్ నుంచి ఫాతిమానగర్ మదర్‌థెరిస్సా విగ్రహం వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బీ రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏ శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి పీ సంజీవరెడ్డి, కార్యవర్గ సభ్యులు తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఆడెపు రాజన్‌బాబు, వాకర్స్ పాల్గొన్నారు.

- వడ్డెపల్లి(ఆంధ్రజ్యోతి): ముష్కరుల దాడిలో అసువులు బాసిన పర్యాటకులకు వాకర్స్ ఆదివారం నివాళులర్పించారు. హనుమకొండ ఎక్సైజ్ కాలనీలో పార్క్‌లో వాకర్స్ మండల సమ్మయ్య, మనోహర్, నిరంజన్ తదితరులు కొవ్వొత్తులు వెలిగించి మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు.

- న్యూశాయంపేట(ఆంధ్రజ్యోతి): హంటర్ రోడ్‌లోని విష్ణుప్రియ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో కాలనీ వాసులు శనివారం పహల్గాం ఘటన మృతుల కోసం కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. విష్ణుప్రియ కాలనీ నుంచి అదాలత్‌లోని అమర వీరుల స్థూపం వరకు వెళ్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, బొల్లెపల్లి కోటయ్య, ఎర్రబెల్లి సుధీర్‌రావు, ఇంద్రసేనారెడ్డి, ప్రవీణ్ రావు, శ్రీనివాస్‌రావు, మధుశ్రీ, అన్నపూర్ణ, అనిత, సునీత, గీతతో పాటు 200 మంది కాలనీ వాసులు పాల్గొన్నారు.

రామకృష్ణ సేవా మందిరంలో వైద్య శిబిరం

బాలసముద్రం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని రామకృష్ణ సేవా మందిరంలో ఆదివారం ఓరుగల్లు హోమియోపతి మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 40మంది రోగులకు పరీక్షలుచేసి మందులు అందించారు. 36 మందికి కరేడా స్కానర్ జరిపి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు.డాక్టర్లు సుధాకర్‌రావు, శివకుమార్, గీతలక్ష్మి, కీర్తి, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు కె.సత్యనారాయణరెడ్డి, ప్రతినిధులు తిరుపతిరెడ్డి, సూర్య రాధిక, సరోజనమ్మ, లక్ష్మీరావు, పార్వతి, వీణ పాల్గొన్నారు.



శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

మొటిమలు ఎందుకు ఎక్కువ అవుతాయంటే..

రాత్రిపూట మనం పడుకునేటప్పుడు చేసే చిన్న పొరబాట్ల వల్ల ముఖం మీద మొటిమలు ఒక్కసారిగా పెరుగుతూ ఉంటాయి. దీనివల్ల ముఖం అందవికారంగా తయారవడమే కాదు... నొప్పి, అసౌకర్యం కూడా కలుగుతుంది. కనుక ఆ పొరపాట్లు ఏమిటో తెలుసుకొని, జాగ్రత్తలు పాటిస్తే మొటిమల బారి నుంచి తప్పించుకోవచ్చని అంటున్నారు నిపుణులు.

- రాత్రిపూట ముఖాన్ని శుభ్రం చేసుకోకుండా పడుకుంటే చర్మం మీద చేరిన దుమ్ము, చర్మం ఉత్పత్తి చేసే నూనెతో కలసి చర్మ రంధ్రాలను మూసివేస్తుంది. దీంతో ముఖం మీద మొటిమలు ఏర్పడతాయి.
- ముఖం మీద వేసుకున్న మేకప్‌ను తొలగించకుండా పడుకున్నా ఆ ఉత్పత్తుల్లోని రసాయనాల కారణంగా మొటిమలు ఎక్కువ అవుతాయి.



- దిండు గలీబులను వారాల తరబడి ఉతకకుండా వాటిపైనే నిద్రించడం వల్ల చెంపలు, ముక్కు, నుదుటి భాగాల్లో చర్మంపై హానికరమైన బ్యాక్టీరియా చేరుతుంది. దీంతో మొటిమలు ఎక్కువ అవుతాయి.
- ముఖంపై తల వెంట్రుకలు పడుతూ ఉన్నా, చేతులతో ముఖాన్ని తరచూ తాకుతూ ఉన్నా ముఖంపై మలినాలు చేరి మొటిమలు ఎక్కువగా వస్తాయి.
- చెంపలను దిండుకి అదిమిపెట్టి పడుకోవడం వల్ల ముఖం మీద చర్మం అత్యధికంగా నూనెని ఉత్పత్తి చేస్తుంది. ఇలా రాత్రి సమయంలో కొన్ని గంటలపాటు చర్మ రంధ్రాలు నూనెతో నిండి ఉండడం వల్ల మొటిమల సమస్య పెరుగుతుంది.
- రాత్రిపూట సరిగా నిద్రించకపోవడం వల్ల హార్మోన్ల సమతౌల్యం దెబ్బతింటుంది. ఫలితంగా మొటిమలు ఎక్కువ అవుతాయి.
- సాధారణంగా రాత్రిపూట ముఖానికి రాసుకునే నైట్ క్రీమ్‌లు, మాయిశ్చరైజర్లు చర్మ రంధ్రాలను పూర్తిగా మూసివేస్తాయి. దీనితో చర్మానికి ఆక్సిజన్ అందక సమస్య మరింత తీవ్రమవుతుంది.
- పడుకునే గదిలో వెంటిలేషన్ సరిగా లేకపోతే చర్మం మీద చెమట, దుమ్ము, బ్యాక్టీరియా చేరి మొటిమలు వస్తాయి.
- రాత్రి భోజనంలో నూనె పదార్థాలు, తీపి పదార్థాలు ఎక్కువగా తీసుకున్నా ముఖంపై మొటిమలు పెరుగుతాయి.

అణువణువునా నాట్యమే

బాల్యం నాట్యంతోనే మొదలైంది. ఆపై అదే జీవితం అయింది. నటరాజ పాదాల చెంత... ఆరు దశాబ్దాల అపురూప నాట్య విన్యాసం. ఏడు పదుల వయసులోనూ తరగని ఉత్సాహం... కూచిపూడి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయాలన్న సంకల్పం... 'సంగీత నాటక అకాడమీ' పురస్కార గ్రహీత... 'నృత్య కిన్నెర' అధినేత... ప్రముఖ నాట్య గురువు... డాక్టర్ మద్దాళి ఉషాగాయత్రితో 'నవ్య' మాటామంతి.



"నాకు నాలుగేళ్లప్పుడు... మా అమ్మ నన్ను తీసుకువెళ్లి నాట్యంలో చేర్పించింది. అది మొదలు నర్తన నా నరనరాల్లోనూ జీర్ణించుకుపోయింది. తొలినాళ్లలో కథక్, ఒడిస్సీ కూడా అభ్యసించాను. అనంతర కాలంలో కూచిపూడి మీదే దృష్టి పెట్టాను. హైదరాబాద్‌లో రవీంద్రభారతి వేదిక ప్రారంభించినప్పుడు ఒక బృందం నృత్య ప్రదర్శన ఇచ్చింది. ఆ బృందంలో నేను కూడా ఉన్నాను. పదేళ్లు వచ్చేసరికి వేదాంతం జగన్నాథశర్మ గారి దగ్గర కూచిపూడి నేర్చుకోవడం ప్రారంభించాను. నేను పుట్టింది కర్నూలులో. అమ్మానాన్నలది నెల్లూరు. మా నాన్న సెక్రటేరియట్‌లో పని చేసేవారు. దాంతో నా చిన్నప్పుడే మేం హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడ్డాం. 1972లో నా డిగ్రీ పూర్తయింది. తరువాత పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. అందులో పని చేస్తూనే నా కూచిపూడి ప్రదర్శనలు, శిక్షణ కొనసాగింది. బ్యాంకు తరుపున ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాను. డ్యాన్స్‌లో ఎంఎ చేయాలన్న ఉద్దేశంతో రెండేళ్లు బ్యాంకుకు సెలవు పెట్టాను. సెంట్రల్ యూనివర్సిటీలో చేరాను. కానీ, 2020లో 22 ఏళ్ల ఉద్యోగ జీవితానికి ముగింపు పలికాను. వీఆర్ఎస్ తీసుకున్నాను. ఎప్పటి నుంచో అనుకొంటున్న పీహెచ్‌డీ మొదలుపెట్టాను. పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో ప్రముఖ నర్తకి అలేఖ్య పుంజల నేతృత్వంలో పరిశోధన పూర్తయింది. ఊహ తెలిసినప్పటి నుంచీ నా జీవితం నాట్యంతో అనుబంధంగా సాగింది. నేను వేరు... నాట్యం వేరు కాదు. నా చదువూ అదే దారిలో సాగింది.

'నృత్య కిన్నెర'...

పెళ్లి తరువాత నా జీవితం సరికొత్త మలుపు తీసుకుంది. 'కిన్నెర ఆర్ట్ థియేటర్స్' కార్యదర్శి మద్దాళి రఘురామ్‌తో 1981లో నాకు వివాహం అయింది. అప్పటికే సాంస్కృతిక రంగంలో ఉన్న ఆయన... కళాకారిణినే పెళ్లి చేసుకోవాలని అనుకున్నారట. అలా బంధువుల ద్వారా సంబంధం కలిసింది. ఒక అత్తమామలను చూసుకొంటూనే, ఇంటి పనులు, ఉద్యోగం, నాట్య శిక్షణ, ప్రదర్శనలు... క్షణం తీరిక ఉండేది కాదు. అన్నిటినీ సమన్వయం చేసుకొంటూ వచ్చేదాన్ని. కానీ ఏ రోజూ బాధ్యతలను భారంగా భావించలేదు. అయితే నాట్యానికి ప్రత్యేకంగా ఒక వేదిక ఉండాలనే ఉద్దేశంతో 'కిన్నెర ఆర్ట్ థియేటర్స్'కు అనుబంధంగా 1984లో 'నృత్య కిన్నెర' నెలకొల్పాను. ఇది కేవలం కూచిపూడి నాట్యాభిలాషుల కోసమే. దీని తరుపున ఢిల్లీ, ముంబయి, విశాఖపట్టణం తదితర నగరాల్లో నాట్యోత్సవాలు ఎన్నో నిర్వహించాను. 'తానా, ఆటా' వేదికలపై కూడా నేను ప్రదర్శనలు ఇచ్చాను. 'నృత్య కిన్నెర'కు 2003 నుంచి కేంద్ర సాంస్కృతిక శాఖ శాలరీ గ్రాంట్ అందిస్తోంది.

ఆసక్తి ఉంటే చాలు...

కూచిపూడి నేర్చుకోవాలన్న ఆసక్తి, నిబద్ధత ఉంటే చాలు... శిక్షణ ఇవ్వడానికి నేను వెనకాడను. మా ఇంటి చుట్టుపక్కల పిల్లలకు, ఆర్థిక స్థోమత లేనివారికి ఉచితంగా డ్యాన్స్ నేర్పిస్తున్నాను. నా వద్దకు వచ్చేవారిని ఇంత ఇవ్వమని డిమాండ్ చేయను. ఇచ్చింది తీసుకొంటాను. ఇప్పటివరకు మూడొందల మందికి కూచిపూడిలో శిక్షణ ఇచ్చాను. దాదాపు యాభైమంది అరంగేట్రం అయింది. కొందరు శిష్యులు దేశవిదేశాల్లో నాట్యాలయాలు ఏర్పాటు చేశారు. ఒక అమ్మాయి ముంబయిలో 'నృత్య కిన్నెర' పేరుతో ఎన్నో ఏళ్లుగా ఇనిస్టిట్యూట్ నడుపుతోంది. వాళ్లందరినీ చూసినప్పుడు నా మనసు పరవశిస్తుంది. ప్రస్తుతం ముప్పైమంది నావద్ద కూచిపూడి అభ్యసిస్తున్నారు. కష్టాల్లో ఉన్నవారికి ఆర్థిక సాయం చేశాను. ఆ భగవంతుడు నాకు అన్నీ ఇచ్చాడు. ఉన్నంతలో సాయం చేయగలిగితే అదే పదివేలు.

అవే నాకు ఊపిరి...

నాట్యమే నాకు ఊపిరి. జీవించి ఉన్నంతవరకు నాట్యాభినయం కొనసాగించాలి. సాధ్యమైనంతమందిని కూచిపూడి కళాకారులుగా తీర్చిదిద్దాలి. ఇదే నా అభిలాష. ఇప్పటికి పదిహేనుకు పైగా బాలేలకు కొరియోగ్రఫీ చేశాను. రెండు వందలకు పైగా నృత్యరూపకాలకు దర్శకత్వం వహించాను. ఎస్‌వీబీసీ వారి 'నాద నీరాజనం', దూరదర్శన్‌తో పాటు, దేశంలోని వివిధ నగరాలు, ఇతర దేశాల్లో జరిగిన ఉత్సవాల్లో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాను. మొన్న ఉగాదికి ముప్పై మంది శిష్యులు కలిసి 'అలమేలుమంగ' రూపకం వేశారు. నా డెబ్బయ్యవ పుట్టినరోజు సందర్భంగా వచ్చే నెల 2న రవీంద్రభారతిలో 'మాతృదేవోభవ' కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శిస్తున్నారు.

జన్మ ధన్యమైన సందర్భం...



అరవై ఏళ్ల ఈ నాట్య ప్రయాణంలో ఎన్నో ఒడుదొడుకులు. ఎన్నో సవాళ్లు. ఒక మహిళగా, ఒక సంస్థను, అదీ కళాసంస్థను నిర్వహించడం అంటే ఈ రోజుల్లో అంత సులువు కాదు. కానీ కూచిపూడి నాట్యానికి పట్టం కట్టాలన్న ఒక మహత్ సంకల్పమే నన్ను నడిపిస్తోంది. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారాలు, హంస పురస్కారం, తెలుగు వర్సిటీ వారి ప్రతిభ పురస్కారం, 'యూరోపియన్ తెలుగు అసోసియేషన్' వారి పురస్కారం... ఇలా ఎన్నో వరించాయి. అన్నిటికీ మించి గత ఏడాది కేంద్ర ప్రభుత్వ 'సంగీత నాటక అకాడమీ' అవార్డు రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోవడం నా జీవితంలోనే మధురమైన ఘట్టం. కళారంగంలో 'పద్మ' పురస్కారాలతో సమానమైన గౌరవం ఇది. అవార్డు తీసుకున్నప్పుడు అనిపించింది... 'నా జన్మ ధన్యమైంద'ని.

> **చేయాల్సినవి ఉన్నాయి...**
>
> నేను రెండు కథల పుస్తకాలు కూడా రాశాను. ఒకటి... 'కడదాకా కదిలి', రెండోది 'బామ్మ గారి కాశీయాత్ర'. స్వాతి, నవ్య వీక్లీల్లో కూడా నా నవలలు ప్రచురితమయ్యాయి. 'నవ్య' వీక్లీలో రాసిన 'మౌనమే సాక్షిగా' నవలకు రెండో బహుమతి వచ్చింది. నా మనసులో రెండు మూడు బాలేలు ఉన్నాయి. వాటిని నా శిష్యులతో చేయించాలి. ప్రముఖ నాట్య గురువులందరితో మాట్లాడి ఒక గ్రంథం రాయాలి. త్వరగా కోలుకొని మరింతమందికి శిక్షణ ఇవ్వాలి. చక్రాల కుర్చీలో ఉన్నా నా మెదడు ఎప్పుడూ కూచిపూడి చుట్టూనే తిరుగుతోంది. చూద్దాం... దైవ సంకల్పం ఎలా ఉందో!

ఆ నమ్మకమే నడిపిస్తోంది...

రెండేళ్ల కిందట నా జీవితంలో అనూహ్య కుదుపు. 108 అన్నమాచార్య కీర్తనలను మా శిష్యులతో నృత్య రూపకంగా ప్రదర్శించాలని అనుకున్నాను. అందుకోసం రిహార్సల్స్, ఇతర పనుల్లో క్షణం తీరిక లేకుండా గడిపాను. నాకు తెలియకుండానే నేను తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లిపోయాను. దాంతో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. మెదడు భాగంలో బ్లాక్ అయిందని వైద్యులు చెప్పారు. తరువాత పెరాలసిస్ వచ్చింది. మాట్లాడగలుగుతున్నాను కానీ... పూర్తి స్థాయిలో కదల్లేకపోతున్నాను. ప్రస్తుతం ఫిజియోథెరపీ చేస్తున్నారు. చక్రాల కుర్చీలో కూర్చొనే 'సంగీత నాటక అకాడమీ' అవార్డు తీసుకున్నాను. ఎందుకంటే ఆ పురస్కారం నా కల. ఈ రెండేళ్లలో ఇలానే మా విద్యార్థులతో పది కార్యక్రమాలు నిర్వహించాను. త్వరలోనే మళ్లీ మామూలు మనిషిని అవుతాను. నా మనోబలమే నా ధైర్యం. నా శిష్య బృందం, సన్నిహితులు, స్నేహితులు... వీరందరూ నేను కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకొంటున్నారు. ముఖ్యంగా పదిమందికీ కూచిపూడిని చేరువ చేయాలన్న తపన, ఆ కళారూపాన్ని విశ్వవ్యాప్తం చేయాలన్న సంకల్పమే నాకు నిత్య ప్రేరణ.

• హనుమా

ఆ సంఘటనే బౌన్సర్‌గా మార్చింది

బౌన్సర్... దాదాపుగా పురుషులదే ఆధిపత్యమైన ఈ వృత్తిని ఎంచుకోవడమే కాదు, అందులో రాణిస్తూ ఎందరికో ప్రేరణగా నిలుస్తున్నారు అను కుంజుమన్. ఫొటోగ్రాఫర్‌గా వృత్తి జీవితం ప్రారంభించిన ఆమె కేరళలో తొలి మహిళా బౌన్సర్‌గా గుర్తింపు పొందారు. నటిగానూ అవకాశాలు అందుకుంటున్నారు. 'నటుడు మోహన్‌లాల్ పర్సనల్ బాడీగార్డ్' అంటూ తన గురించి జరిగిన ప్రచారం అవాస్తవం అంటున్న 37 ఏళ్ల అను కథ ఇది.



"కొన్నాళ్ళ క్రితం ఒక ఆంగ్ల వార్తా సంస్థ మహిళా బౌన్సర్ల గురించి కథనం రూపొందిస్తూ... నన్ను ఇంటర్వ్యూ చేసింది. వారికి నా వీడియోలు కొన్ని పంపించాను. మోహన్‌లాల్‌తో నేను కలిసి ఉన్న వీడియో ఒకటి వైరల్ అయింది. నేను ఆయనకు వ్యక్తిగత బాడీగార్డ్ అనీ, సెక్యూరిటీ హెడ్ అనీ ప్రచారం జరిగింది. అది నిజం కాదు. కొచ్చిలో ఆయన పాల్గొన్న ఒక కార్యక్రమంలో నేను బౌన్సర్‌గా పని చేశానంతే. ఏదైతేనేం... నేను ఊహించని ప్రచారం వచ్చింది. వార్తా పత్రికలు, టీవీ ఛానెల్స్ నా గురించి ఆరా తీయడం మొదలుపెట్టాయి.

అమ్మకు చేదోడుగా...

బౌన్సర్ వృత్తిలోకి నేను అనుకోకుండా వచ్చాను. నేను పుట్టి పెరిగింది కేరళలోని ఎర్నాకుళం జిల్లాలోని ఒక గ్రామంలో. నా చిన్నప్పుడే నాన్న మాకు దూరమయ్యారు. నన్ను, నా సోదరిని పెంచడానికి మా అమ్మ ఎన్నో కష్టాలు పడింది. వాటికి మేమూ అలవాటు పడ్డాం. అవే నన్ను రాటుదేల్చాయనుకుంటాను. చదువు పూర్తయ్యాక... చిన్న చిన్న పనులు చేస్తూ అమ్మకు ఆర్థికంగా చేదోడుగా ఉండేదాన్ని. అప్పుడే ఫొటోగ్రఫీ నేర్చుకున్నాను. పెళ్ళిళ్ళ లాంటి ఈవెంట్లకు పని చేసేదాన్ని. క్రమంగా పెద్ద కార్యక్రమాలకు కూడా అవకాశాలు వచ్చాయి. ఆ సమయంలో ఎదురైన ఒక సంఘటన... నా జీవితాన్ని మలుపు తిప్పింది.

కొత్త అధ్యాయం ప్రారంభించాను...

కొచ్చిలో ఒక ఉత్పత్తి ప్రచార కార్యక్రమానికి ఫొటోగ్రాఫర్‌గా వెళ్ళాను. అక్కడికి కొందరు సెలబ్రిటీలు వచ్చారు. వారిలో ఒకరి బౌన్సర్ నన్ను తోసేయడంతో... పక్కకు పడిపోయాను. అతను తన బృందంతో కలిసి వచ్చి క్షమాపణ చెప్పాడు. అలా వారితో పరిచయం ఏర్పడింది. ఆ తరువాత కొన్ని కార్యక్రమాల్లో వాళ్ళు కలుస్తూ ఉండేవారు. బౌన్సర్లుగా మహిళలు ఎందుకు ఉండరని వారిని అడిగాను. "ఫిట్‌నెస్ ఉంటే మహిళలు కూడా బౌన్సర్లు కావచ్చు. మీరు ఫిట్‌గానే ఉన్నారు కాబట్టి ప్రయత్నించండి. దేశంలో ఎక్కువమంది మహిళా బౌన్సర్లు లేరు. కానీ అవసరం చాలా ఉంది" అని చెప్పారు. లేడీ బౌన్సర్ కావాలని అప్పుడే నిశ్చయించుకున్నాను. అందుకు అవసరమైన సూచనలు, సలహాలు వారి దగ్గరే తీసుకున్నాను. ఆ నిర్ణయానికి నా కుటుంబం కూడా ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. అలా కేరళలో తొలి మహిళా బౌన్సర్‌గా కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాను. మొదట్లో చిన్న చిన్న కార్యక్రమాలకు అవకాశాలు వచ్చేవి. గత మూడేళ్ళుగా పెద్ద ఈవెంట్స్‌కు బౌన్సర్‌గా వెళ్తున్నాను. వాటిలో సెలబ్రిటీల ఫంక్షన్ల నుంచి ఆడంబరంగా ఉండే పబ్ పార్టీల వరకూ ఉంటాయి. అంతేకాదు... మహిళా సెలబ్రిటీలకు, వ్యాపార ప్రముఖులకు కూడా ఎస్కార్ట్‌గా వెళ్తూ ఉంటాను. ఇప్పుడు ఈ వృత్తిలోకి వచ్చే మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

నిజాయితీ, నిబద్ధతతో...

నా కథ విన్నాక ఎంతోమంది మహిళలు నన్ను సంప్రతిస్తున్నారు. బౌన్సర్ కావాలనుకుంటున్నామని చెబుతున్నారు. ఇది నాకు ఎంతో సంతోషం కలిగిస్తోంది. వారికి నేను చెప్పగలిగేది ఒక్కటే. బౌన్సర్ అనేది చాలా ఒత్తిడితో కూడుకున్న వృత్తి. దీనికి శరీర దారుఢ్యంతో పాటు మానసిక స్థైర్యం కూడా ఉండాలి. కొందరు దీన్ని గౌరవనీయమైన వృత్తిగా పరిగణించరు. కానీ బతకడానికి ఆదాయం ఇచ్చేదీ, చట్టవిరుద్ధం కానిదీ అయిన పనిని నిజాయితీగా, నిబద్ధతతో చేస్తే... గౌరవం దానంతట అదే వస్తుంది. నా వరకూ వ్యక్తిగతంగా ఎలాంటి చేదు అనుభవాలూ ఎదురు కాలేదు. అయితే పబ్‌లలో, పార్టీల్లో, సెలబ్రిటీ ఈవెంట్లలో తరచూ ఉద్రిక్తతలు చోటు చేసుకుంటాయి. జనం వారిపై ఎగబడడం వల్ల తొక్కిసలాటలు, ఘర్షణలు సాధారణం. అలాంటి సమయాల్లో సయమనం కోల్పోకుండా... సమయస్ఫూర్తితో వ్యవహరించాలి. ఆగ్రహావేశాలు పెరగకుండా ఆపాలి. ఎవరి సూచనల కోసమో ఎదురుచూస్తే పరిస్థితులు అదుపు తప్పుతాయి. అదృష్టవశాత్తూ... నేను స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొనేలా మా అమ్మ పెంచింది. అందుకే భిన్నమైన సందర్భాలను ధైర్యంగా ఎదుర్కొంటాను. నాకు ఇద్దరు పిల్లలు. ప్రతి విషయంలో వాళ్ళు నాకు అండగా ఉంటారు. ప్రతిరోజూ బౌన్సర్‌గా పని ఉండదు కాబట్టి... ఫొటోగ్రాఫర్‌గానూ కొనసాగుతున్నాను. అంతేకాదు... నటన అంటే నాకు ఆసక్తి. 'విశేషం', 'పూరమ్ పూరాడమ్ పూరుడతి' అనే సినిమాల్లో చిన్న పాత్రలు వేశాను. మరిన్ని అవకాశాల కోసం ఎదురు చూస్తున్నాను."

> **కొచ్చిలో ఒక కార్యక్రమానికి కొందరు సెలబ్రిటీలు వచ్చారు. ఒక బౌన్సర్ నన్ను తోసేయడంతో... పక్కకు పడిపోయాను. అతను వచ్చి క్షమాపణ చెప్పాడు. అలా వారితో పరిచయం ఏర్పడింది. బౌన్సర్లుగా మహిళలు ఎందుకు ఉండరని వారిని అడిగాను. "ఫిట్‌నెస్ ఉంటే మహిళలు కూడా బౌన్సర్లు కావచ్చు. ప్రయత్నించండి" అని చెప్పారు.**



ఏసీ చల్లదనంతో సమస్యా?

వేసవిలో మండే ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ఇళ్లలో ఎయిర్ కండిషనర్‌లను వాడతాం. కానీ కొంతమందికి ఏసీ చల్లదనం సరిపడక తలనొప్పి, చర్మం పొడిబారడం, కళ్ల దురద, జలుబు, గొంతు పట్టేయడం లాంటి సమస్యలు తలెత్తుతాయి. కనుక ఏసీని ఉపయోగించేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ సమస్యల నుంచి బయటపడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.



- ఏసీ ఫిల్టర్లలో ఎక్కువగా దుమ్ము చేరుతూ ఉంటుంది. ఏసీని ఉపయోగిస్తున్నప్పుడు ఈ దుమ్ము కణాలు వాటిలోని హానికారక బ్యాక్టీరియా గది అంతటా వ్యాపిస్తాయి. గదిలోకి రాగానే ఇవి శ్వాసకోశాల్లోకి చేరి జలుబు, తుమ్ములు, దగ్గు లాంటి సమస్యలను కలిగిస్తాయి. తరచూ ఏసీని, ఫిల్టర్లను శుభ్రం చేస్తూ ఉంటే వీటిని అధిగమించవచ్చు.
- ఏసీ వేసి ఉన్న గదిలో ఉష్ణోగ్రత చాలా తక్కువగా ఉంటుంది. ఎక్కువసేపు ఇలాంటి చల్లని వాతావరణంలో గడపడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. దీంతో రోగనిరోధక వ్యవస్థ బలహీనమవుతుంది. తలనొప్పి, ముక్కు దిబ్బడ, కళ్ల దురద వస్తుంటాయి. చర్మం పొడిబారుతుంది కూడా. గదిలో చల్లదనం మరీ ఎక్కువగా కాకుండా మధ్యమంగా ఉండేలా ఏసీ ఉష్ణోగ్రతను నియంత్రిస్తే ఈ సమస్యలు రావు.
- ఏసీ గదిలో ఉన్నప్పటికీ శరీరం తేమను కోల్పోతూ ఉంటుంది. దాహం అనిపించకపోయినా తరచూ మంచి నీళ్లు తాగుతూ ఉండాలి. రాత్రి పూట పడుకునే ముందు గదిలో హ్యూమిడిఫైయర్‌ను వాడడం మంచిది. అలాగే ఏసీ టైమర్ పెట్టుకుంటే నిర్జలీకరణ సమస్యలు రావు.
- గదిలో ఏసీ వేసినప్పుడు సాధారణంగా తలుపులు, కిటికీలు మూసి ఉంచుతాం. దీని వల్ల గదిలో ఆక్సిజన్ స్థాయి తగ్గుతుంది. ఫలితంగా శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయి. కనీసం రెండు గంటలకు ఒకసారి అయిదు నిమిషాలపాటు కిటికీలు, తలుపులు తెరచి ఉంచితే గదిలో తాజాదనం విస్తరిస్తుంది.
- ఏసీ గాలి నేరుగా శరీరాన్ని తాకితే తలనొప్పి వస్తుంది. జలుబు చేస్తుంది కూడా. ఏసీ గాలి నేరుగా కాకుండా ఓ పక్కకు ప్రసరించేలా ఏర్పాటు చేసుకుంటే గది మొత్తం మెల్లగా చల్లబడి హాయిగా అనిపిస్తుంది. ఏసీలో స్వింగ్ ఫీచర్‌ని ఉపయోగించుకోవడం మంచిది.

మజానిచ్చే మామిడి ఇడ్లీ!



చాలా మంది ఏడాదంతా ఎదురుచూసే మామిడి పళ్ల కాలం వచ్చేసింది. ఈ పళ్లతో రకరకాల వంటలు చేస్తారు. అలాంటి రుచికరమైన ఒక వంట- మామిడి ఇడ్లీ. దీని తయారీ విధానం తెలుసుకుందాం.

కావాల్సిన పదార్థాలు:

ఇడ్లీ రవ్వ-2 కప్పులు, మామిడి పండ్ల గుజ్జు-2 కప్పులు, పంచదార పొడి-1/4 కప్పు, పెరుగు-1/2 కప్పు, పాలు-1/2 కప్పు, యాలకుల పొడి-1/2 టీస్పూన్, జీడిపప్పు-తగినంత

తయారీ:

- ఒక గిన్నెలో ఇడ్లీ రవ్వను బాగా కడగాలి. దానిలో మామిడి గుజ్జు, చక్కెర పొడి, పెరుగు, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. దీనిని ఒక అరగంట నానబెట్టాలి. ఆ తర్వాత పాలు కొంచెం కొంచెంగా పోస్తూ కలుపుకోవాలి.
- ఈ మిశ్రమంలో ఒక ఈనో ప్యాకెట్ లేదా వంట సోడాను వేసి ఇడ్లీ పిండిలా కలపాలి.
- ఇడ్లీ ప్లేట్లకు నెయ్యి రాసుకొని వాటిలో పిండి వేయాలి. వాటిపై జీడిపప్పు పెట్టాలి. వీటిని ఇడ్లీ పాత్రలో 15 నిమిషాలు ఉడికించాలి.

దిక్సూచి
DIKSUCHI

సివిల్స్ ర్యాంకర్స్ వాయిస్

r మీ కుటుంబ నేపథ్యం ఏమిటి? ఎంత వరకు చదువుకున్నారు?
జ: మాది ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం. ఒకటి నుంచి ఐదు వరకు ఉట్నూరులో, ఆరు నుంచి పది వరకు కాగజ్‌నగర్ నవోదయ, తరవాత త్రిచిలోని త్రిబుల్ ఐటీలో బీటెక్ మెకానికల్ పూర్తి చేశాను. నాన్నపేరు గోవింద్‌జాదవ్, హెడ్ కానిస్టేబుల్. అమ్మ కవిత, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. అక్క శృతి, వైద్యురాలు.
r సివిల్స్‌లో మీ ప్రిపరేషన్ ఎలా సాగింది? ఈ ప్రయాణాన్ని ఎప్పుడు మొదలు పెట్టారు?
జ: 2019లో గ్రాడ్యుయేషన్ పూర్తయింది. ఆ తరవాత ఢిల్లీకి వెళ్లి ఒక సంవత్సరం కోచింగ్ తీసుకుందాం అనుకున్నాను. అయితే కొవిడ్ ఎఫెక్ట్‌తో మధ్యలోనే వదిలేసి వచ్చేశాను. తొలి ప్రయత్నంలో ప్రిలిమ్స్ కూడా క్వాలిఫై కాలేదు. 2020, 2021లో మళ్లీ రాశాను. అయితే ప్రిలిమ్స్‌లో అర్హత సాధించా, కాని మెయిన్స్ దాటలేదు. 2022లో ఇంటర్వ్యూకు వెళ్లాను. కానీ ర్యాంకు రాలేదు. మళ్లీ 2023లో మెయిన్స్ దశ దాటలేక పోయాను. అయితే అదే సంవత్సరం 'ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్' వచ్చింది. ఆరో ప్రయత్నంలో 2024లో విజయం సాధించాను. నా ర్యాంకుకు ఐఏఎస్ రావచ్చు.
r మొదటి సారి విఫలమైనప్పుడు మిమ్మల్ని మీరు ఎలా మోటివేట్ చేసుకున్నారు...?
జ: సివిల్స్ పరీక్షలు రాసిన ప్రతీసారి నాలో కొంత ఇంప్రూవ్‌మెంట్ కనిపించింది. అదే ప్రధాన కారణం. మూడో ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. దీంతో ఏదో వస్తుందన్న ఆశ పెరిగింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు స్నేహితులు మంచి సలహాలు, సూచనలు ఇచ్చారు.

ప్రతి అటెంప్ట్‌లో ఇంప్రూవ్‌మెంట్


సాయి చైతన్య జాదవ్
68వ ర్యాంకు

r రోజుకు ఇన్ని గంటలు చదవాలన్న నియమం ఏమైనా పెట్టుకున్నారా?
జ: ఎన్ని గంటలు ప్రిపేర్ అనేది కాదు కాని ఎంత చదివితే అర్థమవుతుందో అంత వరకే చదివే వాడిని. పరీక్షలు దగ్గర పడినప్పుడు మాత్రం రోజుకు 10 నుంచి 13 గంటలు చదివే వాడిని. ఎన్ని గంటలు చదివాము అన్నది కాకుండా, ఎంత అర్థం చేసుకో గలిగాం అన్నది ముఖ్యం.
r సివిల్స్ రాయాలంటే కోచింగ్ తప్పనిసరా?
జ: నా ఉద్దేశ్యంలో కోచింగ్ అవసరం లేదు. ఒకరిని చూసి మరొకరు కోచింగ్‌కు వెళుతున్నారు. ఏదో కొంత తప్ప, గత కోచింగ్ ప్రస్తుతం ఉపయోగపడతుందన్న గ్యారెంటి లేదు. స్నేహితులను చూసి నేను కూడా కోచింగ్‌కి వెళ్లాను. కాని మధ్యలోనే వచ్చేశాను. ఐదేళ్లుగా సొంతంగానే సిద్ధం అయ్యాను. కాకపోతే స్నేహితులతో కలిసి మాక్ ఇంటర్వ్యూలు చేయడం జరిగింది.
r జనరల్ స్టడీస్‌కు, అలాగే ఆప్షనల్‌కు ఏ మెటీరియల్ చదివారు...?
జ: రోజు న్యూస్ పేపర్ చదవడంతో మన చుట్టు పక్కల ఏం జరుగుతుందనే విషయంపై అవగాహన వస్తుంది. ఇది ప్రిలిమ్స్, మెయిన్స్ ఇంటర్వ్యూ ఇలా అన్ని స్థాయిల్లో ఉపయోగపడుతుంది. ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో రకమైన ప్రామాణిక బుక్స్ అవసరం. ఉదాహరణకు నా ఆప్షన్ ఆంత్రోపాలజీ. మొదటి నుంచి దీనితోనే సివిల్స్ రాస్తున్నాను. మొదట్లో ఒక నెల రోజులు కోచింగ్ వెళ్లినా అంతగా అర్థం కాలేదు. మొదటి సారి మెయిన్స్ రాక పోవడంతో ఎక్కువ సమయం దొరికింది. దాంతో సొంతగా నోట్స్ ప్రిపేర్ చేసుకున్నాను.
r సివిల్స్‌లో మిమ్మల్ని ఏ బోర్డు ఇంటర్వ్యూ చేసింది..? ఎంత సేపు జరిగింది. ఎలాంటి ప్రశ్నలు అడిగారు?
జ: నన్ను రాజ్‌శుక్లా సర్ బోర్డు 30 నిమిషాల పాటు ఇంటర్వ్యూ చేసింది. ఆరోజు నాలుగో వ్యక్తిని. ఇంటర్వ్యూ అప్లికేషన్ ఫాంలో మొత్తం 22 సర్వీస్‌లను పేర్కొనాల్సి ఉండగా నేను ఐఏఎస్, ఐపీఎస్ రెండు సర్వీస్‌లను మాత్రమే పెట్టాను. ఇంటర్వ్యూలో దీనిపై అడిగారు. నాకు ఆల్ రెడీ ఆంధ్రప్రదేశ్ క్యాడర్ సంబంధించిన 'ఐఎఫ్ఎస్' సర్వీస్ ఉందని చెప్పాను. ఏపీ నుంచి విడిపోయిన తరవాత తెలంగాణలో అభివృద్ధి ఎలా ఉంది. అలాగే కేవలం హైదరాబాద్ మాత్రమే అభివృద్ధి చెందిందా? అని అడిగారు. నా సొంత జిల్లా ఆదిలాబాద్ కాబట్టి అడవుల గురించి అడిగారు. తెలంగాణ ఉద్యమం గురించి, ఆదిలాబాద్ గిరిజన తెగల గురించి ప్రశ్నించారు. మా నాన్న పోలీసు కాబట్టి ఆ డిపార్ట్‌మెంట్ గురించి కూడా అడిగారు.

ఎం. రాజేశ్వర్, ఆదిలాబాద్

విష్ణుమూర్తి అవతారాలేమిటి?


బాన్న వెంకటేష్
15వ ర్యాంకు

సివిల్స్ ప్రిపరేషన్ అంటేనే సుదీర్ఘ ప్రయాణం. ఇందులో ఎన్ని ఆటుపోటులు వచ్చినా చివరి వరకు పట్టు విడవకూడదు. అలా విజేతగా నిలిచిన వ్యక్తి శ్రీకాకుళానికి చెందిన బాన్న వెంకటేష్. ప్రిలిమ్స్, మెయిన్స్‌లో తన ప్రిపరేషన్ ఎలా సాగింది, ఇంటర్వ్యూలో ఎలాంటి ప్రశ్నలు అడిగారో 'దిక్సూచి' పాఠకులతో ఆయన పంచుకున్నారు.

r సివిల్స్‌లో 15వ ర్యాంకు సాధించినందుకు అభినందనలు.. మీ కుటుంబ నేపథ్యం చెప్పండి.. ఏమి చదువుకున్నారు..?
జ: థాంక్యూ. మాది శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అల్లాడపేట గ్రామం. తొమ్మిదో తరగతి వరకు శ్రీకాకుళంలో, ఇంటర్‌మీడియట్ విశాఖపట్టణంలో.. బీటెక్ తమిళనాడు రాష్ట్రం తిరుచరాపల్లిలో పూర్తిచేశాను. నాన్న చంద్రరావు వ్యవసాయం చేస్తారు. అమ్మ రోహిణి గృహిణి. మా తమ్ముడు వంశీ 'ఇస్రో'లో సైంటిస్ట్.
r మీ ప్రిపరేషన్ ఎలా సాగింది? సివిల్స్ ప్రయాణాన్ని ఎప్పుడు మొదలుపెట్టారు?
జ: బీటెక్ తర్వాత నెలకు రూ. 1.5 లక్షలతో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేశాను. కానీ సంతృప్తి లేదు. ఏదైనా చేయాలన్న లక్ష్యంతో పాజిటివ్‌గా ఆలోచించాను. జాబ్‌కు రిజైన్ చేసి 2021 అక్టోబరు నుంచి సివిల్స్ ప్రిపరేషన్ మొదలుపెట్టాను.
r ఈ ప్రయాణంలో తొలుత విఫలం అయినప్పుడు ఎలా మోటివేట్ చేసుకున్నారు?
జ: 2022లో తొలి ప్రయత్నంలో ప్రిలిమ్స్ కూడా దాటలేదు. కానీ డీమోటివేట్ కాకుండా సిలబస్ కంప్లీట్ చేసుకుంటూ రెండో దఫా పరీక్షకు బాగా సిద్ధం అయ్యాను. 2023లో 467 ర్యాంకు వచ్చింది. ఆంధ్ర కేడర్ ఐపీఎస్ వచ్చింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నేషనల్ పోలీస్ అకడామీలో ఉన్నా. 2024లో ఐఏఎస్ లక్ష్యంగా ప్రిపేర్ అయ్యాను.
r ఇంత మంచి ర్యాంకు వస్తుందని ఊహించారా?
జ: నేను వంద నుంచి 150లోపు ర్యాంకు వస్తుందని ఊహించాను. 15వ ర్యాంకు వచ్చింది. ఐఏఎస్ కావాలనుకున్నాను. అదే వచ్చింది.
r రోజుకి ఇన్ని గంటలు తప్పనిసరిగా చదవాలనే నియమం ఏమైనా పెట్టుకున్నారా?
జ: సివిల్స్ అంటే చదువు విషయంలో ప్లానింగ్ ఉండాలి. రోజుకి ఎనిమిది గంటలు కచ్చితంగా చదివా. ఒక్కోసారి అంతకంటే ఎక్కువే అయ్యేది.
r సివిల్స్ లాంటి అత్యున్నత లక్ష్యం పెట్టుకున్నవారు కోచింగ్ తప్పనిసరిగా తీసుకోవాలా? ఒకవేళ మీరు కోచింగ్ తీసుకుంటే అది ఎలా ఉపయోగపడింది?
జ: ఆన్‌లైన్ క్లాసులకు హాజరయ్యాను. మాక్ టెస్టులు రాశాను. బాగా ప్రిపేర్ అయ్యాను. రెండో అటెంప్ట్‌కు ఐపీఎస్ వచ్చింది. మూడో ప్రయత్నంలో ఐఏఎస్.
r జనరల్ స్టడీస్‌కు మెటీరియల్ ఏమి చదివారు? అలాగే ఆప్షనల్‌కు ఏమి మెటీరియల్ చదివారు?
జ: అందరి ప్రిపరేషన్‌లాగానే నాదీ జరిగింది. ఆప్షనల్‌గా 'జాగ్రఫీ' ఎంచుకున్నాను.
r మిమ్మల్ని ఏ బోర్డు ఇంటర్వ్యూ చేసింది? మొత్తం ఎంత సేపు జరిగింది? ఇంటర్వ్యూలో మిమ్మల్ని ఎలాంటి ప్రశ్నలు అడిగారు? ఏమైనా గుర్తున్నాయా?
జ: లెఫ్టినెంట్ జనరల్ రాజ్ శుక్లా సర్ బోర్డు అరగంటకు పైగా నన్ను ఇంటర్వ్యూ చేసింది. ప్రస్తుతం ఐపీఎస్‌లో ఉన్నావుగా.. మరెందుకు ఐఏఎస్‌కు రావాలనుకుంటున్నావు..? అనే ప్రశ్న వేశారు. అలాగే ఇంజినీరింగ్ అంశాలకు సంబంధించి కొన్ని అంశాలపై ప్రశ్నలు వేశారు. మీ జిల్లాకు మీరు కలెక్టర్ అయితే అక్కడ ఉన్న సమస్యలను ఏవిధంగా పరిష్కరించగలరు అని కూడా అడిగారు.
r మీకు అత్యంత కఠినం ఈ ప్రశ్నకు జవాబు చెప్పడం అని భావించిన ప్రశ్న ఏమైనా ఉందా?
జ: ఎలక్ట్రానిక్స్‌లో కొన్ని అంశాలపైనా, టెక్నాలజీ గురించి కొన్ని డీటెయిల్డ్‌గా చెప్పమన్నారు. నాకు ఎంతవరకు తెలుసో అంతవరకే చెప్పాను. తెలియని అంశంపై సైలెంట్‌గానే ఉన్నా.
r అతి సులువు ప్రశ్నగా దేనిని భావించారు?
జ: మీ పేరు 'వెంకటేష్' కదా.. ఆ పేరుకున్న అర్థం ఏమిటి అని అడిగారు. పాపాలను హరించేవాడని.. విష్ణు అవతారంలో ఒకరైన శ్రీ వెంకటేశ్వరుని పేరు అది అని చెప్పాను. అయితే విష్ణు అవతారాలలో నాలుగు చెప్పండి అని అడిగితే నాలుగు అవతారాలను చెప్పేశాను.
r తెలుగు రాష్ట్రాలకు సంబంధించి మిమ్మల్ని అడిగిన ప్రశ్నలు ఏవి?
జ: తెలంగాణ గురించి అడగలేదుకానీ.. ఆంధ్రప్రదేశ్ గురించి ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో సువిశాలమైన తీరప్రాంతముంది కదా.. ఏవిధంగా అభివృద్ధి చేయవచ్చు... అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సమస్యలు.. ఆంధ్రప్రదేశ్, బీహార్‌లో ఉన్న సమస్యలు గురించి అడిగారు. క్షుణ్ణంగా వివరించాను.

తాతపూడి సురేష్‌బాబు, శ్రీకాకుళం

రాజంపేటపై అడిగారు?


చెన్నంరెడ్డి శివ గణేష్ రెడ్డి
119వ ర్యాంకు

కలలు కనడం కాదు.. వాటిని సాకారం చేసుకోవాలనే అబ్దుల్ కలామ్ మాటలు అతనిలో స్ఫూర్తి నింపాయి. బీటెక్‌లో సీనియర్స్ ఎక్కువ మంది సివిల్స్‌వైపు వెళ్లడంతో తాను ఎందుకు ప్రయత్నించకూడదు అనుకున్నారు కడపకు చెందిన శివ గణేష్ రెడ్డి. అందుకు అనుగుణంగా ప్రయత్నించి విజయం సాధించారు. తొలి రెండు ప్రయత్నాల్లో విఫలమైనా మూడో ప్రయత్నంలో ఎలా విజయం సాధించారో వివరించారు.

r కుటుంబ నేపథ్యం ఏమిటి. ఎంత వరకు చదువుకున్నారు?
జ: మధ్యతరగతి కుటుంబం మాది. సొంత ఊరు కడప పట్టణం అలంకానపల్లె. పదో తరగతి వరకు కడప, ఇంటర్మీడియట్ నెల్లూరులో, తరవాత హైదరాబాద్ ఐఐటిలో బీటెక్ పూర్తి చేశాను. ఐఐటిలో చదివే సమయంలో ఎక్కువ మంది సీనియర్లు సివిల్స్‌కు ఎంపిక అయ్యారు. దీంతో నేను ఎందుకు పరీక్ష రాయకూడదూ అనే ఆలోచన వచ్చింది. దానికి అనుగుణంగా ముందుకు సాగాను. నాన్న మల్లికార్జునరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ ఫ్యాకల్టీగా చేశారు. ప్రస్తుతం వ్యవసాయం చూసుకుంటున్నారు. అమ్మ ఇందిరా ప్రియదర్శిని గృహిణి. చెల్లెలు శివ జ్యోతిక ప్రస్తుతం మాస్టర్స్‌కు ప్రిపేర్ అవుతోంది.
r ప్రస్తుతం ఏ సర్వీసు వస్తుందని అంచనా వేస్తున్నారు...?
జ: సివిల్స్‌లో నా ర్యాంకు 119. ఐఏఎస్ వస్తుందని అనుకుంటున్నాను. ఏ సర్వీసు వచ్చినా పర్వాలేదు.
r మీ ప్రిపరేషన్ ఎలా సాగింది. రోజుకు ఇన్ని గంటలు చదవాలన్న నియమం ఏమైనా పెట్టుకున్నారా....?
జ: సివిల్స్‌లో విజయం సాధించాలంటే ముఖ్యంగా సామాజిక, వర్తమాన అంశాలపై దృష్టి సారించాలి. క్రమం తప్పకుండా దిన పత్రికలు చదవాలి. ప్రిలిమినరీ పరీక్షలకు సిద్ధమవుతున్న సమయంలోనే మెయిన్స్ అంశాలపై నిశిత దృష్టి సారించాలి. నా విషయానికి వస్తే రోజుకు 6 నుంచి 7 గంటల సేపు చదివాను. ఇంజినీరింగ్ పూర్తి కాగానే 2020లో కోచింగ్‌లో చేరాను. సివిల్స్‌కు సన్నద్ధమయ్యే వారికి కొన్ని పోర్టల్స్ అందుబాటులో ఉన్నాయి. మెయిన్స్‌కు ఎలా సిద్ధమవ్వాలి. అక్కడ ఏయే అంశాలపై ప్రశ్నలు వస్తాయో తెలుపుతూ ఆర్టికల్స్ ఇస్తారు. రోజుకు ఎన్ని గంటలు చదువుతున్నామన్నది కాదు ఆయా అంశాలను ఎలా ఆకళింపు చేసుకున్నామన్నదే కీలకం. క్రమశిక్షణగా ముందుకు సాగితే ఎంపికవడం సులభం.
r సివిల్స్‌కు కోచింగ్ తప్పనిసరిగా తీసుకోవాలా?
జ: నా దృష్టిలో కోచింగ్ ఉంటే మంచిది. ప్రిపరేషన్ త్వరలో గాడిలో పడుతుంది. నేను 2020 లో బీటెక్ పూర్తయిన వెంటనే ఢిల్లీలో కోచింగ్‌కు వెళ్లాను. కరోనా నేపథ్యంలో రెండేళ్లు గ్యాప్ వచ్చింది. తర్వాత రెండుసార్లు సివిల్స్ రాసినప్పటికీ ఫలితం రాలేదు. మూడో అటెంప్ట్‌లో జాతీయస్థాయిలో 119వ ర్యాంక్ వచ్చింది.
r మిమ్మల్ని ఏ బోర్డు ఇంటర్వ్యూ చేసింది?
జ: ఛైర్మన్ ప్రీతి సుగం మేడమ్ నేతృత్వంలో ఇంటర్వ్యూ అర్థగంట సేపు సాగింది. మనం ఇచ్చే డిటెయిల్డ్ అప్లికేషన్ ఫామ్‌లో ఉన్న అంశాలపై ఇంటర్వ్యూ నిర్వహించారు.
r ఇంటర్వ్యూలో కఠినమైన ప్రశ్నలు లేదా ఆశ్చర్యానికి గురిచేసిన ప్రశ్నలు ఏమైనా ఉన్నాయా?
జ: కడప జిల్లాలో రాజంపేట సంబంధించి చెప్పమని ప్రశ్నించగా ఒక్కసారి ఆశ్చర్యపోయా. ఊహించని ప్రశ్న. అయినా సమాధానం చెప్పడంతో సంతృప్తి చెందారు. అలాగే కడప జిల్లాలో మహిళల సమస్యలు, వ్యవసాయ సమస్యలపై ప్రశ్నించారు వాటికి కూడా సమాధానం చెప్పడం జరిగింది.

విలియం జాన్ కళ్యాణ, ఎడ్యుకేషన్ రిపోర్టర్, కడప

చిత్రజ్యోతి
SINCE 1965

పది కాలాల పాటు గుర్తుండే సినిమా

ప్రియదర్శి కథానాయకుడిగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో రూపొందిన 'సారంగపాణి జాతకం' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ఆదివారం సక్సెస్ మీట్ నిర్వహించింది. మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ 'సారంగపాణి జాతకం' పది కాలాల పాటు గుర్తు పెట్టుకునే సినిమా. మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. కుటుంబ ప్రేక్షకులు ఇప్పుడిప్పుడే థియేటర్లకు వస్తున్నారు. మా సినిమాను సూపర్ హిట్ చేయండి' అని ప్రేక్షకులను కోరారు. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని ఎంతో కష్టపడి, ఇష్టపడి తీశాం. ప్రతి ఒక్కరు ఈ వేసవిలో మా సినిమాను చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'కోర్ట్' తర్వాత 'సారంగపాణి జాతకం' ఓ వరంలా దొరికింది' అనిప్రియదర్శి అన్నారు.





అంచనాలను మించి అలరిస్తుంది

ఎస్ఎస్ రాజమౌళి

"నేను తీసే మహాభారతంలో నాని పోషించేది ఏ పాత్ర అనేది చెప్పను గానీ.. అందులో ఆయన కచ్చితంగా ఉంటాడు. నిర్మాత ప్రశాంతిని హిట్ మెషీన్ అని పిలుస్తుంటాం. 'హిట్ 3' కూడా ఆమెకు ఘనవిజయాన్ని అందిస్తుంది. ఈ 'హిట్' ఫ్రాంచైజీకి అంతం లేదు. నాని తీసే ప్రతి సినిమాపై అంచనాలు ఎక్కువ ఉంటాయి. ఈ సినిమా అంచనాలను మించి అలరిస్తుంది. ఆయన ఇప్పటికే అందనంత ఎత్తుకు ఎదిగారు. మరింత గొప్ప స్థాయికి ఎదగాలి. ఈ సినిమాకు సూపర్‌హిట్ పక్కా అనే వైబ్ కనిపిస్తోంది" అని దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి అన్నారు. నాని, శ్రీనిధి శెట్టి జంటగా శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. మే 1న విడుదలవుతున్న సందర్భంగా ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఇందులో హింస మీరు భయపడేలా కాదు, ఎంజాయ్ చేసేలా ఉంటుంది. ఒక మంచి థ్రిల్లర్‌కు పక్కా కమర్షియల్ సినిమా జతకలిస్తే ఎలా ఉంటుందో అదే ఈ సినిమా. ఒకప్పుడు రాజమౌళిగారు నా సినిమాలు చూసి ఎలా ఉందో చెప్పేవారు. కానీ ఆ సంప్రదాయం ఈ మధ్య మిస్సయ్యింది. ఈ సినిమాను మాత్రం ఆయన మొదటి రోజు చూస్తారని ఆశిస్తున్నాను. లేదంటే ఆయన పాస్‌పోర్ట్ లాగేసుకుంటా. ఆయన పేరు ఇప్పటికే సినిమా డిక్షనరీలోకి వెళ్లిపోయింది. రోమాలు నిక్కబొడుచుకునే ఏ సన్నివేశానికైనా రిఫరెన్స్ కావాలంటే.. 'రాజమౌళి ఎపిసోడ్' అని అనడం అలవాటు అయిపోయింది. ఈ సినిమాలోనూ ఒక అద్భుత సన్నివేశం ఉంటుంది. దాన్ని నేను, శైలేష్ 'రాజమౌళి మూమెంట్' అని పిలుస్తుంటాం. విష్వక్ సేన్, అడివి శేష్ ఈ 'హిట్ యూనివర్స్'కు మూలస్తంభాలు. శైలేష్ కొలను ఎంతటి ప్రతిభావంతుడో సినిమా విడుదల రోజున మీకందరికీ తెలుస్తుంది. సినిమా బాగుండాలి. సినిమాను కాపాడుకుందాం. ఈ గురువారం మనకు సినిమా అంటే ఎంత ప్రేమ ఉందో దేశానికి చూపిద్దాం. 'హిట్ 3' మీ అంచనాలను అందుకోకుంటే 'ఎస్ఎస్ఎంబీ29'ని చూడొద్దండి. ఈ సినిమాతో పాటు విడుదలవుతున్న 'రెట్రో', 'రైడ్ 2' చిత్రాలూ బ్లాక్‌బస్టర్ అవ్వాలి" అని ఆకాంక్షించారు. "హిట్ ఫ్రాంచైజీకి నా మనసులో ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇదో న్యూ ఏజ్ సినిమా" అని హీరో విష్వక్ సేన్ అన్నారు. "ఈ సినిమా చివరి 30 నిమిషాలు చూశాను. చాలా బాగుంది. ఆరంభ వసూళ్లు అదిరిపోతాయి" అని అడివి శేష్ తెలిపారు. "సినిమా అంటే నానిగారికి అపారమైన ప్రేమ. నన్ను ఇంతగా నమ్మిన ఆయనకు కృతజ్ఞుడ్ని" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు. "నానిగారితో నటించడం ఒక మరిచిపోలేని అనుభూతి" అని హీరోయిన్ శ్రీనిధి శెట్టి తెలిపారు.

త్రీడీ వెర్షన్‌లో



చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన 'జగదేక వీరుడు అతిలోక సుందరి' చిత్రం ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. కే రాఘవేంద్రరావు దర్శకత్వంలో అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం 1990 మే 9న విడుదలైంది. ఈ బ్లాక్‌బస్టర్ విడుదలై 35 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా మే 9న ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. త్రీడీ వెర్షన్‌లోనూ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

క్రిమినల్ కథేంటి?



క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన తమిళ చిత్రం 'రాకాదస్'. వంశీకృష్ణ, రియాజ్‌ఖాన్, దినేశ్ ప్రధాన తారాగణం. దినేశ్ కలై దర్శకుడు. కే హైమావతి నిర్మించారు. ఇప్పుడు ఈ చిత్రం 'క్రిమినల్ 123' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కేజేఆర్ పిక్చర్స్ పతాకంపై రామకృష్ణ, కిశోర్, జయబాబు ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. మే తొలివారంలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ఆదివారం తెలిపారు. వాణిజ్య అంశాలకి, సామాజిక అంశాలను కలిపి తెరకెక్కించిన చిత్రమిదని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి ఏ ప్రవీణ్ కుమార్ సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: మానస్‌బాబు.

ప్రత్యేక పాత్రలో సమంత



నటి సమంత తన సొంత బ్యానర్ ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై నిర్మించిన తొలి చిత్రం 'శుభం'. ప్రవీణ్ కండ్రేగుల దర్శకుడు. మే 9న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఆదివారం ఈ చిత్రం నుంచి మేకర్స్ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. గ్రామంలోని మహిళలంతా టీవీలో సీరియల్ చూస్తూ దెయ్యం పట్టినట్లుగా ప్రవర్తిస్తుంటారు. వారి నుంచి తప్పించుకునేందుకు పురుషులంతా అష్టకష్టాలు పడుతుంటారు. అలాంటి తరుణంలో మాతాజీగా ప్రత్యేక పాత్రలో సమంత ప్రత్యక్షమవుతారు. హాస్యం, హారర్, ఉత్కంఠ, ఎమోషన్స్ ఇలా అన్ని అంశాలను జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ట్రైలర్‌ని చూస్తే తెలుస్తోంది.


డ్రగ్స్ కేసులో మలయాళ దర్శకుల అరెస్టు





ఇటీవలె మలయాళ నటుడు షైన్ టామ్‌చాకోను డ్రగ్స్ తీసుకుంటున్నాడన్న ఆరోపణలపై పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో.. 'నేనొక్కడినే కాదు, మలయాళ పరిశ్రమలో చాలా మంది మాదక ద్రవ్యాలు తీసుకుంటున్నారు' అని ఆయన చేసిన వాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. తాజాగా, మలయాళ పరిశ్రమకు చెందిన ఇద్దరు దర్శకులను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. 'జింఖానా' ఫేమ్ ఖలీద్ రెహ్మాన్, 'తమాషా' ఫేమ్ అష్రఫ్ హంజాలతో పాటు వారి స్నేహితుడు షలీఫ్ మహ్మద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఉదయం కొచ్చిలోని ఓ అపార్టుమెంటులో సోదాలు నిర్వహించిన పోలీసులు వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత నిందితులు బెయిల్‌పై విడుదలయ్యారు. వారు ముగ్గురూ కొంతకాలంగా డ్రగ్స్ తీసుకుంటున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

గ్రామీణ ప్రేమకథ



హరికృష్ణ, భవ్యశ్రీ జంటగా గ్రామీణ ప్రేమకథ నేపథ్యంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఆదివారం షూటింగ్ మొదలైంది. ఆదినారాయణ పినిశెట్టి దర్శకత్వంలో టీఎస్సార్ మూవీ మేకర్స్ పతాకంపై తిరుపతి శ్రీనివాసరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గతంలో ఎన్నడూ చూడని ఒక వైవిధ్యమైన ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని మేకర్స్ తెలిపారు. ప్రేమ, త్యాగం, కుటుంబ విలువల చుట్టూ తిరిగే కథతో తెరకెక్కుతోన్న చిత్రమిదని దర్శకుడు చెప్పారు. గౌతమ్ రవిరావు సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: విపిన్ వి రావు.

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
వరంగల్ ● సోమవారం 28 ఏప్రిల్ 2025

భారత్ ఆల్‌రౌండ్ షో

ముక్కోణపు వన్డే సిరీస్‌లో బోణీ • 9 వికెట్లతో శ్రీలంక చిత్తు


ప్రతిక (50 నాటౌట్)


శ్రీచరణి (2/26)

కొలంబో: ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన భారత మహిళలు ముక్కోణపు వన్డే టోర్నీలో ఘనమైన బోణీ కొట్టారు. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తొమ్మిది వికెట్లతో శ్రీలంకను చిత్తు చేశారు. అంతర్జాతీయ అరంగేట్రం చేసిన తెలుగు స్పిన్నర్ శ్రీచరణి (2/26) రెండు వికెట్లతో సత్తా చాటింది. వర్షం వల్ల ఈ మ్యాచ్‌ను 39 ఓవర్లకు కుదించారు. టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 38.1 ఓవర్లలో 147 పరుగులకు కుప్పకూలింది. హాసినీ పెరీరా (30), కవిషా దిల్హరి (25), అనుష్క సంజీవని (22) పర్వాలేదనిపించారు. స్నేహ్ రాణా మూడు, దీప్తీ శర్మ రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో టాపార్డర్ విజృంభించడంతో భారత్ కేవలం 29.4 ఓవర్లలో 149/1 స్కోరు చేసి సునాయాసంగా నెగ్గింది. ఓపెనర్లు ప్రతికా రావల్ (50 నాటౌట్), మంధాన (43), హర్లీన్ డియోల్ (48 నాటౌట్) రాణించారు. ప్రతిక 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. భారత్ తదుపరి మ్యాచ్‌లో మంగళవారం దక్షిణాఫ్రికాతో తలపడుతుంది.

ఛేదన సునాయాసంగా..: స్వల్ప స్కోరు ఛేదనలో ఓపెనర్లు ప్రతిక, మంధాన అద్భుత ఆరంభం ఇచ్చారు. ఏడో వన్డే మాత్రమే ఆడుతున్న ప్రతిక రెండు కీలకమైన భాగస్వామ్యాలు నెలకొల్పింది. మంధానాతో కలిసి తొలి వికెట్‌కు 54, అనంతరం హర్లీన్ డియోల్‌తో కలిసి రెండో వికెట్‌కు అభేద్యంగా 95 రన్స్ జత చేసింది. ఈక్రమంలో వన్డేలలో వరుసగా నాలుగో హాఫ్ సెంచరీని ప్రతిక నమోదు చేసింది.

బౌలర్లు భళా: అంతకుముందు భారత స్పిన్నర్ల ధాటికి శ్రీలంక బ్యాటర్లు పరుగులు చేయడం కష్టమైంది. వన్డే అరంగేట్రం చేసిన పేసర్ కష్వీ గౌతమ్ వికెట్ సాధించకపోయినా పొదుపైన బౌలింగ్‌తో ఆకట్టుకుంది. భారీ వర్షంతో మ్యాచ్ మూడు గంటలు ఆలస్యంగా ప్రారంభం కాగా..పిచ్‌పై తేమను సద్వినియోగం చేసుకున్న భారత బౌలర్లు ప్రత్యర్థిని పరుగులు చేయకుండా నిరోధించారు.

సంక్షిప్తస్కోర్లు: శ్రీలంక: 38.1 ఓవర్లలో 147 ఆలౌట్ (హాసినీ పెరీరా 30, కవిషా దిల్హరి 25, అనుష్క సంజీవని 22, స్నేహ్ రాణా 3/31, దీప్తీ శర్మ 2/22, శ్రీచరణి 2/26); **భారత్:** 29.4 ఓవర్లలో 149/1 (ప్రతికా రావల్ 50 నాటౌట్, హర్లీన్ డియోల్ 48 నాటౌట్, మంధాన 43, ఇనోకా రణవీర 1/32).

ఐపీఎల్‌లో నేడు	వేదిక జైపూర్
రాజస్థాన్ x గుజరాత్	రా.7.30 నుంచి

మనోళ్లు చిత్తయ్యారు

డెన్మార్క్ 4-1తో భారత్‌పై గెలుపు
సుదీర్మన్ కప్ బ్యాడ్మింటన్

గ్జియామెన్ (చైనా): సుదీర్మన్ కప్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం జరిగిన తమ ఆరంభ మ్యాచ్‌లో భారత్ 1-4తో డెన్మార్క్ చేతిలో చిత్తయింది. సింగిల్స్ టాప్ స్టార్లు సింధు, ప్రణయ్ కూడా ఓడడం జట్టుపై తీవ్ర ప్రభావం చూపింది. మహిళల డబుల్స్‌లో తనీసా క్రాస్టో/శ్రుతి మిశ్రా జోడీ మాత్రం ప్రత్యర్థిపై నెగ్గి కాస్త పరువైనా నిలబెట్టింది. మరోవైపు తమ టాప్ షట్లర్లు అక్సెల్సెన్, మియా బ్లిచ్‌ఫీల్డ్ లేకుండానే పోటీపడ్డ డెన్మార్క్ పూర్తిస్థాయిలో సత్తాచాటింది. మొదట మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత ద్వయం తనీషా/ధ్రువ్ కపిల 13-21, 14-21తో ప్రపంచ ఏడో ర్యాంక్ జోడీ జెస్పర్ టాఫ్/అమేలీ మెగ్‌లాండ్ చేతిలో, పురుషుల సింగిల్స్‌లో వెటరన్ ప్రణయ్ 15-21, 16-21తో ఆంటోన్సెన్ చేతిలో, ఆ తర్వాత పురుషుల డబుల్స్‌లో హరిహరన్/రూబన్ జంట 7-21, 4-21తో ప్రపంచ నెం.1 జోడీ కిమ్ ఆస్ట్రప్/ఆండెర్స్ స్కారప్ చేతిలో ఓడడంతోనే డెన్మార్క్ 3-0 ఆధిక్యంతో భారత్‌పై పైచేయి సాధించింది. ఇక నామమాత్రమైన మహిళల సింగిల్స్‌లో లినె హాజ్‌మార్క్ 22-20, 23-21తో సింధుకు షాకివ్వడంతో డెన్మార్క్ 4-0తో పూర్తి ఆధిపత్యం చాటుకుంది. ఆఖరిదైన మహిళల డబుల్స్‌లో భారత జంట తనీషా/శ్రుతి 21-13, 21-18తో నటాషా/బోజెను ఓడించింది. భారత్ తర్వాతి పోరును ఇండోనేసియాతో మంగళవారం ఆడనుంది.

ఫైనల్స్‌లో 14 మంది బాక్సర్లు

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా అండర్-15, అండర్-17 బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో 14 మంది భారత బాక్సర్లు ఫైనల్‌కు చేరుకొన్నారు. అండర్-15 సెమీస్‌లో కోమల్ (30-39 కిలోలు), నవ్య (58 కి), సునయన (61 కి), కుషీ అహ్లావత్ (35 కి), తమన్నా (37 కి), ప్రిన్సి (52 కి), తృష్ణ (67 కి), మిల్కీ (43 కి) విజయాలు సాధించారు. కాగా, స్వీ (40 కి), వన్షిక (70+ కి)కు బై లభించింది. బాలురలో వినోద్ (35 కి), రుద్రాక్ష్ (46 కి), అభిజిత్ (61 కి), లక్ష్య ఫొగట్ (64 కి) స్వర్ణ పోరుకు చేరుకొన్నారు.

పాక్ టోర్నీలో ఆడేది లేదు

భారత వాలీబాల్ జట్టు

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌లో జరిగే మధ్య ఆసియా వాలీబాల్ చాంపియన్‌షిప్ నుంచి భారత జట్టు వైదొలిగింది. ఇటీవల పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకుంది. మే 28 నుంచి జూన్ 4 వరకు ఇస్లామాబాద్‌లో జరిగే ఈ చాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యంపై గతంలోనే భారత్ అంగీకారం తెలిపింది. అయితే తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్ర క్రీడాశాఖ ఆదేశాల మేరకు అక్కడికి వెళ్లకూడదని భారత వాలీబాల్ సమాఖ్య నిర్ణయించుకుంది.

83 స్వర్ణాలతో సత్తాచాటిన భారత్

ఆసియా యోగాసన చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: ఆసియా యోగాసన చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య భారత జట్టు అదరగొట్టింది. ఏకంగా 83 స్వర్ణాలు కొల్లగొట్టి అగ్రస్థానంలో నిలిచింది. ఆదివారంతో ముగిసిన ఈ మెగా టోర్నీలో అత్యధిక స్వర్ణాలకు తోడు 3 రజతాలు, ఓ కాంస్యంతో కలిపి 87 పతకాలను భారత్ ఖాతాలో వేసుకుంది. మూడేసి స్వర్ణ, రజత, నాలుగు కాంస్యాలతో జపాన్ రెండోస్థానం దక్కించుకుంది.

టాప్ లేపిన బెంగళూరు


క్రునాల్ పాండ్యా (47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 73 నాటౌట్)

- ఆదుకున్న క్రునాల్, కోహ్లీ
- ఢిల్లీపై ఆరు వికెట్లతో విజయం

1 ఐపీఎల్ సీజన్‌లో ఇతర వేదికలపై వరుసగా ఆరు విజయాలు సాధించిన ఏకైక జట్టుగా ఆర్‌సీబీ.

న్యూఢిల్లీ: తాజా సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అదరగొడుతోంది. మరీ ముఖ్యంగా ప్రత్యర్థుల సొంత మైదానాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకుంటూ తొలి టైటిల్ కోసం దూసుకెళ్తోంది. ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 163 పరుగుల ఛేదనలో అనూహ్యంగా తడబాటుకు గురైనా ఆర్‌సీబీ ఒత్తిడికి లోనుకాలేదు. క్రునాల్ పాండ్యా (47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 73 నాటౌట్) సమయోచిత ఆటతీరుకు, ఛేజింగ్ రారాజు విరాట్ కోహ్లీ (47 బంతుల్లో 4 ఫోర్లతో 51) సహకారం అందించగా ఢిల్లీ క్యాపిటల్స్‌పై 6 వికెట్ల తేడాతో ఆర్‌సీబీ నెగ్గింది. దీంతో 14 పాయింట్లతో పట్టికలో టాప్‌నకు చేరి ప్లేఆఫ్స్ ఆశలను మరింత మెరుగుపర్చుకుంది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా ఢిల్లీ 20 ఓవర్లలో 8 వికెట్లకు 162 పరుగులు చేసింది. రాహుల్ (41), స్టబ్స్ (34), పోరెల్ (28) మాత్రమే రాణించారు. భువనేశ్వర్‌కు 3, హాజెల్‌వుడ్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో బెంగళూరు 18.3 ఓవర్లలో 4 వికెట్లకు 165 పరుగులు చేసి గెలిచింది. టిమ్ డేవిడ్ (5 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 19 నాటౌట్) చివర్లో మెరిశాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా క్రునాల్ నిలిచాడు.

శతక భాగస్వామ్యంతో..: ఆర్‌సీబీ ముందు ఓ మాదిరి ఛేదనే అనిపించినా.. డీసీ బౌలర్లు ఆదిలోనే ఝలక్ ఇచ్చారు. ఓవర్లు సాగుతున్న కొద్దీ లక్ష్యం కఠినంగా మారుతుండడంతో ఫలితంపై ఉత్కంఠ ఏర్పడింది. అయితే ఓపెనర్ విరాట్‌కు తోడు క్రునాల్ అద్భుత ఆటతీరుతో శతక భాగస్వామ్యం నమోదు చేసి జట్టును గట్టెక్కించారు. చివర్లో టిమ్ డేవిడ్ (19 నాటౌట్) ధమాకా ఆటతీరుతో మురిపించాడు. ఓపెనర్ బెథెల్ (12), దేవ్‌దత్ (0)లను స్పిన్నర్ అక్షర్ మూడో ఓవర్‌లోనే పెవిలియన్‌కు చేర్చి షాకిచ్చాడు. కాసేపటికే కెప్టెన్ రజత్ (6)ను కరుణ్ రనౌట్ చేయడంతో ఆర్‌సీబీ తీవ్ర ఒత్తిడిలో పడింది. అటు పవర్‌ప్లేలో కేవలం 35/3 స్కోరుకే పరిమితం కావడంతో ఛేదన కష్టమే అనిపించింది. కానీ ఈ ఇబ్బందికర పరిస్థితిలో విరాట్-క్రునాల్ జోడీ నిలబడింది. వికెట్‌ను కోల్పోకూడదనే లక్ష్యంతో వీరు ఆచితూచి ఆడారు. అటు సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతున్నా బెదరలేదు. 13వ ఓవర్‌లో క్రునాల్ రెండు సిక్సర్లతో కాస్త కదలిక వచ్చింది. అలాగే 38 బంతుల్లో అతడు కెరీర్‌లో రెండో ఫిఫ్టీని పూర్తి చేశాడు. అటు విరాట్ సైతం తన హ్యాట్రిక్ హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. 17వ ఓవర్‌లో క్రునాల్ 2 ఫోర్లతో 12 రన్స్ సమకూరాయి. ఇక తర్వాతి ఓవర్‌లోనే విరాట్ వెనుదిరగడంతో మూడో వికెట్‌కు 119 పరుగుల భాగస్వామ్యం ముగిసినప్పటికీ ఆర్‌సీబీ విజయం దరిదాపుల్లోకి వచ్చింది. 12 బంతుల్లో 17 రన్స్ కావాల్సిన వేళ టిమ్ డేవిడ్ 6,4,4,4తో 9 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

మెరుపుల్లేవ్..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీని ఆర్‌సీబీ బౌలర్లు గణనీయంగా కట్టడి చేశారు. అటు స్లో వికెట్ కావడంతో డీసీ బ్యాటర్లు పరుగులు సాధించేందుకు తంటాలు పడ్డారు. దీనికి తోడు వరుస విరామాల్లో వికెట్లు కోల్పోవడంతో రిస్క్ తీసుకోలేక ఒత్తిడిలో పడింది. మధ్య ఓవర్లలో రాహుల్ క్రీజులో నిలిచినా భారీ షాట్లు ఆడలేకపోయాడు. అయితే చివరి మూడు ఓవర్లలో స్టబ్స్ వీరవిహారంతో ఢిల్లీ గౌరవప్రదమైన స్కోరందుకుంది. ఆరంభంలో ఓపెనర్ పోరెల్ మాత్రం ధాటిని కనబర్చాడు. తొలి బంతినే ఫోర్‌గా మల్చిన తను మూడో ఓవర్‌లో రెండు సిక్సర్లతో 17 రన్స్ రాబట్టాడు. కానీ అతడి దూకుడుకు నాలుగో ఓవర్‌లోనే బ్రేక్ పడింది. తర్వాతి ఓవర్‌లోనే కరుణ్ (4) కూడా వెనుదిరిగినా పవర్‌ప్లేలో జట్టు 52/2తో పర్వాలేదనిపించింది. అనంతరం డీసీ ఇన్నింగ్స్ నత్తనడకన సాగింది. స్పిన్నర్లు సుయాష్, క్రునాల్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో బౌండరీలు రావడం గగనంగా మారింది. రాహుల్, డుప్లెసి మధ్య మూడో వికెట్‌కు 28 రన్స్ జత చేరాయి. అక్షర్ (15) ఉన్నంతసేపు వేగం కనబర్చాడు. 17వ ఓవర్‌లో రాహుల్, అశుతోష్ (2)ల వికెట్లను తీసి భువీ గట్టి దెబ్బ తీశాడు. అప్పటికి స్కోరు 120/6. ఈ దశలో 150 కూడా అతికష్టంగా మారింది. కానీ 18వ ఓవర్‌లో విప్రజ్ (12) సిక్సర్, స్టబ్స్ ఫోర్‌తో 17 రన్స్ సమకూరగా, 19వ ఓవర్‌లో స్టబ్స్ మరింత చెలరేగి 4,6,4తో 19 రన్స్ రాబట్టాడు. కానీ చివరి ఓవర్‌లో భువీ ఆరు పరుగులే ఇచ్చి స్టబ్స్ వికెట్ తీయగా.. విప్రజ్ రనౌటయ్యాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	10	7	3	0	14	0.521
గుజరాత్	8	6	2	0	12	1.104
ముంబై	10	6	4	0	12	0.889
ఢిల్లీ	9	6	3	0	12	0.482
పంజాబ్	9	5	3	1	11	0.177
లఖ్‌నవూ	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	9	3	5	1	7	0.212
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
రాజస్థాన్	9	2	7	0	4	-0.625
చెన్నై	9	2	7	0	4	-1.302

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

ఢిల్లీ: అభిషేక్ (సి) సుయాష్ (బి) హాజెల్‌వుడ్ 28, డుప్లెసీ (సి) కోహ్లీ (బి) క్రునాల్ 22, కరుణ్ నాయర్ (సి) భువనేశ్వర్ (బి) యశ్ దయాల్ 4, కేఎల్ రాహుల్ (సి) బెథెల్ (బి) భువనేశ్వర్ 41, అక్షర్ (బి) హాజెల్‌వుడ్ 15, స్టబ్స్ (సి) హాజెల్‌వుడ్ (బి) భువనేశ్వర్ 34, అశుతోష్ (బి) భువనేశ్వర్ 2, విప్రజ్ (రనౌట్) 12, స్టార్క్ (నాటౌట్) 0, చమీర (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 162/8; వికెట్ల పతనం:** 1-33, 2-44, 3-72, 4-102, 5-118, 6-120, 7-158, 8-162; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-33-3, యశ్ దయాల్ 4-0-42-1, హాజెల్‌వుడ్ 4-0-36-2, సుయాష్ 4-0-22-0, క్రునాల్ పాండ్యా 4-0-28-1.

బెంగళూరు: బెథెల్ (సి) కరుణ్ (బి) అక్షర్ 12, కోహ్లీ (సి) స్టార్క్ (బి) చమీర 51, పడిక్కళ్ (బి) అక్షర్ 0, పటీదార్ (రనౌట్) 6, క్రునాల్ పాండ్యా (నాటౌట్) 73, టిమ్ డేవిడ్ (నాటౌట్) 19, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 18.3 ఓవర్లలో 165/4; వికెట్ల పతనం:** 1-20, 2-20, 3-26, 4-145; **బౌలింగ్:** అక్షర్ 4-0-19-2, స్టార్క్ 3-0-31-0, ముకేశ్ 3.3-0-51-0, విప్రజ్ 1-0-12-0, కుల్దీప్ 4-0-28-0, చమీర 3-0-24-1.

ముంబై జైత్రయాత్ర

వరుసగా ఐదో విజయం

సూర్య, రికెల్టన్ అర్ధ శతకాలు
54 పరుగులతో లఖ్‌నవూ చిత్తు
బుమ్రాకు 4 వికెట్లు


విల్ జాక్స్ (29, 2/18)


సూర్యకుమార్ (28 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 54)

ఐపీఎల్‌లో వేగంగా 4వేల పరుగుల మైలురాయిని చేరిన రెండో ఆటగాడిగా సూర్యకుమార్. 2,714 బంతుల్లో సూర్య ఈ ఫీట్ చేస్తే.. 2,658 బంతుల్లో సాధించిన గేల్, డివిల్లీర్స్ సంయుక్తంగా టాప్‌లో ఉన్నారు.

ముంబై: జోరుమీదున్న ముంబై ఇండియన్స్ వరుసగా ఐదో విజయంతో ప్లేఆఫ్స్ దిశగా దూసుకెళ్తోంది. ర్యాన్ రికెల్టన్ (32 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 58), సూర్యకుమార్ (28 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 54) హాఫ్ సెంచరీలతోపాటు బుమ్రా (4/22) నిప్పులు చెరగడంతో.. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 54 పరుగులతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌ను మట్టికరిపించింది. తొలుత ముంబై 20 ఓవర్లలో 215/7 స్కోరు చేసింది. మయాంక్, అవేశ్ చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో లఖ్‌నవూ ఓవర్లన్నీ ఆడి 161 పరుగులకు ఆలౌటైంది. ఆయుష్ బదోని (35), మిచెల్ మార్ష్ (34) పర్వాలేదనిపించారు. ట్రెంట్ బౌల్ట్ మూడు వికెట్లు దక్కించుకోగా.. ఆల్‌రౌండ్ షో చేసిన విల్ జాక్స్ (29, 2/18) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

పెవిలియన్‌కు క్యూ: ముంబై పేసర్లు బుమ్రా, బౌల్ట్ వికెట్ల వేటలో పోటీపడడంతో.. లఖ్‌నవూ బ్యాటింగ్ పేకమేడను తలపించింది. రెండో వికెట్‌కు పూరన్ (27)తో కలసి 42 రన్స్ జోడించిన మార్ష్.. బదోనితో నాలుగో వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశాడు. అయితే, పూరన్, కెప్టెన్ రిషభ్ పంత్ (4)ను జాక్స్ ఒకే ఓవర్‌లో అవుట్ చేసి ఝలక్ ఇచ్చాడు. కాగా, ఓపెనర్ మార్‌క్రమ్ (9)ను స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేర్చిన బుమ్రా.. 16వ ఓవర్‌లో మిల్లర్ (24), సమద్ (2), బిష్ణోయ్ (13) వికెట్లతో ప్రత్యర్థి వెన్నువిరిచాడు. మార్ష్, బదోనితోపాటు దిగ్వేష్ (1)ను అవుట్ చేసిన బౌల్ట్.. లఖ్‌నవూ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

చెలరేగిన సూర్య: రికెల్టన్, సూర్య అర్ధ శతకాలతో.. ముంబై భారీ స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైకి ఓపెనర్లు రికెల్టన్, రోహిత్ శుభారంభం అందించారు. ఫోర్‌తో ఖాతా తెరిచిన ఓపెనర్ రికెల్టన్.. రెండో ఓవర్‌లో ప్రిన్స్ బౌలింగ్‌లో 6,4,4తో చెలరేగాడు. అయితే, గాయం నుంచి పునరాగమనం చేసిన పేసర్ మయాంక్ వేసిన మూడో ఓవర్‌లో వరుసగా రెండు సిక్స్‌లు బాదిన మరో ఓపెనర్ రోహిత్ (12).. అదే ఓవర్‌లో స్లో బంతికి బోల్తాపడ్డాడు. దీంతో తొలి వికెట్‌కు 33 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం క్రీజులోకి వచ్చిన విల్ జాక్స్ (29) కూడా రికెల్టన్‌తో పోటీపడి మరీ షాట్లు ఆడారు. ఆరో ఓవర్‌లో రికెల్టన్ 6,4,6తో 19 పరుగులు రాబట్టడంతో.. పవర్‌ప్లేను ముంబై 66/1తో మెరుగ్గా ముగించింది. అయితే, ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న రికెల్టన్‌ను ప్రిన్స్ బౌల్డ్ చేసినా.. రెండో వికెట్‌కు 55 పరుగులు సమకూరాయి. ఈ దశలో క్రీజులోకి వచ్చిన సూర్య.. చిన్నచిన్న భాగస్వామ్యాలతో జట్టుకు మెరుగైన స్కోరు అందించాడు. జాక్స్‌ను ప్రిన్స్ బౌల్డ్ చేయగా.. తిలక్ వర్మ (6)ను బిష్ణోయ్, హార్దిక్ పాండ్యా (5)ను మయాంక్ వెనక్కిపంపారు. మరోవైపు అవేశ్ బౌలింగ్‌లో సిక్స్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్న సూర్య.. ఆ తర్వాతి బంతికి అవుటయ్యాడు. చివరి ఓవర్లలో నమన్ ధిర్ (25 నాటౌట్), బోష్ (20) వేగంగా ఆడడంతో.. ముంబై స్కోరు 200 మార్క్ దాటింది.

స్కోరుబోర్డు

ముంబై: రికెల్టన్ (సి) బదోని (బి) రాఠీ 58, రోహిత్ (సి) ప్రిన్స్ (బి) మయాంక్ 12, జాక్స్ (బి) ప్రిన్స్ 29, సూర్యకుమార్ (సి) మార్ష్ (బి) అవేశ్ 54, తిలక్ (సి) ప్రిన్స్ (బి) బిష్ణోయ్ 6, హార్దిక్ (బి) మయాంక్ 5, నమన్ (నాటౌట్) 25, బాష్ (సి) పూరన్ (బి) అవేశ్ 20, చాహర్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 215/7; వికెట్ల పతనం:** 1-33, 2-88, 3-116, 4-137, 5-157, 6-180, 7-208; **బౌలింగ్:** మయాంక్ 4-0-40-2, ప్రిన్స్ 4-0-44-1, దిగ్వేష్ రాఠీ 4-0-48-1, బిష్ణోయ్ 4-0-41-1, అవేశ్ ఖాన్ 4-0-42-2.

లఖ్‌నవూ: మార్ష్ (సి) తిలక్ (బి) బౌల్ట్ 34, మార్‌క్రమ్ (సి) నమన్ (బి) బుమ్రా 9, పూరన్ (సి) సూర్య (బి) జాక్స్ 27, పంత్ (సి) కర్ణ్ శర్మ (బి) జాక్స్ 4, ఆయుష్ (సి) జాక్స్ (బి) బౌల్ట్ 35, మిల్లర్ (సి) బాష్ (బి) బుమ్రా 24, సమద్ (బి) బుమ్రా 2, బిష్ణోయ్ (బి) బాష్ 13, అవేశ్ (బి) బుమ్రా 0, ప్రిన్స్ (నాటౌట్) 4, దిగ్వేష్ (బి) బౌల్ట్ 1; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 161 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-18, 2-60, 3-64, 4-110, 5-135, 6-141, 7-142, 8-142, 9-157; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-20-3, చాహర్ 3-0-38-0, బుమ్రా 4-0-22-4, జాక్స్ 2-0-18-2, కర్ణ్ శర్మ 2-0-25-0, హార్దిక్ 1-0-10-0, బాష్ 4-0-26-1.

పంత్‌కు రూ. 24 లక్షల జరిమానా

ముంబై: ఈ సీజన్‌లో లఖ్‌నవూ రెండోసారి స్లో ఓవర్ రేట్‌కు పాల్పడడంతో ఆ జట్టు కెప్టెన్ రిషభ్ పంత్‌కు రూ. 24 లక్షలు జరిమానా విధించారు. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ బౌలర్లు నిర్ణీత సమయానికి కోటా పూర్తి చేయలేకపోయారు. దీంతో నిబంధనల ప్రకారం జట్టులోని ఆటగాళ్లకు మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించారు.

మూడో స్థానంలో అరవింద్

వార్సా: గ్రాండ్ ప్రీ చెస్ ర్యాపిడ్ ఆరో రౌండ్ ముగిసేసరికి భారత గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చిదంబరం మూడో స్థానానికి దూసుకొచ్చాడు. ఆదివారం జరిగిన నాలుగో గేమ్‌లో గెలిచిన అరవింద్ ఐదు, ఆరో రౌండ్‌లను డ్రా చేసుకున్నాడు. దాంతో ఏడు పాయింట్లతో అరవింద్ మూడో స్థానానికి దూసుకొచ్చాడు. మరో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మూడు రౌండ్లలో..రెండింటిలో పరాజయం పాలయ్యాడు. మరో రౌండ్‌ను డ్రాగా ముగించాడు. దాంతో ప్రజ్ఞానంద (5) ఎనిమిదో స్థానంలో కొనసాగుతున్నాడు.

డబుల్ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట!

సెక్షన్ 22-బి ద్వారా సబ్‌రిజిస్ట్రార్లకు వీటిని అడ్డుకునే అధికారాలు

- రిజిస్ట్రేషన్ చట్టం 1908లో సవరణలకు సిద్ధమైన సర్కారు
- రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించి, కేంద్రానికి..

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డబుల్ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట వేయనున్నారు. రాబోయే రోజుల్లో ఒక వ్యక్తి ఒక ప్లాట్‌ను విక్రయించిన తర్వాత, అదే వ్యక్తి అదే ప్లాట్‌ను మరొకరికి విక్రయించడం కుదరదు. డబుల్ రిజిస్ట్రేషన్ మోసాలను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. 1908 నాటి రిజిస్ట్రేషన్ చట్టంలో సవరణలు చేయడం ద్వారా డబుల్ రిజిస్ట్రేషన్లను నియంత్రించాలని నిర్ణయించింది. అనధికారిక లేఅవుట్లు, ఓపెన్ ప్లాట్లలో ఈ తరహా మోసాలు ఎక్కువగా జరుగుతుంటాయి. నకిలీ పత్రాల ద్వారా మోసపూరిత రిజిస్ట్రేషన్లకు పాల్పడే వ్యక్తుల వల్ల కొనుగోలుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. మోసపోయినట్లు తెలుసుకున్న తర్వాత రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలంటే కోర్టు ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ఒకసారి రిజిస్ట్రేషన్ జరిగాక.. దాన్ని రద్దు చేసే అధికారం సబ్‌రిజిస్ట్రార్‌కు ఉండదు. ఈ క్రమంలో డబుల్ రిజిస్ట్రేషన్లను నిలువరించే అధికారాలను సబ్ రిజిస్ట్రార్లకు కట్టబెట్టేలా సెక్షన్ 22-బి అమల్లోకి తీసుకొచ్చేందుకు సర్కారు సిద్ధమైంది.

ఏటా 60 వరకు డబుల్ రిజిస్ట్రేషన్లు

రాష్ట్రంలో 2024 లెక్కల ప్రకారం 1.53 లక్షల దస్తావేజులు రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఓపెన్ ప్లాట్ల అమ్మకాల విషయంలో డబుల్ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఇటీవల కాలంలో రెరా అథారిటీకి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు డబ్బు చెల్లించిన కొనుగోలుదారుకు దక్కాల్సిన ప్లాట్‌ను మరో వ్యక్తికి కూడా రిజిస్ట్రేషన్ చేసిన ఉదంతాలు అనేకం వెలుగులోకి వస్తున్నాయి. డబ్బులు చెల్లించి మోసపోయిన వారు న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో కొనుగోలుదారుల హక్కులకు మరింత భద్రత కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చట్టంలో సవరణలకు ప్రతిపాదించింది. సెక్షన్ 22-బి ద్వారా ప్రతి సబ్ రిజిస్ట్రార్ ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు ముందు తప్పనిసరిగా ఈసీని పరిశీలించడం ద్వారా అప్పటికే ఒక వ్యక్తికి విక్రయించిన ప్లాట్ మరో వ్యక్తికి విక్రయించకుండా అడ్డుకునే అధికారం కల్పిస్తున్నారు. ఒకవేళ నకిలీ పత్రాలతో మోసపూరిత రిజిస్ట్రేషన్‌కు పాల్పడితే ఈ చట్ట సవరణ ద్వారా దాన్ని రద్దు చేసే అధికారాన్ని కూడా సబ్ రిజిస్ట్రార్లకు కల్పిస్తారు. ఇప్పటికే రెండు దశాబ్దాల క్రితం 22 ఏ సెక్షన్ ద్వారా ప్రభుత్వ భూములను రక్షించేందుకు రిజిస్ట్రేషన్లు జరగకుండా అడ్డుకట్ట వేసిన రిజిస్ట్రేషన్ శాఖ.. 22-బి ద్వారా డబుల్ రిజిస్ట్రేషన్లను నిలువరించేందుకు సన్నద్ధమవుతోంది. చట్టంలో సవరణలు చేసి, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించనున్నారు. తర్వాత అనుమతి కోసం కేంద్రానికి పంపనున్నారు. కేంద్ర హోం, న్యాయ శాఖల పరిశీలన అనంతరం రాష్ట్రపతి ఆమోదంతో సవరణలకు చట్టబద్ధత రానుంది. 2021లో తమిళనాడు ప్రభుత్వం డబుల్ రిజిస్ట్రేషన్లను అడ్డుకునే అధికారాలను సబ్ రిజిస్ట్రార్లకు కట్టబెట్టగా, 2023లో ఏపీ ప్రభుత్వం ఇలాంటి అధికారాలనే కల్పించింది.

ఇతరత్రా మోసాలకు పాల్పడితే..

ఒకరికి బదులు మరో వ్యక్తి వచ్చి రిజిస్ట్రేషన్ చేయడం, రికార్డుల్లో రాసిన సర్వే నంబరు ఒకటి ఉంటే.. భౌతికంగా భూమి వేరే చోట చూపడం, తల్లిదండ్రులు ఎప్పుడో విక్రయించిన తర్వాత వారసులు అడ్డం తిరగడం, హద్దులు మార్చి నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్లు.. ఇలా పలు రకాల మోసాలతో నిత్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏదో ఒకచోట వివాదాలు తలెత్తుతుంటాయి. ప్రస్తుతానికి డబుల్ రిజిస్ట్రేషన్లను కట్టడి చేయాలని భావిస్తున్న ప్రభుత్వం.. దశల వారీగా అన్ని రకాల మోసాలను అరికట్టేలా చట్టాన్ని బలోపేతం చేయనున్నట్లు ఓ అధికారి తెలిపారు.

చొరబాటుదారులను పట్టేదెలా?

- అక్రమార్కులతో ఎస్‌బీ పోలీసులకు ఇబ్బందులు
- విదేశాల నుంచి వచ్చి హైదరాబాద్‌లో తిష్ట
- స్థానిక నేతల అండతో ఆధార్, ఓటర్ ఐడీలు
- వాటి ఆధారంగా సులభంగా పాస్ పోర్టులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): భారతీయులుగా గుర్తింపు పొందడానికి ఏం కావాలి..? ఆధార్, ఓటర్ ఐడీ ఉంటే చాలు. వాటిని ఆధారంగా చూపి డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ సహా ఇతర అన్ని ప్రభుత్వ గుర్తింపు కార్డులను పొందవచ్చు. విదేశీ చొరబాటుదారులు ఇక్కడే తెలివి ప్రదర్శిస్తున్నారు. అడ్డదారిలో ఆధార్, ఓటర్ కార్డులను పొంది స్థానికులుగా చెలామణి అవుతున్నారు. ప్రభుత్వ పథకాలను పొందడంతో పాటు పాస్‌పోర్టులూ సంపాదిస్తున్నారు. ఇలాంటి అక్రమార్కులను గుర్తించడం పోలీసులకు కష్టంగా ఉంటోంది. ప్రధాన గుర్తింపు కార్డులు ఉండటం, స్థానికుల నుంచి ఎలాంటి నెగిటివ్ రిపోర్టు రాకపోవడంతో పోలీసుల క్లీన్ చిట్ ఇచ్చే పరిస్థితులు నెలకొంటున్నాయి. అక్రమంగా భారత్‌కు వలస వచ్చి.. హైదరాబాద్‌లో ఉంటున్న వారిలో ఎక్కువ మంది పాతనగరంతో పాటు పలు ప్రాంతాల్లో స్థిరపడుతున్నారు. వారంతా ఇతర రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం వలస వచ్చినట్లు నమ్మించి స్థానికులతో మంచి సంబంధాలు కలిగి ఉంటూ జీవనోపాధి పొందుతున్నారు. స్థానిక నేతల సహకారంతో అడ్డదారిలో ఆధార్, ఓటర్ కార్డులు పొందుతున్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు అలవాటుపడిన నాయకులు నకిలీ పత్రాలను సమర్పించి వేలాది మందిని కొత్త ఓటర్లుగా నమోదు చేస్తున్నారు.

మచ్చుకు కొన్ని ఘటనలు..

నగరంలో ఉంటున్న భార్య, కొడుకును చూడటానికి పాకిస్థాన్ నుంచి అక్రమ మార్గంలో ఇండియాకు చేరుకొని హైదరాబాద్‌లో అత్తారింట్లో తలదాచుకున్న మహ్మద్ ఫయాజ్‌ను 2023లో బహదూర్‌పుర పోలీసులు అరెస్టు చేశారు. అతన్ని హైదరాబాద్ వాసిగా గుర్తించడానికి ఫయాజ్ అత్తామామలు కొంతమంది మధ్యవర్తుల సహకారంతో బర్త్ సర్టిఫికెట్ సంపాదించారు. ఆ తర్వాత ఆధార్‌కార్డుకు దరఖాస్తు చేశారు. అది ప్రాసెస్‌లో ఉండగానే ఫయాజ్ పోలీసులకు చిక్కాడు.

నాలుగు రోజుల క్రితం సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కిన మహ్మద్ హసీబుల్ అలియాస్ జోవన్ చౌదరి(25), రోమన్ సాహ అలియాస్ రహన్(21)లను విచారించినప్పుడు విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇద్దరు అక్రమార్కులు నాలుగేళ్ల క్రితం రూ. 25వేలు చెల్లించి బంగ్లాదేశ్‌లోని ఢాకా నుంచి అక్రమమార్గంలో ఇండియాలోకి ప్రవేశించారు. మూడేళ్లకు పైగా కోల్‌కతాలోని సౌత్‌హారాలో ఉన్నారు. హసీబుల్ ఫేస్‌బుక్‌లో పరిచయం అయిన హైదరాబాద్ మలక్‌పేటకు చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. పది నెలల క్రితం హైదరాబాద్‌కు మకాం మార్చి స్విగ్గీ, జొమాటోలో ఫుడ్ డెలివరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. స్థానిక నేతల సహకారంతో బర్త్ సర్టిఫికెట్ సంపాదించి ఆధార్‌కార్డుకు దరఖాస్తు చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఇద్దరు బంగ్లాదేశీయులను అరెస్టు చేశారు. అక్రమ వలసదారులుగా వచ్చి నగరంలో తిష్ట వేసిన మయన్మార్‌కు చెందిన సుమారు 70 వేల కుటుంబాల్లో ఇప్పటికే వేలాది మంది ఓటర్ కార్డులు, ఆధార్‌లు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పోలీసు పరిశీలనలో బయటపడని అక్రమార్కులు..

పాస్‌పోర్టు వెరిఫికేషన్‌కు అవసరమైన ఆధార్, ఓటర్, పాన్‌కార్డులను అభ్యర్థి సిద్ధం చేసుకుని పోలీసులకు చూపిస్తాడు. స్థానికులు పాజిటివ్ రిపోర్టు ఇవ్వడంతో ఎస్‌బీ అధికారులు పాస్‌పోర్టుకు క్లియరెన్స్ ఇస్తున్నారు. కొంతకాలం తర్వాత ఆ వ్యక్తి ఏదో నగరంలోనో, వేరే రాష్ట్రంలోనో నేరాలు చేసినప్పుడు, అక్రమ పాస్‌పోర్టు సైతం పొందినట్లు వెలుగులోకి వస్తుంది. దీంతో క్షేత్రస్థాయి విచారణలో అధికారులు నిర్లక్ష్యం చేశారని వారిపై చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజాసమస్యలపై విద్యార్థులు ఉద్యమించాలి

- ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షుడు నితీష్ నారాయణ
- ఖమ్మంలో ముగిసిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా రజనీకాంత్, నాగరాజు


ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన రజనీకాంత్, నాగరాజు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థలోని లోపాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి వాటిపైనే కాక ప్రజా సమస్యలపై కూడా విద్యార్థులు ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షుడు నితీష్ నారాయణ పిలుపునిచ్చారు. ఖమ్మంలో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఎస్ఎఫ్ఐ ఐదో మహాసభలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ ముగింపు సభకు హాజరైన నితీష్ నారాయణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ హిందుత్వ అజెండాను విద్యార్థులు, యువత అడ్డుకోవాలని కోరారు. సామాజిక సమస్యలపై విద్యార్థులు ఉద్యమ కార్యచరణ చేపట్టాలని సూచించారు. గుజరాత్‌లో అంగన్‌వాడీ కేంద్రాలను జనాభా ప్రాతిపదికన కాకుండా కులాల ప్రాతిపదికన ఏర్పాటు చేయడంపై అక్కడి ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా వివరించారు. కాగా, నూతన విద్యా విధానం రద్దు, విద్యార్థి సంఘాలు ఎన్నికల నిర్వహణ, గురుకులాలు, సంక్షేమ వసతిగృహాలకు సొంత భవనాలు నిర్మాణం సహా 17 అంశాలపై చేసిన తీర్మానాలను మహాసభల్లో ఆమోదించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ విద్యార్థుల నివేదిక సమర్పణ సందర్భంగా సభ మారుమోగింది. ముగింపుసభలో కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడారు. కాగా, మహాసభల ముగింపు సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడిగా రజనీకాంత్(కరీంనగర్), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఖమ్మం జిల్లాకు చెందిన తాళ్ల నాగరాజు ఎన్నికయ్యారు. వీరితో పాటుగా రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు.

తమిళనాడులో ఇద్దరు మంత్రులు అవుట్

- సెంథిల్ బాలాజీ, పొన్ముడి రాజీనామా
- సీఎం స్టాలిన్ సిఫారసుకు గవర్నర్ ఆమోదం
- క్యాబినెట్‌లోకి తంగరాజ్.. నేడు ప్రమాణం

చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలు, వివాదాస్పద వ్యాఖ్యలతో న్యాయస్థానాల మొట్టికాయలు తిన్న ఇద్దరు తమిళనాడు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. రాష్ట్ర విద్యుత్, ఎక్సైజ్ శాఖల మంత్రి సెంథిల్ బాలాజీ, అటవీ మంత్రి కె.పొన్ముడి ఆదివారం తమ రాజీనామా లేఖలను సీఎం స్టాలిన్‌కు పంపించారు. వారి వ్యవహారం తన ప్రభుత్వానికి ఇబ్బందుల్లోకి నెట్టే సూచనలు కనిపిస్తుండడంతో పదవుల నుంచి తప్పుకోవాలని ముఖ్యమంత్రే వారిని ఆదేశించినట్లు సమాచారం. ఆయన సిఫారసుతో వారి రాజీనామాలను గవర్నర్ ఆర్ఎన్ రవి తక్షణమే ఆమోదించారు. డీఎంకే సీనియర్ నేత, పద్మనాభపురం ఎమ్మెల్యే మనో తంగరాజ్‌ను కొత్తగా మంత్రివర్గంలోకి తీసుకునేందుకు ఆయన అంగీకరించారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు తంగరాజ్‌తో గవర్నర్ ప్రమాణం చేయించనున్నట్లు రాజ్‌భవన్ ప్రకటించింది. ఇంకోవైపు.. సెంథిల్ నిర్వహించిన విద్యుత్‌శాఖను రవాణా మంత్రి శివశంకర్‌కు.. ఎక్సైజ్‌శాఖను గృహనిర్మాణ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎస్.ముత్తుస్వామికి, పొన్ముడి అటవీశాఖను డెయిరీ శాఖ మంత్రి ఆర్ఎస్ రాజకన్నప్పన్‌కు అదనంగా అప్పగించారు.

సీఎస్‌గా రామకృష్ణారావు

ఈ ఏడాది ఆగస్టు వరకు పదవీ కాలం.. అనుభవం, సీనియారిటీకి పెద్దపీట

14 రాష్ట్ర బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన ఘనత.. సీఎస్ ఆయనేనని ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'



హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఆగస్టు వరకు 4 నెలల పాటు ఆయన సీఎస్ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుత సీఎస్ శాంతికుమారి ఈ నెలాఖరున పదవీ విరమణ పొందనున్నారు. 1989 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి శాంతికుమారికి ఈ నెల 7 నాటికే 60 ఏళ్ల పూర్తయ్యాయి. అఖిల భారత సర్వీసు అధికారుల పదవీ విరమణ వయసు 60 ఏళ్లు. అయితే రాజ్యాంగబద్ధమైన పదవులు మినహా అఖిల భారత సర్వీసులు, ఇతర ఉద్యోగుల జన్మదినాలు నెల మధ్యలో ఉంటే.. నెలాఖరున రిటైర్ అవుతుంటారు. ఈ క్రమంలో శాంతికుమారి కూడా ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. అదే రోజు రామకృష్ణారావు సీఎస్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. శాంతికుమారి బీఆర్ఎస్ హయాంలో సీఎస్‌గా నియమితులయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సీఎస్‌గా ఆమెనే కొనసాగించారు. 1991 బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావు ప్రస్తుతం ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 1990 బ్యాచ్‌లో శశాంక్ గోయల్, 1991 బ్యాచ్‌లో రామకృష్ణారావు, జయేశ్‌రంజన్, సంజాయ్ జాజు ఉన్నారు. రాష్ట్ర కేడర్‌లో శశాంక్ గోయల్ సీనియర్ అయినప్పటికీ ఆయన్ను మొదటి నుంచీ అప్రాధాన్య పోస్టుల్లోనే కొనసాగిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ప్రాధాన్యం లేని పోస్టులే ఇస్తూ వచ్చాయి. సంజాయ్ జాజు కేంద్ర సర్వీసుల్లో కొనసాగుతుండగా, జయేశ్ రంజన్, రామకృష్ణారావుల్లో ఒకర్ని సీఎస్‌గా చేయాలని సర్కారు భావించింది. అయితే మొదటి నుంచీ రామకృష్ణారావు వైపే సర్కారు మొగ్గుచూపుతోంది. కేంద్రం నుంచి రాష్ట్రానికి సంబంధించిన నిధులు రాబట్టడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు.

గురుకులంలో చదివి.. రాష్ట్ర సీఎస్‌గా..

రామకృష్ణారావు 1965 ఆగస్టు 30న ఉమ్మడి ఏపీలోని అనంతపురంలో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి వరంగల్‌లో రైల్వే శాఖలో పనిచేశారు. అనంతపురం జిల్లాలోని కొడిగెన్‌హళ్లి గురుకుల పాఠశాలలో 1980లో పదో తరగతి పూర్తి చేసిన రామకృష్ణారావు.. కాన్పూర్ ఐఐటీలో ఇంజనీరింగ్ చేశారు. ఢిల్లీ ఐఐటీ నుంచి మాస్టర్స్ పూర్తి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆదిలాబాద్, గుంటూరు జిల్లాల కలెక్టర్‌గా పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఉద్యోగుల విభజనలో కీలక పాత్ర పోషించారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. బీఆర్ఎస్ హయాంలో 2016 ఫిబ్రవరి 2న ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అదే పదవిలో కొనసాగుతున్నారు. ఆర్థిక శాఖను కూడా ఆయన వద్దనే ఉంచుతూ సర్కారు మరో జీవో జారీ చేసింది. మొత్తం 14 రాష్ట్ర బడ్జెట్‌లను (ఓటాన్ అకౌంట్‌తో కలిపి) ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కింది. కాగా, రాష్ట్ర ప్రభుత్వం రామకృష్ణారావును సీఎస్‌గా నియమించనుందని మార్చి 18నే 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది.

స్మిత సభర్వాల్‌పై వేటు

(మొదటిపేజీ తరువాయి)


జయేశ్‌రంజన్

ప్రత్యేకంగా 'పరిశ్రమల పెట్టుబడుల సెల్‌'ను ఏర్పాటు చేసి, జయేశ్ రంజన్‌ను సీఈవోగా నియమించారు. దీంతోపాటు.. స్మిత సభర్వాల్ ఇప్పటి వరకు పర్యవేక్షించిన పర్యాటక శాఖ అదనపు బాధ్యతలను కూడా జయేశ్‌రంజన్‌కు అప్పగించారు. అంటే.. ప్రపంచ సుందరి పోటీలను ఆయనే పర్యవేక్షిస్తారు. పురపాలక పాలన, పట్టణాభివృద్ధి ముఖ్యకార్యదర్శిగా ఉన్న దానకిశోర్ కార్మికశాఖకు బదిలీ అవ్వగా.. ఆ స్థానంలో ఉన్న సంజయ్‌కుమార్‌ను పరిశ్రమలు, వాణిజ్య శాఖ ముఖ్యకార్యదర్శిగా నియమించారు. గవర్నర్ కార్యాలయ ముఖ్య కార్యదర్శిగా కూడా దానకిశోర్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. పాఠశాల విద్య సంచాలకుడిగా ఉన్న ఈవీ నర్సింహారెడ్డిని పరిశ్రమల పెట్టుబడుల సెల్‌కు అదనపు సీఈవోగా బదిలీ చేశారు. పాఠశాల విద్య పోస్టును ఎవరికీ కేటాయించలేదు. మరికొందరు ఐఏఎస్‌ల బదిలీలు ఇలా ఉన్నాయి..

సీఎంవోలో మార్పులు

ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో)లో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యమంత్రికి కార్యదర్శులుగా, పలు శాఖల బాధ్యతలను పర్యవేక్షిస్తున్న అధికారులు బదిలీపై వెళ్లనున్నారు. ప్రస్తుతం సీఎం ముఖ్య కార్యదర్శిగా వి.శేషాద్రితోపాటు ఐఎఫ్ఎస్ అధికారి జి.చంద్రశేఖర్‌రెడ్డి, ఐఏఎస్‌లు మాణిక్కరాజ్, సంగీత సత్యనారాయణ, వేముల శ్రీనివాసులు, ఐపీఎస్‌లు షానవాజ్ ఖాసీం, బి.అజిత్‌రెడ్డి ఉన్నారు. వీరిలో సంగీత సత్యనారాయణ తాజా బదిలీల్లో వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌గా వెళ్లారు. సీఎంకు కార్యదర్శిగా, బీసీ, మైనార్టీ సంక్షేమం, ఆర్అండ్‌బీ సహా పలు శాఖల బాధ్యతలు చూస్తున్న ఐపీఎస్ అధికారి షానవాజ్ ఖాసీం కూడా బదిలీపై వెళ్లనున్నట్టు తెలిసింది. ఈయన బదిలీకి సంబంధించిన ఉత్తర్వులు కూడా త్వరలోనే వెలువడతాయని సమాచారం. ఆయనను తిరిగి పోలీసు శాఖకే బదిలీ చేస్తారని తెలుస్తోంది. సీఎం కార్యదర్శిగా, అటవీ, పర్యావరణం, వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ, హౌసింగ్, పంచాయతీ రాజ్ శాఖల బాధ్యతలను పర్యవేక్షిస్తున్న ఐఎఫ్ఎస్ అధికారి జి.చంద్రశేఖర్‌రెడ్డి కూడా త్వరలో బదిలీకానున్నట్టు సచివాలయవర్గాలు చెబుతున్నాయి. సమాచారం హక్కు(ఆర్టీఐ) చట్టం ప్రధాన కమిషనర్(సీఐసీ)గా చంద్రశేఖర్ రెడ్డిని నియమించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే ఆర్టీఐ ప్రధాన కమిషనర్‌గా ఆయన పేరును ప్రతిపాదిస్తూ ప్రభుత్వం గవర్నర్‌కు ఫైలును పంపిందని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. మొత్తంగా సీఎంవోలో పనిచేస్తున్న ముగ్గురు అధికారులు బదిలీపై వెళ్లనున్నారని స్పష్టమవుతుండగా.. వారి స్థానంలో ఎవరిని తీసుకురావాలనే యోచనలో ప్రభుత్వం ఉంది.

అధికారి పేరు	బదిలీ అయిన స్థానం
ఆర్వీ కర్ణన్	జీహెచ్ఎంసీ కమిషనర్
సంగీత సత్యనారాయణ	వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్
ఇలంబర్తి	పట్టణాభివృద్ధి కార్యదర్శి(హెచ్ఎండీఏ పరిధి)
టీకే శ్రీదేవి	పట్టణాభివృద్ధి కార్యదర్శి(హెచ్ఎండీఏ వెలుపల)
శశాంక్ గోయల్	గుడ్ గవర్నెన్స్ వైస్ చైర్మన్
కే.శశాంక	ఫ్యూచర్ సిటీ డెవలెప్‌మెంట్ అథారిటీ కమిషనర్
ఎస్.హరీశ్	జెన్‌కో సీఎండీ
నిఖిల	మానవహక్కుల కమిషన్ సెక్రటరీ, సీఈవో
ఎస్. వెంకటరావు	దేవాదాయశాఖ డైరెక్టర్, యాదగిరిగుట్ట ఈవో
పి.కాత్యాయనీ దేవి	సెర్ప్ అదనపు సీఈవో
హేమంత్ సహదేవ్‌రావు	జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్
ఫణీంద్రారెడ్డి	టీజీఎంఎస్ఐడీసీ ఎండీ
కథిరవన్	పంచాయతీ రాజ్ జాయింట్ కమిషనర్
విద్యా సాగర్(నాన్ క్యాడర్)	హైదరాబాద్ అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)
ఉపేందర్ రెడ్డి (నాన్ క్యాడర్)	హెచ్ఎండీఏ కార్యదర్శి

కెనడా 'స్ట్రీట్ ఫెస్టివల్'లో కారు బీభత్సం

- 9 మంది మృతి, పలువురికి గాయాలు

వాంకోవర్, ఏప్రిల్ 27: కెనడాలోని వాంకోవర్ నగరంలో స్ట్రీట్ ఫెస్టివల్ జరుపుకుంటున్న సమూహంపైకి ఒక వాహనం దూసుకెళ్లడంతో తొమ్మిది మంది మృతి చెందారు. శనివారం రాత్రి వాంకోవర్‌లో ఫిలిపినో కమ్యూనిటీ సభ్యులు లాపు లాపు డే ఫెస్టివల్ జరుపుకుంటున్నారు. అదే సమయంలో ఓ కారు ఒక్కసారిగా వారిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది మృతి చెందగా మరికొందరు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. నిర్లక్ష్యంగా కారు నడిపిన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఉత్తర కొరియా సైన్యం సహకరించింది: రష్యా

మాస్కో, ఏప్రిల్ 27: రష్యాలోని కర్స్క్ రీజియన్ నుంచి ఉక్రెయిన్ సైన్యాన్ని తరిమికొట్టడంలో ఉత్తర కొరియా సైనిక దళాలు తమకు సహకరించాయని రష్యా మొదటిసారి ధ్రువీకరించింది. గతేడాది ఆగస్టులో ఉక్రెయిన్ రష్యా సరిహద్దులు దాటి కర్స్క్ ప్రాంతాన్ని అనూహ్యంగా ఆక్రమించుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రాంతం నుంచి ఉక్రెయిన్ సైన్యాలను పూర్తిస్థాయిలో వెళ్లగొట్టామన్న సమాచారాన్ని రష్యా సాయుధ బలగాల చీఫ్ గెరామోసివ్ పుతిన్‌కు అందించారు. రష్యా వాదనను ఉక్రెయిన్ సైనికాధికారులు ఖండించారు. ఆ ప్రాంతంలో తమ సైన్యం మాస్కో బలగాల్ని నిలువరిస్తూనే ఉందని పేర్కొన్నారు. మరోవైపు వాటికన్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయిన ట్రంప్ పుతిన్‌కు యుద్ధం ఆపాలనే ఉద్దేశం ఎంతమాత్రం లేనట్టుందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే రాత్రికి రాత్రే ఉక్రెయిన్‌పై వరుస డ్రోన్ దాడులతో రష్యా విరుచుకుపడింది. ఈ దాడిలో ముగ్గురు మరణించగా మరో నలుగురు గాయపడినట్లు ఉక్రెయిన్ అధికారులు ప్రకటించారు.

ఇరాన్ పేలుడు ఘటనలో 40కి పెరిగిన మృతుల సంఖ్య

- వెయ్యి మందికి పైగా గాయాలు

టెహ్రాన్, ఏప్రిల్ 27: ఇరాన్ బందర్ అబ్బాస్ నగరంలోని షాహీద్ రజాయే పోర్టులో పేలుడు, అగ్నిప్రమాద ఘటనలో మరణించిన వారి సంఖ్య 25కు పెరిగింది. వెయ్యి మందికి పైగా గాయపడ్డారు. పేలుడు అనంతరం చెలరేగిన మంటలను హెలికాప్టర్ల ద్వారా నీటిని చల్లుతూ ఆర్పేందుకు యత్నిస్తున్నారు. పేలుడు నేపథ్యంలో సమీప కార్యాలయాలను మూసివేశారు. గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పరామర్శించారు. పేలుడు ఘటనకు అసలు కారణాలు తెలుసుకునేందుకు ఆయన దర్యాప్తునకు ఆదేశించారు. మరోవైపు ఈ ఘటన దాడి వల్ల జరగలేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు.

బిజినెస్

ఎఫ్‌పీఐ పెట్టుబడి రూ.17,425 కోట్లు

న్యూఢిల్లీ: విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు గత వారంలో రూ.17,425 కోట్లు భారత ఈక్విటీ మార్కెట్లో ఇన్వెస్ట్ చేశారు. ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలతో పాటు స్థూల ఆర్థిక మూలాలు పటిష్ఠంగా ఉండడం ఇందుకు దోహదపడింది. అంతకు ముందు వారంలో కూడా వారు రూ.8,500 కోట్లు భారత ఈక్విటీల్లో పెట్టుబడిగా పెట్టారు. డిపాజిటరీల వద్ద అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం ఎఫ్‌పీఐలు ఏప్రిల్ నెలలో ఇప్పటివరకు రూ.5,678 కోట్లు ఉపసంహరించారు. దీంతో ఈ ఏడాది ఇప్పటివరకు వారు తరలించుకుపోయిన నిధుల విలువ రూ.1.22 లక్షల కోట్లకు చేరింది. ప్రపంచంలో వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గడం ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను బలపరిచిందని పరిశీలకులంటున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	415	విజయవాడ	430
వరంగల్	417	గోదావరి	415
చిత్తూరు	480	విశాఖపట్నం	430
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	127
వరంగల్	125	గుంటూరు	125
కరీంనగర్	125	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	92
కర్నూలు	125	నెల్లూరు	97
విశాఖపట్నం	116	అనంతపురం	97
గోదావరి	127		

పీఎస్‌యూ షేర్లు కురిపించెన్ సిరులు



ఐపీఓ మదుపరులకు భారీ లాభాలు
మజ్‌గాన్ డాక్ ఐపీఓలో బంపర్ రాబడులు

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూకి (ఐపీఓ) వచ్చిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు చరిత్ర తిరగ రాస్తున్నాయి. ఈ కంపెనీల ఐపీఓలు, ప్రైవేటు కంపెనీల ఐపీఓలను మించి మదుపరులకు లాభాలు పంచాయి. 2017 మే నుంచి ఇప్పటి వరకు ఐపీఓకి వచ్చిన 18 సీపీఎస్‌యూల్లో మూడు బీమా కంపెనీల ఐపీఓలు తప్ప, మిగతా 15 సీపీఎస్‌యూల ఐపీఓలు మదుపరులకు బంపర్ లాభాలు పంచాయి. 2020 అక్టోబరులో ఐపీఓకు వచ్చిన మజ్‌గాన్ డాక్ షిప్‌బిల్డర్స్ ఐపీఓలో ఇన్వెస్ట్ చేసిన వారైతే ఇప్పటి వరకు 37 రెట్ల లాభాలు కళ్ల జూశారు. రైల్ వికాస్ నిగం లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్), గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ లిమిటెడ్ (జీఆర్ఎస్ఈఎల్), ఐఆర్‌సీటీసీ ఐపీఓలూ మదుపరులకు వెయ్యి శాతానికి పైగా లాభాలు పంచాయి.

అగ్రస్థానంలో మజగాన్ డాక్: రూ.145 ధరతో జారీ అయిన మజ్‌గాన్ డాక్ షిప్‌బిల్డర్స్ షేర్లు ఈ నెల 25న బీఎస్ఈలో రూ.2,640.75 వద్ద ముగిశాయి. రూ.10 ముఖ విలువతో జారీ చేసిన ఈ షేర్లను కంపెనీ గత ఏడాది డిసెంబరులో రూ.5 ముఖ విలువ ఉండే రెండు షేర్లుగా విభజించింది. ఐపీఓ సమయంలో ఉన్న రూ.10 ముఖ విలువనే పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుతం మజగాన్ డాక్ షేర్ల ధర రూ.5,281.5. అంటే ఇష్యూ ధరతో పోలిస్తే ప్రస్తుతం ఈ షేర్లు ఒక్కోటి రూ.5,136.5 లాభంతో ట్రేడవుతున్నాయి.

ఐపీఓ మార్కెట్‌లో సీపీఎస్‌యూల లాభాలు

కంపెనీ పేరు	ఇష్యూ ధర	ప్రస్తుత ధర
మజ్‌గాన్ డాక్	రూ.145	రూ.2,640.75
గార్డెన్ రీచ్	రూ.118	రూ.1,616.80
కొచ్చిన్ షిపయార్డ్	రూ.432	రూ.2,979.7
ఆర్‌వీఎన్ఎల్	రూ.19	రూ.3733.6
ఐఆర్‌సీటీసీ	రూ.320	రూ.3,872.75
ఐఆర్ఈడీఏ	రూ.32	రూ.178.6
హుడ్కో	రూ.60	రూ.233
ఎంఎస్‌టీసీ	రూ.120	రూ.540.25

ఇతర పీఎస్‌యూలు

రూ.118 ధరతో 2017లో మార్కెట్‌కు వచ్చిన గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ కంపెనీ షేర్లు ప్రస్తుతం రూ.1,616.80 వద్ద ట్రేడవుతున్నాయి. 2017లో రూ.432 ధరతో జారీ చేసిన కొచ్చిన్ షిప్‌యార్డు షేర్లు ప్రస్తుతం 590 శాతం లాభంతో రూ.2,979.7 వద్ద ట్రేడవుతున్నాయి. రైల్వే కంపెనీల ఐపీఓలూ మదుపరులకు లాభాలు పంచడంలో ప్రభుత్వ రంగ షిప్పింగ్ కంపెనీలతో పోటీపడుతున్నాయి. 2019లో రూ.19 వద్ద లిస్టయిన ఆర్‌వీఎన్ఎల్ షేర్లు గతవారం 1866 శాతం లాభంతో రూ.373.6 వద్ద ట్రేడయ్యాయి. రూ.320తో జారీ చేసిన ఐఆర్‌సీటీసీ షేర్లూ గత వారం ఇష్యూ ధరతో పోలిస్తే 1,110 శాతం లాభంతో రూ.3,872.75 వద్ద ట్రేడయ్యాయి. రైట్స్, ఇర్కాన్, రైల్‌టెల్, ఐపీఓలూఐ మదుపరులకు ఇష్యూ ధరతో పోలిస్తే 225 నుంచి 243 శాతం లాభాలు పంచాయి. హెచ్ఏఎల్, బీడీఎల్, మిధానీ కంపెనీల ఐపీఓలూ మదుపరులకు 227 నుంచి 605 శాతం వరకు లాభాలు పంచాయి.

మా ఆర్థిక వ్యవస్థ భేష్

పెట్టుబడులతో రండి — ఆర్‌బీఐ గవర్నర్



వాషింగ్టన్: కొన్ని సమస్యలున్నా, భారత ఆర్థిక వ్యవస్థ భవిష్యత్‌కు ఢోకా లేదని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని భారత్‌లో పెట్టుబడులుపెట్టేందుకు ముందుకు రావాలని అమెరికా పారిశ్రామిక వర్గాలను కోరారు. సిఐఐ-భారత అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్య వేదిక ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతూ అంతర్జాతీయ ఫైనాన్సియల్ మార్కెట్లలో ఆటుపోట్లు, అనిశ్చితి ఉన్నా ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా భారత్ 6.5 శాతం వృద్ధిని నమోదు చేస్తుందన్నారు. ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో మరే దేశ జీడీపీ ఈ స్థాయిలో పెరిగే అవకాశం లేదని చెప్పారు. స్థిరమైన ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణమని చెప్పారు. దీర్ఘకాలిక లాభాలు, అవకాశాలు కోరుకునే పారిశ్రామికవేత్తలకు భారత్ చక్కటి మార్కెట్ అని స్పష్టం చేశారు.

భాగస్వామి కూడా : విదేశీ పెట్టుబడులకు భారత్ గమ్య స్థానమే గాక, వారి ఐశ్వర్యంలోనూ భాగస్వామిగా ఉంటుందని మల్హోత్రా అన్నారు. ఈ భాగస్వామ్యం భారత భవిష్యత్‌నే గాక ప్రపంచ భవిష్యత్‌నూ మార్చివేస్తుందన్నారు. 2010-19 మధ్యకాలంలో భారత జీడీపీ ఏటా సగటున 6.6 శాతం చొప్పున పెరిగితే గత నాలుగేళ్లలో ఏటా సగటున 8.2 శాతం వృద్ధిరేటు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలోనే భారత్ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించబోతోందని చెప్పారు.

ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీలోకి డిక్సన్ టెక్నాలజీస్

న్యూఢిల్లీ: డిక్సన్ టెక్నాలజీస్ ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీలోకి కూడా ప్రవేశిస్తోంది. అయితే తాము ప్రస్తుతం ఉత్పత్తి చేసే విడిభాగాలను తమ అవసరాలకే వినియోగిస్తామని, తదుపరి దశలో ఎగుమతులపై దృష్టి పెడతామని కంపెనీ సీఈఓ అతుల్ లాల్ తెలిపారు. తమ కంపెనీ భవిష్యత్ వృద్ధికి ఈ విడిభాగాల తయారీ మంచి అవకాశంగా నిలుస్తుందని చెప్పారు. తాము ఇప్పటికే డిస్‌ప్లే మాడ్యూల్స్‌పై ఒక ప్రాజెక్టును ప్రారంభించామని వెల్లడిస్తూ కెమెరా మాడ్యూల్స్, మెకానికల్ ఎంక్లోజర్స్, లిథియం అయాన్ బ్యాటరీలు వంటి విభిన్న రంగాల్లో గల అవకాశాలను మదింపు చేస్తున్నట్టు తెలిపారు.

అప్రమత్తతే బెటర్

భారత-పాక్ ఉద్రిక్తతల ప్రభావం స్టాక్ మార్కెట్ పైనా కనిపిస్తోంది. ఈ కారణంగా ఈ వారం సూచీలు తీవ్ర ఆటుపోట్లకు లోనయ్యే ప్రమాదం కనిపిస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని మదుపరులు పరిస్థితులు కుదుటపడే వరకు అప్రమత్తతతో ఉండడమే మంచిది. గత వారం 350 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ ఇంట్రా డే కనిష్ఠ స్థాయి నుంచి 150 పాయింట్లు కోలుకుంది. ఇది బై ఆన్ డిప్స్‌ను సూచిస్తోంది. ప్రస్తుతం వైమానిక, చమురు, బ్యాంకింగ్, టెలికం, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్, మద్యం కంపెనీల షేర్లు బుల్లిష్‌గా కనిపిస్తున్నాయి.

ఈ వారం స్టాక్ రికమండేషన్లు

ఎస్‌బీఐ లైఫ్: ఈ ఏడాది ఆరంభం నుంచి అక్యూములేషన్ జోన్‌లో ఉన్న ఎస్‌బీఐ లైఫ్ షేర్లు ప్రస్తుతం ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తున్నాయి. మూమెంటమ్, రిలెటివ్ స్ట్రెంత్ కూడా క్రమంగా పెరుగుతోంది. తాజా త్రైమాసిక ఆర్థిక ఫలితాలు పర్వాలేదనిపించాయి. గత వారం 5.4 శాతం లాభంతో ఈ షేరు రూ.1.695 వద్ద ముగిసింది. రూ.1,820 టార్గెట్‌తో మదుపరులు రూ.1,650 వద్ద ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.1,610

గ్రాసిమ్ ఇండస్ట్రీస్: రూ.2,300 వద్ద డబుల్ బాటమ్ ఏర్పరచుకున్న ఈ కంపెనీ షేర్లు ప్రస్తుతం కీలక రెసిస్టెన్స్ రూ.2,700 పైన ట్రేడవుతున్నాయి. రూ.2,950 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.2,700 పై స్థాయిలో టొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ : రూ.2,670

ఎంఫసిస్: గత ఏడాది డిసెంబరు నుంచి 16 శాతం దిద్దుబాటుకు లోనైన ఎంఫసిస్ కంపెనీ షేర్లు ప్రస్తుతం అక్యూములేషన్ జోన్‌లో ఉన్నాయి. షార్ట్‌టర్మ్ మూమెంటమ్, ట్రేడింగ్ వాల్యూమ్స్ క్రమంగా పెరుగుతున్నాయి. రెండు సార్లు రూ.2,200 వద్ద మద్దతు తీసుకుని బలం ప్రదర్శిస్తున్నాయి. గత వారం రూ.2,538 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.2,655 టార్గెట్‌తో రూ.2,520 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు.
స్టాప్‌లాస్ : రూ.2,490

హెచ్‌యూఎల్: ఈ మల్టీనేషనల్ ఎఫ్ఎంసీజీ దిగ్గజ కంపెనీ షేర్లు ప్రస్తుతం అక్యూములేషన్ జోన్‌లో కొనసాగుతున్నాయి. 2025 మార్చి ఆర్థిక ఫలితాలతో ఈ కౌంటర్‌పై మదుపరుల ఆసక్తి మరింత పెరిగింది. షార్ట్‌టర్మ్ మూమెంటం పెరుగుతోంది. గత వారం ఈ కంపెనీ షేర్లు రూ.2,332 వద్ద ముగిశాయి. రూ.2550 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.2,300 వద్ద ప్రవేశించవచ్చు.
స్టాప్‌లాస్ : రూ.2,260

పవర్‌గ్రిడ్: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కౌంటర్లో మార్చి నుంచి మూమెంటం కనిపిస్తోంది. 10-20 రోజుల మూవింగ్ యావరేజి వద్ద మద్దతు లభిస్తోంది. ప్రస్తుతం ప్రైస్ యాక్షన్ టైట్‌గా ఉంది. వాల్యూమ్స్ కాంట్రాక్షన్ కూడా జరుగుతోంది. గత వారం రూ.306 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.380 టార్గెట్‌తో రూ.290-300 మధ్య పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.270



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24000 కీలకం

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ ఎట్టకేలకు గత వారం కీలక స్థాయి 24000 కన్నా స్వల్పంగా ఎగువన ముగిసింది. ప్రారంభంలో పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయి 24,350 వరకు వెళ్లినా శుక్రవారం బలమైన రియాక్షన్ సాధించింది. మొత్తం మీద పాజిటివ్‌గానే ముగిసినా వారం కనిష్ఠ స్థాయిలో ముగియడం పై స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి ఎదురవుతోందనేందుకు సంకేతం. గత మూడు వారాల్లో 2,600 పాయింట్ల మేరకు లాభపడినా జీవిత కాల గరిష్ఠ స్థాయిల కన్నా 2,000 పాయింట్లు దిగువనే ఉంది. ప్రపంచ మార్కెట్ల ధోరణి ఆధారంగా ఈ వారం పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు. కాని మార్కెట్లో కరెక్షన్ రావలసి ఉన్నందు వల్ల గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలి. 24,000 స్థాయిలో మరోసారి పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: తదుపరి నిరోధ స్థాయి 24,200. ఆ పైన 24,300. గతంలో ఇక్కడే మార్కెట్ విఫలమై కరెక్షన్‌లో పడింది. పాజిటివ్ ట్రెండ్‌ను మరింతగా కొనసాగించేందుకు ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. 24,000 వద్ద కన్సాలిడేషన్ ఉండవచ్చు.

బేరిష్ స్థాయిలు: 24,000 వద్ద విఫలమైతే బలహీనత సంకేతం ఇస్తుంది. మద్దతు స్థాయి 23,800. ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనపడుతుంది. మరో మద్దతు స్థాయి 23,500.

బ్యాంక్ నిఫ్టీ: గత కొద్ది వారాల్లో 7,000 పాయింట్ల మేరకు అద్భుతమైన ర్యాలీ సాధించిన ఈ సూచీలో కరెక్షన్ ఏర్పడాల్సి ఉంది. గత వారం 1,000 పాయింట్ల మేరకు దిగజారి 54,660 వద్ద ముగిసింది. మరింత పాజిటివ్ ట్రెండ్ కోసం తదుపరి నిరోధం 55,100 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మైనర్ మద్దతు స్థాయి 54,500 కన్నా పైన నిలదొక్కుకోవడంలో విఫలమైతే మరింత బలహీనపడుతుంది.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం 200 డీఎంఏల్లో పరీక్ష ఎదుర్కోనుంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. 23,800 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద విఫలమైతే మరింత బలహీనపడుతుంది. గత రెండు రోజుల్లో స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితిని సద్దుబాటు చేసుకుంటోంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి రివర్సల్ ఉంది. గత వారంలో టాప్ ఏర్పడినందు వల్ల ఈ వారంలో కెరక్షన్‌కు ఆస్కారం ఉంది.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24150, 24200
మద్దతు	23960, 23900



ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు; అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



మనసు కాలుతోంది

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. 'కేసీఆర్ పక్కకు పోగానే ఇంత ఆగమైతదా?' అని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ 11 ఏళ్లలో తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. మావోయిస్టులను ఏరివేసేందుకంటూ చేపట్టిన 'ఆపరేషన్ కగార్'ను వెంటనే ఆపాలని, ప్రజాస్వామ్యానికి అవకాశమిస్తూ నక్సలైట్లతో చర్చలు జరపాలని అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణకు ఎప్పుడూ నంబర్‌వన్ విలన్ కాంగ్రెస్ పార్టీయేనని, మోసపూరితమైన హామీలతో అధికారంలోకి వచ్చి రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని దెబ్బతీసిందని అన్నారు.

శ్రీరామచంద్రుని స్ఫూర్తితో..

"కన్నతల్లిని, జన్మభూమిని మించిన స్వర్గం ఏదీ లేదన్న శ్రీరామచంద్రుని స్ఫూర్తితో.. దిక్కుతోచని స్థితిలో, ఆత్మహత్యలకు ఆలవాలమై, వలసలకు నిలయమై, వలసవాదుల విషకౌగిలిలో చిక్కి నలిగిపోతున్న తెలంగాణ రాష్ట్రాన్ని విముక్తి చేయాలని, స్వరాష్ట్రం సాధించాలని నేను ఒక్కడిగా బయలుదేరిన. తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన. 25 ఏళ్ల క్రితం ఈ గులాబీ జెండా ఎగిరింది. ఈ జెండాను ఎందరో అవమానపరిచారు. అవహేళన చేశారు. అనేక త్యాగాలతో, ఆత్మ బలిదానాలతో ఎగిరిన జెండా... ఉద్యమ తరంగమై ఎగిసిపడింది. ఒకదశలో బరిగీసి.. బిడ్డా నా తెలంగాణను అక్కడ పెట్టు అని నిలబడినం. తద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. ప్రజలు దీవిస్తే పదేళ్ల పాటు ధగధగలాడే తెలంగాణను తయారుచేసినం. 25 ఏండ్ల సుదీర్ఘ చరిత్రతో ఈ వరంగల్ గడ్డమీద రజతోత్సవ సభను జరుపుకొంటున్నాం" అని కేసీఆర్ అన్నారు. 60 ఏండ్ల సమైక్య పాలనలో తెలంగాణ.. వేదనకు, దుఃఖం, హింస, అణచివేతకు గురైందని, ఆనాడు కాంగ్రెస్, టీడీపీలో ఉన్న ఇక్కడి నేతలు.. పదవుల కోసం పెదవులు మూసుకున్నారే తప్ప.. ఏనాడూ నోరు తెరిచి మాట్లాడలేదని, గులాబీ జెండా ఎగిరే దాకా సోయిని ప్రదర్శించలేదని ధ్వజమెత్తారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శాసనసభలో.. తెలంగాణ పదాన్ని నిషేధించారని తెలిపారు. ఆనాడైనా, ఈనాడైనా తెలంగాణకు విలన్ నెంబర్‌వన్ కాంగ్రెస్ పార్టీయేనని కేసీఆర్ అన్నారు. "తెలంగాణ హైదరాబాద్ రాష్ట్రంలో ఉన్నప్పుడు బలవంతంగా ఆంధ్రాలో విలీనం చేసింది కాంగ్రెస్ పార్టీ.. జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం. 1969లో ఉద్యమం వస్తే.. 400 మంది తెలంగాణ బిడ్డల్ని పిట్టల్లా కాల్చి చంపింది ఆనాడు ఉన్న ఇందిరాగాంధీ ప్రభుత్వం. మళ్లీ 2001 నుంచి మనం విజృంభిస్తే మళ్లీ ఇదే కాంగ్రెస్ పార్టీ 14 ఏళ్లు ఏడిపించింది. నా నిరాహార దీక్ష, ప్రజల భయంకరమైన పోరాటం కారణంగా రాజకీయ అవసరాల కోసం ఇష్టం లేకపోయినా తెలంగాణ ఇచ్చింది" అని కేసీఆర్ వివరించారు.

అధికారాన్ని బాధ్యతగా తీసుకున్నాం..

ప్రజలిచ్చిన అధికారాన్ని పదవులు అనుభవించడానికి కాకుండా.. బాధ్యతగా తీసుకున్నామని కేసీఆర్ అన్నారు. ఎక్కడున్న తెలంగాణను ఎక్కడికి తీసుకెళ్లామో ప్రజలకు తెలుసునని, అనేక రంగాల్లో అవార్డులు వచ్చాయని, అద్భుతాలు సృష్టించామని తెలిపారు. అబద్ధాలు చెప్పడంలో కాంగ్రెస్‌ను మించినోడు లేడని, ఇక్కడున్నోళ్లు చాలరన్నట్లుగా డూప్లికేట్ గాంధీలు ఢిల్లీ నుంచి దిగివచ్చి చప్పట్లు కొట్టి డ్యాన్సులు చేశారని విమర్శించారు. రైతుబంధు, పింఛన్లు పెంచుతామని మోసం చేశారని, ఆడపిల్లలు స్కూటీలు, విద్యార్థులకు రూ.5 లక్షల బ్యాంకు గ్యారెంటీ కార్డులు, కల్యాణలక్ష్మికి అదనంగా తులం బంగారం, పంటలకు రూ.500 బోనస్, రూ.2 లక్షల రుణమాఫీ.. ఇలా 420 హామీలు ఇచ్చి ఎగ్గొట్టారని మండిపడ్డారు. ఉచిత బస్సు పథకం పెడితే.. మహిళలు జుట్లు పట్టుకొని కొట్టుకునేందుకే ఉపయోగపడుతోందన్నారు. కాంగ్రెస్ నేతలు తమపై అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారని కేసీఆర్ మండిపడ్డారు. "మా అంత సిపాయిలు లేరని చెబితే.. జనం నమ్మిండ్లు, బోల్తా పడ్డరు. గల్లంతైండ్లు. ప్రజలను దగాచేసి, మంచిగున్న తెలంగాణను ఆగం చేసిండ్లు" అని ధ్వజమెత్తారు. పేదలన్నాక ఎక్కడో ఒకచోట గుడిసెలు వేసుకుంటారని, చిన్నగా ఇళ్లు కట్టుకుంటారని కేసీఆర్ అన్నారు. అలాంటి వారిని గుర్తించి తాము లక్షలాది ఇంటి పట్టాలు ఇస్తే ఇపుడు హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూలగొట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోనే తెలంగాణను నంబర్‌వన్ స్థాయికి తాము తీసుకెళితే.. ఇప్పుడు 14వ స్థానానికి దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన వారికి సమయం ఇవ్వాలనే తాను ఇన్నాళ్లూ మాట్లాడలేదని, ఇక అడగాల్సిన సమయం వచ్చిందని అన్నారు. భూముల అమ్మకం తప్పు కాదని, ప్రజలకు మేలు చేసేందుకు అమ్మవచ్చునని, కానీ.. ఏది అమ్మాలో, ఏది అమ్మకూడదు అనే విచక్షణ ఉండాలని కేసీఆర్ హితవు పలికారు. యూనివర్సిటీ భూములను ఎలా అమ్మేస్తారని మండిపడ్డారు. మంచి పథకాలను ఏ నాయకుడు పెట్టినా కొనసాగించాలని, కేసీఆర్ కిట్‌ను ఎందుకు బంద్ చేశారని ప్రశ్నించారు.

పోలీసులూ.. మీ డైరీలో రాసుకోండి..

పోలీసులకు రాజకీయాలెందుకని కేసీఆర్ ప్రశ్నించారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని, ఈ విషయాన్ని పోలీసు మిత్రులు తమ డైరీల్లో రాసుకోవాలని అన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా సైన్యంపై అడ్డగోలుగా కేసులు పెట్టి అరెస్టు చేయడాన్ని మానుకోవాలని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 20-30 శాతం కమీషన్లు తీసుకుంటోందని కేసీఆర్ ఆరోపించారు. స్వయంగా ఆర్థికమంత్రి వద్దకు వెళ్లిన కాంట్రాక్టర్లే ఈ విషయం చెబుతున్నారని అన్నారు. "కేసీఆర్.. అసెంబ్లీకి రా.. అంటున్నరు. పిల్లలు అడిగితేనే జవాబు చెప్పడంలేదు. 20 శాతం కమీషన్ తీసుకుంటున్నరని కేటీఆర్ అనగానే.. ఆర్థిక మంత్రి భుజాలు తడుముకున్నారు. అసెంబ్లీలో పెద్ద గోల పెడుతున్నారు" అని కేసీఆర్ వ్యాఖ్యానించారు.

ఆపరేషన్ కగార్ ఆపాలి..

కేంద్రంలో 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు 11 రూపాయలైనా ఇచ్చిందా? అని కేసీఆర్ ప్రశ్నించారు. ఒక్క ప్రాజెక్టుకైనా జాతీయ హోదా ఇచ్చారా? అని నిలదీశారు. పైగా తెలంగాణను ఉద్దేశించి ప్రధాని మోదీ ఎన్నోసార్లు తల్లిని చంపి బిడ్డను బతికించారంటూ వ్యాఖ్యానించారని విమర్శించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో యువకులను, గిరిజనులను ఊచకోత కోస్తోందని, ఇది ధర్మం కాదని అన్నారు. బలముందని చంపుకొంటూ వెళ్లడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వంతో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు ప్రతిపాదన పెడుతున్నారని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి.. ప్రజాస్వామ్యానికి అవకాశమిస్తూ మావోయిస్టులతో చర్చలు జరపాలని సూచించారు. ఈ మేరకు సభలో తీర్మానం పెడుతున్నానని, చప్పట్లతో ఆమోదం తెలపాలని సభికులను కోరారు. "మీ ఆమోదాన్నే తీర్మానంగా భావించి కేంద్రానికి లేఖ పంపుతాం" అని అన్నారు. "కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే.. ఇంత పెద్దసంఖ్యలో సభకు కదలి వచ్చారంటే.. మీరు కూడా ఒక నిర్ణయానికి వచ్చారని అర్థమవుతోంది. అందరూ ధైర్యంగా ఉండండి. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెచ్చుకుందాం. చిరునవ్వులు చిందించే తెలంగాణను తయారుచేసుకుందాం" అని అన్నారు.

ప్రభుత్వాన్ని మేమెందుకు పడగొడతాం?

"మీ ప్రభుత్వాన్ని మేమెందుకు పడగొడతాం? అలాంటి కిరికిరి పనులు మేం చేయబోం. ప్రజలు మీకు ఓట్లేశారు. ఆశించిన విధంగా పనిచేయకపోతే.. వారే వీపులు సాపు చేస్తారు" అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో వేదిక ముందున్న కార్యకర్తలు సీఎం.. సీఎం అంటూ నినాదాలు చేయడంతో ఆయన చిరాకుపడ్డారు. ప్రసంగాన్ని ఆటంకపరుస్తున్నారంటూ వీళ్లు మన కార్యకర్తలేనా? అని కోపగించుకున్నారు. సాయంత్రం 6.58 గంటలకు ప్రసంగం ప్రారంభించిన కేసీఆర్ 7.58 గంటలకు ముగించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్వాగతోపన్యాసం చేయగా.. కేసీఆర్ ఒక్కరే రజతోత్సవ సభలో ప్రసంగించారు. ప్రసంగం మొత్తంలో కాంగ్రెస్‌పై విమర్శలు తప్ప.. సీఎం రేవంత్‌రెడ్డి పేరునుగానీ, ఇతర నేతల పేర్లను గానీ ప్రస్తావించలేదు. కేసీఆర్ ప్రసంగానికి ముందు.. కశ్మీర్‌లో ఇటీవల ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారి ఆత్మశాంతి కోసం సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది.

మరో 25 ఏళ్లు ప్రజాసేవలో బీఆర్ఎస్

కొండాలక్ష్మణ్, జయశంకర్ మాకు స్ఫూర్తి: కేటీఆర్

హైదరాబాద్/కవాడిగూడ/గన్‌పార్క్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ పార్టీగా ఆవిర్భవించి.. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, అధికారం చేపట్టాక.. తెలంగాణ ప్రగతి కోసం నిరంతరం పాటుపడుతూ.. బీఆర్ఎస్ 25 ఏళ్ల తన ప్రస్థానం సాగించిందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. 25 ఏళ్లు పూర్తిచేసుకొని.. నిర్విరామంగా కృషి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ... అమరులు, పెద్దలు, తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో మరో 25 ఏళ్లు తెలంగాణలో ప్రజాసేవలో కొనసాగే అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం తెలంగాణ భవన్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ గులాబీ జెండాను ఆవిష్కరించారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి ఆయన నివాళులు అర్పించారు. అనంతరం గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరుల స్థూపం వద్దకు చేరుకొని నివాళులర్పించారు. ఆ తర్వాత ట్యాంక్‌బండ్ వద్ద కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి కేటీఆర్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండాలక్ష్మణ్ బాపూజీ, ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితోపాటు పార్టీ అధినేత కేసీఆర్ అందించిన నాయకత్వమే.. 25 ఏళ్ల బీఆర్ఎస్ ప్రస్థానానికి ప్రధానం కారణమన్నారు. గులాబీ జెండాకు ఏ గడపా దొరకని కాలంలో తన గడపను ఇచ్చి, కొండంత అండగా నిలిచిన కొండాలక్ష్మణ్ బాపూజీకి వినమ్రంగా నివాళి అర్పిస్తున్నానని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి, బీఆర్ఎస్ ప్రస్థానానికి ఆ ఇద్దరు ప్రముఖులు మూలస్తంభాలని కొనియాడారు. ఆనాడు ఒకరితో ప్రారంభమైన పార్టీ.. లక్షల మందితో బలోపేతమై తెలంగాణను సాధించిందన్నారు.

తిరుగు ప్రయాణంలో గంటల కొద్దీ ట్రాఫిక్‌జాం

ఎల్కతుర్తి/వరంగల్ క్రైం/ వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జనం ప్రవాహంలా తరలొచ్చారు. ఈ సభకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు వివిధ జిల్లాల నుంచి పార్టీ శ్రేణులు సైకిళ్లు, ఎడ్లబండ్లు, వాహనాల్లోనే కాకుండా పాదయాత్రగానూ చేరుకున్నారు. అయితే సభకు తరలి వచ్చే, తిరుగు ప్రయాణ సమయంలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. కరీంనగర్, వరంగల్, సిద్దిపేట నుంచి వచ్చే వాహనాలు సభాస్థలికి 4 నుంచి 5 కిలోమీటర్ల దూరంలోనే ఆగిపోయాయి. రాత్రి 8గంటలకే సభ పూర్తయినా.. రాత్రి 11:30గంటలవరకు ఎల్కతుర్తితో పాటు ఆయా మార్గాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.సభా ప్రాంగణం దాదాపు నిండినా వెనుక భాగంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. దీన్ని ముందే గ్రహించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పలుమార్లు వేదికపై నుంచి ఖాళీ కుర్చీలు కనిపించడానికి కారణం ట్రాఫిక్ జామ్ అంటూ పదే పదే చెప్పారు. కేసీఆర్ సభలో పోలీసులు చేతులెత్తేయడంతో ప్రజలను అదుపు చేయడం బీఆర్ఎస్ కార్యకర్తల వల్ల కాలేదు. 1100 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నామని కమిషనరేట్ కార్యాలయం నుంచి ప్రకటించినప్పటికీ సభ ప్రాంగణం సమీప ప్రాంతాల్లో 50 నుంచి 100 మంది కూడా కనిపించకపోవడం గమనార్హం. సభ ముగిసిన అనంతరం తిరుగు ప్రయాణంలో పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. ఎల్కతుర్తి నుంచి ఎటు వైపుచూసినా సుమారు 10 కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ స్తంభించింది. సభకు వచ్చిన ప్రజలతో పాటు సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

అడ్డంకులు కల్పించినా సభ సక్సెస్: కేటీఆర్, హరీశ్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం అయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. సభను సక్సెస్ చేసిన నాయకులు, కార్యకర్తలకు ఆదివారం ఎక్స్ వేదిక ద్వారా వారు ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ వచ్చి నిలదీస్తడు అనగానే కాంగ్రెస్ ప్రభుత్వానికి వణుకు పుట్టి అడుగడుగునా ఆటంకాలు కల్పించిందని హరీశ్ రావు అన్నారు. పది, పదిహేను కిలోమీటర్లు కాలినడకన నడిచి సభాస్థలికి రావాల్సిన పరిస్థితి కల్పించారని, అయినా లక్షల మంది హాజరై సభను విజయవంతం చేశారని ఆయన తెలిపారు.





సభావేదికపై నుంచి కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కేటీఆర్, హరీశ్



కుమరం భీం జిల్లా దహెగాంలో ధాన్యం తడవకుండా కవర్లు వేస్తున్న రైతులు



కుమరం భీం జిల్లా పెంచికలపేటలో నేలకొరిగిన వరి

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

వివిధ జిల్లాల్లో వాన.. ఈదురుగాలుల బీభత్సం.. నారాయణపేటలో పిడుగుపాటుకు ఇద్దరి మృతి

- ధాన్యం కాపాడుకునే ప్రయత్నంలో ఒకరు, పొలం పనుల్లో ఉండగా మరొకరు మృత్యువాత
- పలుచోట్ల పిడుగులకు బలైన మూగజీవాలు
- ఈదురుగాలులకు కూలిన చెట్లు, స్తంభాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

మండువేసవిలో అకాలవర్షం మరోసారి రైతులను నష్టాల పాల్జేసింది. శనివారం రాత్రి, ఆదివారం కురిసిన వర్షానికి పలుచోట్ల వరి నేలకొరిగింది. ఇంకొన్నిచోట్ల కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. నారాయణపేట జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఈ జిల్లాతో పాటు జోగుళాంబ గద్వాల జిల్లాలో పిడుగులు పడి అనేక మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. వివిధ జిల్లాల్లో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. సోమవారం వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో శనివారం రాత్రి, ఆదివారం అకాల వర్షం, పిడుగులు బెంబేలెత్తించాయి. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో ఆదివారం మధ్యాహ్నం పిడుగులు పడి ఇద్దరు యువకులు మృతిచెందారు. ఉప్పర్‌పల్లికి చెందిన పట్నం ఆంజనేయులు (36) పొలంలోని కల్లంలో ఆరబెట్టిన ధాన్యంపై కవర్లు కప్పుతుండగా పిడుగు పడి మృతిచెందాడు. దాదన్‌పల్లికి చెందిన యువకుడు కురుమూర్తి (17) పొలం పనుల్లో నిమగ్నమై ఉండగా పిడుగుపాటుకు ప్రాణాలు కోల్పోయాడు. నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో పలు గ్రామాల్లో పిడుగులు పడి 2 ఆవులు, 2 ఎద్దులు, 2 గేదెలు, కోడెదూడ, 15 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మేకలసోంపల్లిలో ఓ ఇల్లు పిడుగు పడి పాక్షికంగా దెబ్బతిన్నది. ఇంట్లో వారు క్షేమంగా ఉన్నారు. గద్వాల, ధరూరు, కేటీదొడ్డి మండలాలతో పాటు వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలోని కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరారు. నారాయణపేట జిల్లా మాగనూరు సమీపంలో 167వ జాతీయ రహదారిపై 11 కేవీ, 33 కేవీ విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. తాళంకేరిలో ఇళ్ల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం, పెంచికలపేట, జగిత్యాల జిల్లా మెట్‌పల్లి, కోరుట్ల మండలాల్లో శనివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దహెగాం మండలం గిరివెల్లి, ఖర్జీ తదితర గ్రామాల్లో వరి నేలకొరిగింది. పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. అయినం గ్రామంలో ఈదురుగాలులకు నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. కోరుట్ల మండలలో మామిడి నేలరాలడంతో రైతులకు నష్టం వాటిల్లింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, వలిగొండ, భువనగిరి మండలాల్లో ఆదివారం అకాల వర్షం కురిసింది. చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం రాశులు తడిసిపోయాయి.


ఎండ తీవ్రత పెరుగుతుంది!

రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి.. 37 నుంచి 40 డిగ్రీల్లోపే నమోదైనా.. సోమవారం నుంచి ఎండ తీవ్రత పెరుగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 43-45 డిగ్రీల మధ్య నమోదవుతుందని తెలిపింది. కాగా ఆదివారం హైదరాబాద్‌లో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. నిన్నటి వరకు 41-42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవ్వగా.. ఆదివారం ఒకేసారి 4-5 డిగ్రీలు తగ్గింది. కాగా, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో వడదెబ్బ తగిలి చికిత్సపొందుతున్న ఇద్దరు ఆదివారం మృతిచెందారు.

మన వైభవం చాటి చెప్పేలా

తెలంగాణ ఖ్యాతిని మిస్ వరల్డ్.. పోటీదారులకు చూపేలా ప్రణాళిక

- మే 12న అతివల బుద్ధ వనం పర్యటన
- 13న చార్మినార్, లాడ్ బజార్ సందర్శన
- 14న రామప్ప ఓరుగల్లు కోటకు పయనం



హైదరాబాద్/హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యమిస్తున్న తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేందుకు రాష్ట్ర సర్కారు కృషి చేస్తోంది. ఇక్కడి కళలు, సంస్కృతి, వారసత్వ సంపదను విదేశీ అతిథులకు పరిచయం చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా వివిధ దేశాల నుంచి వచ్చే సుందరీమణులు, ఆయా రాజ్యాల ప్రతినిధులు రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన ప్రాంతాల్లో పర్యటించేలా పర్యాటక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయం, హైదరాబాద్ ముఖ చిత్రంగా ఉన్న చార్మినార్, చేనేత ఇక్కత్ కళకు పేరుగాంచిన పోచంపల్లి, ఆచార్య నాగార్జునుడు నడయాడిన బుద్ధవనం వంటి చారిత్రక ప్రాంతాలను సందర్శించేలా పర్యాటక శాఖ ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా ఆగ్నేయాసియా నుండి వచ్చే మిస్ వరల్డ్ ప్రతినిధులు మే 12 బుద్ధ పూర్ణిమ సందర్భంగా బుద్ధ వనాన్ని సందర్శించనున్నారు. కృష్ణా నదీ తీరంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రత్యేక ప్రార్థనల్లో వారు పాల్గొంటారు. బుద్ధుని జీవిత చరిత్ర, బౌద్ధ మత సంప్రదాయాలు సహా బౌద్ధానికి సంబంధించిన అనేక విషయాలను వారు తెలుసుకోనున్నారు. ఇక, మే 13న మిస్ వరల్డ్ పోటీదారులు చార్మినార్ వద్ద పర్యటిస్తారు. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన చార్మినార్ వైభవాన్ని తిలకించడంతో పాటు అక్కడి లాడ్ బజార్‌లో లభ్యమయ్యే ముత్యాలు, లక్కగాజుల కేంద్రాలను సందర్శించేలా 13 సాయంత్రం చార్మినార్ వద్ద పర్యాటక అధికారులు హెరిటేజ్ వాక్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మే 13న సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు చార్మినార్ నుంచి లాడ్‌బజార్, మోతి గల్లీ మీదుగా హెరిటేజ్ వాక్‌ను చౌమహల్లా ప్యాలెస్ వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నారు. చౌమహల్లా ప్యాలెస్‌లో మిస్ వరల్డ్ పోటీదారుల ఫొటో షూట్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే సూఫీ, ఖవ్వాలీ సంగీతంతో పాటు తెలంగాణ జాన పద సంగీత నృత్య ప్రదర్శనలు మిస్ వరల్డ్ పోటీదారులను అలరించనున్నాయి.

ఓరుగల్లు కోటకూ మిస్ వరల్డ్ వనితలు..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మే 14న మిస్ వరల్డ్ పోటీదారుల బృందం ఒకటి ములుగు జిల్లాలోని రామప్ప ఆలయానికి వెళుతుంది. మరో బృందం వరంగల్‌లోని వేయి స్తంభాల ఆలయం, ఓరుగల్లు కోట సందర్శనకు వెళుతుంది. ఈ రెండు బృందాలు సాయంత్రం హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శిస్తాయి. కాగా, మిస్ వరల్డ్ ప్రతినిధులు తొలుత రామప్పతో పాటు కాళోజీ కళాక్షేత్రాన్ని చూసేలా అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. చారిత్రక వేయి స్తంభాల ఆలయం, వరంగల్ కోట ప్రాంతాలను ఆ జాబితాలో చేర్చకపోవడంపై ప్రజల్లో చర్చ జరిగింది. ఈ క్రమంలో ఏప్రిల్ 21న 'ఆంధ్రజ్యోతి' ఉమ్మడి వరంగల్ జిల్లా సంచికలో 'కోట కానరాలేదా' శీర్షికన కథనం ప్రచురితమైంది. అది ప్రజల్లో విస్తృత చర్చకు దారితీసింది. దీంతో స్పందించిన పర్యాటక శాఖ అధికారులు సుందరీమణుల పర్యటన షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేశారు.

బీఆర్ఎస్ సభ నుంచి వస్తున్న వాహనం ఢీకొని ఇద్దరి మృతి

సిద్దిపేట జిల్లా రాంపూర్ క్రాసింగ్ వద్ద రోడ్డు ప్రమాదం

నంగునూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాంపూర్ క్రాసింగ్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ నుంచి వస్తున్న ఓ జీపు(తుఫాన్) ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్‌కు చెందిన తాడం సారయ్య(36), బండోజు గణేష్ (32)వడ్రంగి పని చేస్తుంటారు. సిద్దిపేటలో పని ముగించుకుని ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరుగుప్రయాణమయ్యారు. అయితే, బీఆర్ఎస్ రజతోత్సవ సభ నుంచి వస్తున్న నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన తుఫాన్ వాహనం.. రాంపూర్ క్రాసింగ్ వద్ద వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో సారయ్య అక్కడికక్కడే మరణించగా, గాయపడిన గణేష్ ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఇక, ఈ రోడ్డు ప్రమాదం వల్ల రహదారిలో చాలాసేపు ట్రాఫిక్ స్తంభించింది. మృతుల కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున ఆర్థికసాయం అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. బీఆర్ఎస్ తరఫున రూ.50లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.





ప్రమాదానికి కారణమైన వాహనం; ప్రమాద అనంతరం ఘటనాస్థలిలో పరిస్థితి


సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కతో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు

ప్రపంచానికి దిక్సూచి తెలంగాణ: సీఎం రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలోనే కాదు.. ప్రజాస్వామ్య పునరుజ్జీవనంలో సైతం ప్రపంచానికి దిక్సూచి తెలంగాణ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్ వేదికగా హెచ్ఐసీసీలో 2 రోజుల పాటు జరిగిన భారత్ సమ్మిట్-2025 ముగిసిన నేపథ్యంలో ఆదివారం 'ఎక్స్'లో స్పందించారు. 'తెలంగాణ వేదికగా వందకు పైగా దేశాలు.. వందల ఆలోచనల సంఘర్షణలు.. లక్ష్యం ఒక్కటే.. ప్రపంచ ప్రజాస్వామ్యానికి ప్రాణం పోయడం. ప్రజల హక్కుల్లో.. సమానత్వాన్ని చాటడం. రాహుల్‌గాంధీ దిశానిర్దేశంలో.. అభివృద్ధిలోనే కాదు.. ప్రజాస్వామ్య పునరుజ్జీవనంలో సైతం.. ప్రపంచానికి దిక్సూచి తెలంగాణ' అని పోస్టులో పేర్కొన్నారు. భారత్ సమ్మిట్ వీడియోను దానికి ట్యాగ్ చేశారు. కాగా, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి, కమిషన్ సభ్యులు సీఎంను జూబ్లీహిల్స్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషన్ చైర్‌పర్సన్‌గా, సభ్యులుగా బాధ్యతలు తీసుకున్న వారికి సీఎంతో పాటు అక్కడే ఉన్న మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు.

చైనాకు దీటుగా వరి దిగుబడి పెరగాలి

» ఐసీఏఆర్ మాజీ డీజీ డాక్టర్ ఆర్ఎస్ పరోడా

రాజేంద్రనగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చైనాలో వరి సగటు దిగుబడి హెక్టారుకు 6 టన్నులు కాగా, భారత్‌లో హెకార్టుకు 3.5 టన్నుల దిగుబడి మాత్రమే ఉందని, ఈ గ్యాప్‌ను మేలైన వంగడాలు, సాగు నిర్వహణ పద్ధతుల ద్వారా భర్తీ చేయాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) పూర్వ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజేంద్రసింగ్ పరోడా అన్నారు. ఐసీఏఆర్ భాగస్వామ్యంతో రాజేంద్రనగర్‌లోని భారత వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్)లో మూడు రోజుల పాటు జరుగనున్న వరి పరిశోధకుల గోల్డెన్ జూబ్లీ బృంద సమావేశాలను ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగిలాల్ జాట్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సమావేశాలకు వివిధ రాష్ట్రాల నుంచి 500 మంది వరి పరిశోధకులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రాజేంద్రసింగ్ పరోడా మాట్లాడుతూ.. పంజాబ్ రైతులు హైబ్రీడ్ వరి సాగును నిలిపివేశారని, అందుకు గల కారణాలను అన్వేషించి వాటి పరిష్కారానికి మార్గాలు చూపి అక్కడ హైబ్రీడ్ వరి సాగును పెంచే దిశగా కార్యచరణతో ముందుకు సాగాలన్నారు. డాక్టర్ మంగిలాల్ జాట్ మాట్లాడుతూ.. ప్రాంతాల వారీగా భారత్‌లోని వ్యవసాయ, ఆహార వ్యవస్థలపై దృష్టి కేంద్రీకరించాలని శాస్త్రవేత్తలకు సూచించారు.

మంత్రి తుమ్మలతో జార్ఖండ్ మంత్రి శిల్పి నేహ భేటీ

» రెండు రాష్ట్రాల్లో వ్యవసాయ పథకాలపై చర్చ

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను జార్ఖండ్ వ్యవసాయశాఖ మంత్రి శిల్పి నేహ తెలుసుకున్నారు. ఆదివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఆమె భేటీ అయ్యారు. ఇరువురు మంత్రులు పరస్పరం తమ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న రైతు పథకాలపై చర్చించారు. రాష్ట్రంలో అమలవుతున్న రైతు సంక్షేమ పథకాలను శిల్పి నేహకు మంత్రి తుమ్మల తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహంతోపాటు దాన్ని లాభదాయక పంటగా తీర్చిదిద్దడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఇక వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధస్సు వినియోగం, కొత్త పథకాలు, రైతులకు లాభదాయకం చేసే విధానాల అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు హార్టికల్చర్ రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ఆ రంగ ఉత్పత్తులకు మార్కెటింగ్ పరిష్కారాలను వెల్లడించారు. రాష్ట్ర బడ్జెట్‌లో సింహభాగం రైతులకు కేటాయించామని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఏకకాలంలో రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ పూర్తి చేశామని మంత్రి తుమ్మల చెప్పారు. రూ.20,616 కోట్లతో 25,35,964 మంది రైతులను రుణ విముక్తులను చేశామన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

» దశలవారీగా పెండింగ్ సమస్యల పరిష్కారం: పొన్నం

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని అందుకు రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యానికి సహకారం అందిస్తుందని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను దశలవారీగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. లక్డీకపూల్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం టీజీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఐదో వార్షిక సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 90 ఏళ్లు నిండిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులను సంస్థ ఎండీ వీసీ సజ్జనర్‌తో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ప్రజా రవాణా వ్యవస్థ మేలు కోసం రిటైర్డ్ అధికారులు, ఉద్యోగులు చేసిన సేవలు గొప్పవని కొనియాడారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం, ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సౌకర్యం, సంస్థ పరిరక్షణ, ఈ మూడు అంశాలే ప్రాధాన్యాలుగా సంస్థ ముందుకు పోతోందని చెప్పారు. ఏడాది కాలంలో ఉద్యోగులు సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే కొత్త బస్సుల కొనుగోలు చేపట్టినట్లు వివరించారు. కొత్త బస్సులకు అనుగుణంగా ఉద్యోగ నియామకాలను చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఆర్టీసీ ఎండీ సజ్జనర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సలహాలు, సూచనలతో సంస్థలో వినూత్న కార్యక్రమాలను ప్రవేశపెట్టామని తెలిపారు.

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

» సీఎం రేవంత్‌రెడ్డికి ఎంపీ ఆర్.కృష్ణయ్య లేఖ

రాంనగర్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): డిగ్రీ చదువుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజు బకాయిలు 4 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. బీసీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పలు కళాశాల యాజమాన్యాలు ఫీజుల పేరిట విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. ఆర్థిక మంత్రిని, అధికారులను కలిసినా నిధులు లేవంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ చొరవ తీసుకుని ఫీజుల బకాయిల నిధులు మంజూరు చేయాలని కోరారు.

తెలంగాణ ఇచ్చినందుకు..

కాంగ్రెస్ విలనా?

సోనియాగాంధీకి చేసిన సాష్టాంగ నమస్కారం మర్చిపోయారా?

» కాంట్రాక్టర్లు, సర్పంచ్‌ల బకాయిలు.. కేసీఆర్ హయాంలోవే: పొంగులేటి

» నియంతలా కేసీఆర్ మాటలు: సీతక్క

» సోనియా చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయాలి: పొన్నం ప్రభాకర్


సీఎం నివాసం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న పొంగులేటి, జూపల్లి, సీతక్క, పొన్నం

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మన సంతా విషాన్ని నింపుకొన్న కేసీఆర్.. కాంగ్రెస్ పార్టీని విలన్‌గా చూపించే ప్రయత్నం చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ రాష్ట్రం ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీని విలన్‌గా చూపిస్తున్నారా? అని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీకి కేసీఆర్ సాష్టాంగ నమస్కారం చేసిన సంగతి మరిచిపోయారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టి, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు ఇవ్వట్లేదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అన్ని అంశాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమా? అని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. ఆదివారం సీఎం రేవంత్ నివాసం వద్ద మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, సీతక్కలతో కలిసి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు దళితుడిని సీఎం చేయలేకపోయిన కేసీఆర్.. ఇప్పుడు కనీసం ప్రతిపక్ష నేత హోదా అయినా దళితుడికి ఇచ్చి ఉండవచ్చు కదా అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లకు ప్రభుత్వ బకాయిలు పేరుకుపోయాయని చెప్పారు. 80 వేల పుస్తకాలు చదివిన కేసీఆర్.. ఆ జ్ఞానాన్ని అసెంబ్లీలో ప్రదర్శిస్తారనుకున్నామని, కానీ రాలేదని ఎద్దేవా చేశారు. "బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని కేసీఆర్ కలలు కంటున్నారు. కేసీఆర్ హయాంలో కాంగ్రెస్ పార్టీ సభలకు రాకుండా ఆటోడ్రైవర్లను, ప్రైవేటు టాక్సీ డ్రైవర్లను ఇబ్బంది పెట్టారు. ఆర్టీసీ బస్సులు అద్దెకు తీసుకోనివ్వకుండా చేశారు. మేము అలా ఇబ్బంది పెట్టాలనుకుంటే కేసీఆర్ సభ జరిగి ఉండేదే కాదు.." అని పొంగులేటి స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి, ట్యాపింగ్ చేసిన వారిని విదేశాల్లో ఉంచి డ్రామాలాడుతున్న కేసీఆర్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతికత లేదని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్డును దగ్గరి వాళ్లకు లీజుకు ఇచ్చుకున్నదెవరని.. మద్యం దుకాణాల టెండర్లను ముందే ఎందుకు పిలిచారని ప్రశ్నించారు. ఒక నియంత తన అధికారాన్ని కోల్పోయిన తర్వాత మాట్లాడినట్టుగా కేసీఆర్ ప్రసంగం ఉందని మంత్రి సీతక్క విమర్శించారు. వారి కుటుంబంలో చీలికలు పెరుగుతున్నాయన్న బాధ కేసీఆర్‌లో కనిపించిందని పేర్కొన్నారు. కేసీఆర్ బిడ్డ కవిత ఖరీదైన కార్లలో తిరగొచ్చుగానీ.. పేద మహిళలు ఆర్టీసీ బస్సుల్లో తిరగొద్దా? అని నిలదీశారు. అసెంబ్లీ సమావేశాలను సొల్లు కబుర్లంటూ అవమానించిన కేసీఆర్‌కు.. మళ్లీ అసెంబ్లీకి వచ్చే అర్హత ఉందా? అని నిలదీశారు. మరి ఆయన కొడుకు, అల్లుడిని అసెంబ్లీకి ఎందుకు పంపుతున్నారని ప్రశ్నించారు.

ఆ మాటలు ఉపసంహరించుకోవాలి: పొన్నం

తెలంగాణ పాలిట విలన్ కాంగ్రెస్ పార్టీ అన్న కేసీఆర్ మాటలను ఉపసంహరించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోనియాగాంధీ తప్ప తెలంగాణ రాష్ట్రాన్ని ఎవరూ ఇవ్వలేరన్న సంగతి కేసీఆర్‌కు తెలుసని చెప్పారు. సోమవారం అన్ని జిల్లా కేంద్రాల్లో సోనియా గాంధీ చిత్రపటాలకు పాలతో అభిషేకం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేసీఆర్ సభకు జనం రాకుంటే.. ఆ నెపం పోలీసులు, ప్రభుత్వంపైకి నెట్టడం ఏమిటని నిలదీశారు. జనం రాకపోవడం వల్లే.. కేసీఆర్ అర గంట సేపు వేదికపైకి రాలేదన్నారు.

కేసీఆర్ ఇంట్లో వేల కోట్లు: జూపల్లి

కేసీఆర్ హయాంలో జరిగిన రుణమాఫీ వడ్డీలకే సరిపోలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. అక్షయపాత్ర లాంటి ఔటర్ రింగ్ రోడ్డును కేసీఆర్ అమ్ముకున్నారని ఆరోపించారు. అధికారం పోయినా కేసీఆర్‌లో గర్వం పోలేదని విమర్శించారు. కేసీఆర్ నిజాయతీపరుడైతే ఆయన పార్టీకి రూ. 1,500 కోట్ల ఫండ్ ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలన్నారు. కేసీఆర్ హయాంలో పనిచేసిన ఇంజనీర్ దగ్గరే రూ.వంద కోట్లపైగా ఆస్తులు దొరికాయని.. కేసీఆర్ ఇల్లును సోదా చేస్తే రూ. వేల కోట్లు దొరుకుతాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సభలో కేసీఆర్ ప్రసంగంలో స్వయం డబ్బా, పరనింద తప్ప ఏమీ లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఒక ప్రకటనలో విమర్శించారు. కేసీఆర్ రెచ్చగొడితే రెచ్చిపోడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా లేరని పేర్కొన్నారు. కేసీఆర్‌కు సీఎం పదవే కాంగ్రెస్ పెట్టిన భిక్ష అని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దక్షిణంలోనూ అధికారంలోకి వస్తాం

అభివృద్ధే ధ్యేయంగా మోదీ పాలన

అంబేడ్కర్ ఆశయాలే స్ఫూర్తి: కిషన్ రెడ్డి



విజయవాడ(విద్యాధరపురం), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ధ్యేయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పనిచేస్తున్నారని, దక్షిణ భారతదేశంలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం విజయవాడలోని ఎస్-కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన మేధావుల సదస్సులో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ జయంతిని ఏప్రిల్ 14నే కాకుండా పదిరోజుల పాటు దేశవ్యాప్తంగా నిర్వహించాలని బీజేపీ నిర్ణయించిందన్నారు. దేశభక్తి కలిగిన వ్యక్తి అంబేడ్కర్ అని, కమ్యూనిస్టు సిద్ధాంతాలను కాదన్నందుకు ఆయనను ఓడించాలని, అవమానపరచాలని అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. అంబేడ్కర్ ఎంపీగా పోటీచేస్తే ఓడించాలని నెహ్రూ విస్తృతంగా ప్రచారం చేశారన్నారు. రాజ్యాంగాన్ని అవమానపరిచేలా కాంగ్రెస్ వ్యవహరించిందని, అధికారాన్ని నిలుపుకోవటం కోసం రాజ్యాంగాన్ని తనకు అనుకూలంగా మార్చుకుందని విమర్శించారు. అంబేడ్కర్ ఆశయాల స్ఫూర్తితోనే బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. అంబేడ్కర్ అంతిమ సంస్కారం జరిగిన పంచతీర్థ స్థలాన్ని అద్భుతంగా తీర్చిదిద్దామని, పార్లమెంటులో అంబేడ్కర్ చిత్రపటాన్ని పెట్టి గౌరవించిన ఘనత మోదీకే దక్కుతుందని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చాకే అంబేడ్కర్‌కు భారత రత్న ఇచ్చిందన్నారు. ఆయుష్మాన్ భారత్ పేరుతో మోదీ పేద ప్రజలకు రక్షణ కల్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్‌రెడ్డి, అధికార ప్రతినిధి ఆర్‌డీ విల్సన్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌పై న్యూడెమోక్రసీ నిరసన



ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలు

హైదరాబాద్, చిక్కడపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, కర్రెగుట్టలో నరమేధాన్ని ఆపాలని, మావోయిస్టులతో వెంటనే శాంతిచర్చలు ప్రారంభించాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్-న్యూడెమోక్రసీ) ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నిరసన ప్రదర్శన జరిపారు. ఆ పార్టీ కేంద్ర కమిటీ నాయకుడు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ.. అడవులను కార్పొరేట్ రంగానికి అప్పగించేందుకు నరేంద్రమోదీ సర్కారు తలపెట్టిన ఆపరేషన్ కగార్ నిలిపివేయాలన్నారు. డ్రోన్లు, హెలికాప్టర్లతో ఈ ప్రాంతంలో సాయుధ పోలీసులు తిష్ట వేయడంతో రోజూ ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఛత్తీస్‌గఢ్- తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయానక వాతావరణంలో మగ్గిపోతున్నారన్నారు. ఆదివాసీలను అంతంచేసే హంతక విధానాన్ని విడనాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జేవీ చలపతిరావు, సాదినేని వెంకటేశ్వరరావు, కె.గోవర్ధన్, ఝాన్సీ, పీవోడబ్ల్యూ జాతీయ నాయకురాలు వి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి: జాజుల

మావోయిస్టుల సమస్యను శాంతిభద్రతల సమస్యగా కాకుండా సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యగా పరిగణించి వారితో కేంద్రం చర్చలు జరపాలని బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ మానవత్వంతో సమస్యకు పూర్తి పరిష్కారం చూపాలన్నారు. మావోయిస్టులు సైతం ఆయుధాలు వదిలి జన జీవన స్రవంతిలోకి వచ్చి పోరాడాలని కోరారు.

సామాజిక కోణంలోనే నక్సలిజాన్ని చూస్తాం

శాంతిభద్రతల అంశంగా పరిగణించం

శాంతి చర్చల కమిటీతో భేటీలో సీఎం

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నక్సలిజాన్ని తమ ప్రభుత్వం సామాజిక కోణంలో మాత్రమే చూస్తుందని, శాంతిభద్రతల అంశంగా పరిగణించబోదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని, కాల్పుల విరమణకు కేంద్రాన్ని ఒప్పించాలని కోరుతూ.. శాంతిచర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్, వైస్ చైర్మన్లు జంపన్న అలియాస్ జి.నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, నేతలు ఆదివారం సాయంత్రం సీఎంను కలిశారు. పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని సీఎంకు అందించారు. దీనిపై మంత్రులతోనూ చర్చించి నిర్ణయం తీసుకుంటానని రేవంత్ చెప్పారు. గతంలో నక్సలైట్లతో చర్చలు జరిపిన అనుభవం సీనియర్ నేత జానారెడ్డికి ఉందని, దీనిపై ఆయన సలహాలు, సూచనలు తీసుకుంటామని వెల్లడించారు. మావోయిస్టులు శాంతి చర్చలకు వస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, నక్సలైట్ల వైపు నుంచి ఎలాంటి హింసాత్మక చర్యలూ లేనంతవరకూ రాష్ట్ర పోలీసు విభాగం నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవని.. ఆయన తెలిపినట్టు సమాచారం. కాగా, మావోయిస్టులైనా, పోలీసులైనా, గిరిజనులు, ఆదివాసీలు, ఇలా ఎవరైనా.. ప్రాణం విలువ గొప్పదని, ప్రాణం పోతే తీసుకురాలేమని.. ప్రాణాలు కాపాడడానికి ప్రయత్నం చేయాలని.. సీఎంను కోరినట్టు చంద్రకుమార్ తెలిపారు. తమ విజ్ఞప్తులకు ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు.

కర్రెగుట్టల్లో భారీ గుహ


కర్రె గుట్టల్లో గుర్తించిన భారీ గుహ

» సేఫ్‌జోన్‌గా వినియోగించిన నక్సల్స్

» అర కి.మీ పొడవు.. సహజ నీటివనరులు

» వెయ్యి మంది ఉండేందుకు అనుకూలం

» బియ్యం, నిత్యావసర వస్తువుల గుర్తింపు

» కర్రెగుట్టల్లో వందల గుహలు: ఆదివాసీలు

చర్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): దుర్భేద్యమైన కర్రెగుట్టలను సేఫ్‌జోన్‌గా మలచుకున్న మావోయిస్టులు.. గుట్టల్లో ఉండే గుహలను ఆవాసాలుగా మలచుకున్నట్లు భద్రత బలగాలు గుర్తించాయి. శనివారం రాత్రి ఈ తరహాలో ఓ భారీ గుహను బలగాలు వెలుగులోకి తీసుకువచ్చాయి. ఛత్తీస్‌గఢ్ వైపు.. పూజారీ కాంకేర్ నుంచి పలు అంచెలుగా కర్రెగుట్టలు దాటాక.. ఈ గుహ బయటపడ్డట్లు జవాన్లు తెలిపారు. ఓ గుట్ట అంచులో.. సుమారు అర కిలోమీటర్ మేర ఉన్న ఈ గుహ సుమారు వెయ్యి మంది తలదాచుకునేందుకు అనుకూలంగా ఉంటుందని వెల్లడించారు. "గుహలో వెలుతురు అస్సలు ఉండదు. కటిక చీకటి. పక్కనున్న మనిషిని కూడా పోల్చుకోలేని పరిస్థితి ఉంటుంది. చెలమలతో సహజ నీటి నిల్వలు అక్కడక్కడా కనిపించాయి. 30-50 మీటర్ల ఎత్తుండే గుట్టలు చుట్టూ ఉంటాయి. దీని వల్ల వడగాల్పులు, భారీ వర్షాలు, చలిగాలుల ప్రభావం ఈ గుహపై పెద్దగా కనిపించదు. ఎండా కాలం కూడా గుహలో చల్లదనం ఉండడాన్ని గమనించాం" అని ఓ జవాను 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. జవాన్లు గుహలోకి ప్రవేశించాక.. అక్కడ బియ్యం, ఇతర నిత్యావసరాలు ఉండడాన్ని గమనించారు. కూంబింగ్ తమను సమీపిస్తుండడంతో మావోయిస్టులు ఈ గుహను వదిలి పారిపోయి ఉంటారని అనుమానిస్తున్నారు.

వందలకొద్దీ గుహలు.. గుర్తించడం కష్టం!

సుమారు 288 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన కర్రెగుట్టల్లో వందల సంఖ్యలో గుహలు ఉన్నట్లు పూజారీ కాంకేర్ పరిసరాల్లోని ఆదివాసీలు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కొన్ని గుహలు గుట్ట మొదట్లోనే ఉంటాయని, మరికొన్ని అంచుల్లో ఉంటాయని వివరించారు. ప్రస్తుతానికి జవాన్లు గుర్తించిన గుహ ఒక్కటే అయినా.. అలాంటివి వందల్లో ఉంటాయంటున్నారు. "గుహ అనగానే.. గుట్ట మధ్యలో చూడగానే కనిపించేట్లు ఉండదు. అతి సమీపానికి వెళ్లినా.. అక్కడ గుహ ఉన్నట్లు తెలియదు. గుట్టల పైనుంచి కిందకు వాలే తీగ మొక్కలు గుహను మూసివేస్తాయి. లోపల సూర్యరశ్మి కూడా సోకదు. కొన్ని గుహలు కిలోమీటరు పొడవు ఉంటాయి. వన్యప్రాణులు ఎక్కువగా ఇలాంటి గుహల్లో నివసిస్తాయి" అని స్థానికులు తెలిపారు. శనివారం రాత్రి జవాన్లు గుర్తించిన గుహ కూడా ఇదే తరహాలో ఉండడం గమనార్హం..! కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లో 'ఆపరేషన్ కగార్' ప్రారంభించాక.. మావోయిస్టులు కర్రెగుట్టలను సేఫ్‌జోన్‌గా మలచుకున్నట్లు.. సెంట్రల్ కమిటీ నేతలు కూడా ఇక్కడ సమావేశమైనట్లు ప్రచారం జరుగుతోంది.

అందాలే కాదు.. అడుగడుగునా అపాయం!

కర్రెగుట్టలో మనుగడ సాగించడం అంత సులభం కాదని స్థానికులు చెబుతున్నారు. "గుట్టల మధ్యలో చిత్తడి నేలలుంటాయి. పొడి నేలల మీదుగా వెళ్తున్నా.. అక్కడక్కడా మృత్యు కుహరాల్లా ఊబిలు ఉంటాయి. తాచుపాములు, ఇతర విషకీటకాలుంటాయి. అడవి కందిరీగలు కుడితే.. అవి కుట్టిన చోట మంటతోపాటు.. వాపు ఉంటుంది" అని స్థానిక ఆదివాసీలు వివరించారు. గత ఏడాది తెలంగాణ గ్రేహౌండ్స్ బలగాలు ఇక్కడ వారం రోజులు కూంబింగ్ నిర్వహించి, చతికిలపడిపోయినట్లు పోలీసులు గుర్తుచేస్తున్నారు. కాళ్లు వాచిపోయి, నడవలేని స్థితికి చేరుకున్నట్లు చెబుతున్నారు. "కర్రెగుట్టల్లో వాతావరణం ఉన్నపళంగా మారిపోతోంది. మండుటెండ, ఉక్కబోత ఉంటుంది. కాసేపటికే అకస్మాత్తుగా వర్షాలు కురుస్తాయి. గురువారం 15మంది జవాన్లు వడదెబ్బకు గురవ్వగా.. శని, ఆదివారాల్లో పలువురు జవాన్లు డీ-హైడ్రేషన్‌కు గురయ్యారు. అయితే.. సాయంత్రం వేళల్లో భారీ వర్షాలు కురిశాయి" అని వెల్లడించారు.

తెలుగును పరిరక్షించుకోవాల్సిందే

డిగ్రీ వరకూ ప్రథమ భాషగా బోధించాలి

దేవనాగరిలోనే సంస్కృతం పరీక్ష ఉండాలి

కార్పొరేట్ చేతుల్లో బందీగా ఇంటర్ విద్య

'మన భాష- మన హక్కు'పై చర్చాగోష్ఠిలో వక్తలు


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం, తదితరులు

పంజాగుట్ట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ తెలుగును తప్పనిసరి సబ్జెక్టు చేస్తూ జీవో జారీచేయాలి. ప్రాథమిక విద్యలో తెలుగు బోధనకు ప్రత్యేకంగా ఉపాధ్యాయులను నియమించాలి. అన్ని రకాల ద్వితీయ భాషల సిలబస్‌లో ఏకరూపత ఉండాలి. తెలుగు చదివిన వారికి పోటీ పరీక్షల్లో బోనస్ మార్కులు ఇవ్వాలి. తిరిగి తెలుగు పండిత శిక్షణ కళాశాలలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మన భాష - మన హక్కు అంశంపై సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలుగు భాష పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన చర్చాగోష్ఠిలో పాల్గొన్న వక్తలు డిమాండ్ చేశారు. తెలుగులోనే జీవోలు విడుదల చేయాలని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేటు జూనియర్ కళాశాలల్లో బోధిస్తున్న సంస్కృతం పరీక్ష దేవనాగరి లిపిలోనే రాసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణకు ఓ కమిటీ వేయాలని ప్రభుత్వానికి సూచించారు. తెలుగు రాకపోతే చరిత్ర, సంస్కృతి తెలుసుకోవడం చాలా కష్టమన్నారు. ఇంటర్ స్థాయిలో కార్పొరేట్ రంగం ఒత్తిడి చాలా తీవ్రంగా ఉందని, ఆ రంగమే ఇంటర్‌బోర్డును శాసిస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ఇంటర్‌లో తెలుగు సిలబస్ మారిస్తే బాగుంటుందని పేర్కొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశిం మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి సైతం తెలుగు మాతృభాషకు ప్రమాదం వచ్చిందని ఆందోళన వ్యక్తంచేసిందని గుర్తు చేశారు. ఇంగ్లిష్‌లోనే 'తెలుగు' చెప్పమని అనేలా ఉన్నారని, ఇది ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. ప్రముఖ కవి నందిని సిధారెడ్డి మాట్లాడుతూ ఒక్కరోజుతోనే తెలుగు భాష పరిరక్షణ సాధ్యం కాదని, దీనికి దీర్ఘకాలిక ఉద్యమం చేపట్టాలని స్పష్టంచేశారు. హిందీ, సంస్కృతం భాషల నుంచే తెలుగుకు ప్రమాదం వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ.. 'మన భాష - మన హక్కు' పేరుతో ఉద్యమించడం ఆత్మగౌరవ సమస్య అని పేర్కొన్నారు. ఇంటర్ బోర్డు అధికారి జయప్రద బాయి, ఆమె వెనుక ఉన్న వారిని దేశం నుంచి వెలివేయాలన్నారు. తెలుగు అకాడమీకి వెంటనే డైరెక్టర్‌ను నియమించడంతోపాటు తెలుగు అధికారభాషా సంఘాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. తెలుగు భాష అమలుపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాన్ని ప్రస్తావించారు.

తెలుగు భాషా పరిరక్షణ జేఏసీ నూతన కమిటీ

తెలుగు భాషా పరిరక్షణ ఐక్య కార్యాచరణ సమితి కన్వీనర్‌లుగా ఆచార్య సి.కాశిం, డాక్టర్ వెల్దండి శ్రీధర్, డాక్టర్ సంగి రమేశ్, సభ్యులుగా డా. సిల్మా నాయక్, డా.నర్సింహులు, డా.మాలతి, డా.మాణిక్యం, సలహాదారులుగా డా.నందిని సిధారెడ్డి, డా.బన్న ఐలయ్య, డా.ఉమా మహేశ్వర్ రావులతో నూతన కమిటీ ఏర్పాటైంది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.